ముహూర్తం
శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ సప్తమి, రా.8.53 వరకు అనంతరం అష్టమి; నక్షత్రం: చిత్త రా.8.10 వరకు, అనంతరం స్వాతి; అమృతకాలం: మ.2.10 నుండి 3.45 వరకు; వర్జ్యం: రా.1.39 నుండి 3.13 వరకు; దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ.12.00 నుండి 1.30 వరకు

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి:57 • సంచిక:282 • ఆదివారం 27 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 6.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool|Anantapur|Nellore



# సర్వజన సంక్షేమం

అందరికీ ఆదర్శం..
అన్నింటా అగ్రస్థానం
వర్ధిల్లుతున్న తెలంగాణం

- అభివృద్ధి, ఆర్థిక విధానాల్లో రోల్‌మోడల్
- గ్రామస్వరాజ్యం ఇక్కడినుంచే ఆవిష్కృతం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్
- కేసీఆర్ పాలనపై ప్రశంసల జల్లు

2

నేతల్లో యాగం సెంటిమెంట్

# కేబినెట్ విస్తరణ?

## కూర్పుపై సీఎం కేసీఆర్ కసరత్తు పూర్తి

6-8 మందికి అవకాశం.. ముగ్గురు కొత్తవారు?

మంత్రి పదవులపై ఆశావహుల అంచనా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిసారించారా? ఫిబ్రవరిలో విస్తరణ చేపట్టాలని నిర్ణయించారా? ముందుగానే నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం మాఘమాసంలో మంచి రోజు చూసుకుని కేబినెట్ పదవుల పందేరం చేయబోతున్నారా? టీఆర్ఎస్ వర్గాల్లో దీనికి ఔననే సమాధానం వస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ అంశంలో పూర్తిస్పష్టతతో ఉన్నా.. పదవులపై ఆశపెట్టుకున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వీరి అనుచరగణం కళ్ళల్లో వత్తులుపెట్టుకుని విస్తరణ కోసం ఎదురుచూస్తోంది. పైకి గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోన నేతలు గుబులు చెందుతున్నారు. గతంలో పనిచేసిన మంత్రులందరికీ మళ్లీ క్యాబినెట్ బెర్తులు దక్కే అవకాశం లేదు. పాత , కొత్తల మిశ్రమంగా క్యాబినెట్ కూర్పు ఉంటుందని సీఎం స్పష్టంగా ప్రకటించిన నేపథ్యంలో మొత్తం క్యాబినెట్‌లో ఆరు నుండి ఎనిమిది మంది కొత్తవారు ఉండే అవకాశం ఉందని, తొలివిడత క్యాబినెట్ విస్తరణలోనూ ఇద్దరు లేదా ముగ్గురు కొత్తవారు ఉండవచ్చున్న అంచనాలు ప్రచారంలో ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణను రెండువిడతలుగా చేయాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్ ఫిబ్రవరి 5,7,10 తేదీలలో ఏదో ఒక రోజున తొలివిడత విస్తరణ చేస్తారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో బలంగా ఉంది. 2015లో సీఎం చండీయాగం నిర్వహించిన తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టారని, ఇపుడు అదే సెంటిమెంట్ కూడా రిపీట్ అవుతుందని అంటున్నారు. ఇక కేంద్రప్రభుత్వం కూడా తొలుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతుందని భావించగా, ఇపుడు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఈ అంశాన్ని కూడా విస్తరణ నేపథ్యంలో పరిగణనలోకి తీసుకోబోతున్నారు. ఈనెల 30న మూడోవిడత పంచాయతీ ఎన్నికలు ముగియనుండగా, ఆ తర్వాత విస్తరణ తేదీని సీఎం ఖరారుచేసే అవకాశముందన్న ప్రచారం తాజాగా వినబడుతోంది. మంత్రివర్గంలోకి ఆరు నుండి ఎనిమిది మందిని తీసుకుంటారన్న ప్రచారం నేపథ్యంలో రకరకాల

➩ 9వ పేజీలో...





రాజ్‌భవన్‌లో శనివారం ఎట్‌హోమ్ కార్యక్రమంలో సీఎం కేసీఆర్, ప్రతిపక్షనేత మల్లు భట్టివిక్రమార్క, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో మాటామంతీ

# తేనీటి విందు.. కనువిందు

## రాజ్‌భవన్ ఎట్‌హోంలో కమనీయ దృశ్యాలు

- ప్రత్యేక ఆకర్షణగా పవన్ కళ్యాణ్
- కేసీఆర్, కేటీఆర్‌తో జనసేన చీఫ్ ముచ్చట్లు
- ప్రతిపక్షనేతలతో ముఖ్యమంత్రి ఆత్మీయ ఆలింగనం
- పేరుపేరునా పలకరింపు అభినందనలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ వేదికగా జరిగిన ఏట్‌హోం కార్యక్రమంలో రాజకీయ సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన తేనేటి విందు కార్యక్రమంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొదట తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీమంత్రి కేటీ రామారావు ఆయనతో కాసేపు ముచ్చటించారు. అనంతరం రెండవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కె.చంద్రశేఖర రావుకు శుభాభినందనలు తెలిపిన పవన్ ఆయన పక్కనే కూర్చుని దాదాపు 20 నిమిషాల పాటు ఏపీ రాజకీయాలపై చర్చించుకున్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, త్వరలో ఏపీలో జరగనున్న శాసనసభ ఎన్నికలపైనా ఈ ఇద్దరి మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయన్న కోణంలోనూ సీఎం కేసీఆర్ ఏపీ రాజకీయాలపై ఆరా తీసినట్టు సమాచారం. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలకు అతీతంగా దేశంలో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతు కోరినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆ రెండు పార్టీలు మినహా ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు వ్యూహం ఖరారు చేసుకున్న

➩ 3వ పేజీలో...

# దేవుడి పేరుతోనే మాన్యం రికార్డులు

## ఇక దేవాదాయ భూ రికార్డుల ప్రక్షాళన

- పక్కాగా పహణీ, సర్వే రికార్డులు
- రెవెన్యూ రికార్డుల్లో ప్రత్యేక చోటు
- పరిరక్షణ దిశగా ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎండోమెంట్ భూముల పరిరక్షణకు సర్కార్ నడుంబిగిస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన తర్వాత తాజాగా అటవీ భూముల జాయింట్ సర్వే జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడదే కోవలో దేవుడి మాన్యాల భూములను రెవెన్యూ రికార్డుల్లో దేవుడి పేరుతో రికార్డు చేయాలని సంకల్పించారు. రెవెన్యూ రికార్డుల్లో ఎండోమెంట్ భూములకు చెందిన వివరాల యాజమాన్య హక్కు కాలమ్‌లో

➩ 9వ పేజీలో...

# ఆర్థిక నేరగాళ్ల కోసం వేట

బోయింగ్ విమానంలో వెస్టిండీస్‌కు

సీబీఐ, ఈడీ అధికారుల బృందం



**న్యూఢిల్లీ:** బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాల్లో తలదాచుకున్న ఆర్థిక నేరగాళ్లను స్వదేశం తరలించేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు వేగవంతం చేశాయి. చోక్సి, జతిన్ మెహత వంటి వారిని స్వదేశం తీసుకొచ్చేందుకు ప్రత్యేక బోయింగ్ విమానంలో సీబీఐ, ఈడీ ఉన్నతాధికారులు వెస్టిండీస్ వెళ్లనున్నారు. ఈ మిషన్ కోసం ఎయిర్ ఇండియాకు చెందిన భారీ బోయింగ్‌ను కేటాయించినట్లు తెలుస్తోంది. కేసులు తప్పించుకునే క్రమంలో నిందితులు కరీబియన్ దీవుల్లోని వివాదాస్పద చెల్లింపు పౌరసత్వం తీసుకున్న సంగతి తెలిసిందే. మెహుల్ చోక్సి, జతిన్ మెహతా ఈవిధమైన పౌరసత్వంతో అక్కడ ఆశ్రయం పొందిన దరిమిలా భారత్ చర్యలు చేపట్టింది. మెహతా ఏడాది కిందట

➩ 9వ పేజీలో...

# చెట్లు నరికితే పీడీయాక్ట్

- కలప స్మగ్లింగ్ అడ్డుకట్టకు నిఘా
- రంగంలోకి జాయింట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- జంగిల్ బచావో.. జంగిల్ బడావో నినాదం
- నగరాల్లో వాకింగ్ పార్కులు, ఫారెస్ట్ బ్లాకులు
- సంరక్షణ బాధ్యత స్థానిక సంస్థలదే
- ఉన్నతాధికారులకు కేసీఆర్ మార్గదర్శకాలు
- ప్రగతిభవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష

3



# ఏంటా సంగతి!

గణతంత్ర వేడుకల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పక్కపక్కనే కూర్చున్నారు. ఇద్దరూ గుసగుసలాడుతూ... నవ్వుతూ కనిపించారు. ఆ దృశ్యాలు టీవీ ప్రత్యక్ష ప్రసారాల్లో ప్రసారమయ్యాయి. సోషల్ మీడియాలోనూ హల్‌చల్ చేశాయి. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వారేం మాట్లాడుకున్నారు? మోడీ వద్దు గడ్కరీ కావాలి అంటూ ప్రధానంగా ఎన్డీఏలో చర్చకు వచ్చిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

11 లో



న్యూఢిల్లీ: రాజ్‌పథ్‌లో గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్, ప్రధాని మోడీ, ప్రత్యేక అతిథి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు

# ఘనంగా గణతంత్ర పండుగ

- రాజ్‌పథ్‌లో అట్టహాసంగా వేడుకలు
- రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ హాజరు
- అతిథిగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు
- ప్రత్యేకంగా నిలిచిన నారీ శక్తి
- ఆకట్టుకున్న రాష్ట్రాల శకటాలు
- భారీ భద్రత నడుమ వేడుకలు

# తాయిలాలు.. శాశ్వతమేనా..?

## లోక్‌సభ ఎన్నికల వేళ రైతు కేంద్రంగా మధ్యంతర బడ్జెట్

- రుణమాఫీ శాశ్వత పరిష్కారం కాదన్నది కేంద్రం వాదన..
- మరి బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు ఉంటాయ్..?
- రైతుబంధు, కేఏఎల్‌ఏలను సమ్మిళితం చేస్తారా..?
- ఎంఎస్‌పీ, మార్కెట్ సౌకర్యాలను మెరుగు పరుస్తారా?
- మోడీ సర్కార్ ఓటాన్ బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి..

8 లో





4న కుంభమేళాకు ప్రియాంక రాజకీయ ప్రవేశం

11 లో



కేంద్రానికి కృతజ్ఞతలు

- చేసింది గోరంత... దేశం ఇచ్చింది కొండంత
- భారతరత్న అవార్డుకు ప్రణబ్ స్పందన


గణతంత్ర వేడుక సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జెండావిష్కరణ


సైనిక వందనం

# సర్వజన సంక్షేమం

• అందరికీ ఆదర్శం • అన్నింటా అగ్రస్థానం • వర్ధిల్లుతున్న తెలంగాణం • దేశానికే మార్గదర్శకం

• అభివృద్ధి, ఆర్థిక విధానాల్లో దేశానికి రోల్ మోడల్ • గ్రామస్వరాజ్యం ఇక్కడి నుంచే ఆవిష్కృతం • సంక్షేమం కోసం ఏటా రూ.40 వేల కోట్లు ఖర్చు • 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర కార్యక్రమం • ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.1.07 లక్షల కోట్లు ఖర్చు • మరో రూ.1.17 లక్షల కోట్లతో పూర్తి చేసేందుకు ప్రణాళిక • వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ • దేశంలో ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే • రైతుబంధు, జీవిత బీమా పథకాలు చారిత్రాత్మకం • టీఎస్ ఐపాస్ చట్టంతో అంతర్జాతీయ దిగ్గజాల పెట్టుబడులు • గణతంత్ర వేడుకల్లో కేసీఆర్ పాలనపై గవర్నర్ నరసింహన్ ప్రశంసల జల్లు

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** అన్నివర్గాల ప్రజల యోగక్షేమాలు కోరుతూ తమ ప్రభుత్వం సంక్షేమ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ స్పష్టం చేశారు. 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ నేడు దేశానికే దిక్సూచిగా మారుతోందని, ఒక సఫల రాష్ట్రంగా ఖ్యాతి గడించిందని తెలిపారు. జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తోందని కేసీఆర్ పాలనపై ప్రశంసల వర్షం కురిపించారు. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్చం సమర్పించి నివాళుర్పించిన అనంతరం ఉదయం 10.45 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరేడ్‌ను ప్రత్యేక వాహనంలో ప్రయాణిస్తూ తిలకించారు.

## సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ ప్రజలంతా గణతంత్ర వేడుకలను జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంలో మహనీయులు, త్యాగమూర్తులు, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడం మన విధిగా భావించాలన్నారు. వారి ఆశయాల సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రమే అయినప్పటికీ గడిచిన ఐదేళ్లలో తెలంగాణ ప్రగతి అద్భుతమైన ఆరంభాన్ని కనబరిచిందన్నారు. కేసీఆర్ నేతృత్వంలో అన్నిరంగాల్లో పునర్నిర్మాణ ప్రక్రియ ఉజ్వలంగా కొనసాగుతోందని ప్రశంసించారు. ఒకవైపు దృఢమైన నాయకత్వాన్ని అందిస్తూనే మరోవైపు రాజకీయ స్థిరత్వాన్ని నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో శాంతిని, సామరస్యాన్ని నెలకొల్పుతూ అన్ని వర్గాల ఆదరాభిమానాలు చూరగొంటున్న ప్రభుత్వంగా ప్రతిష్టకెక్కడం శుభ పరిణామమని పేర్కొన్నారు. అనేక బాలారిష్టాలను అధిగమించి రాష్ట్రం అద్భుతమైన విజయాలు సాధించిందని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజల హృదయాలను గెలుచుకున్నాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ అఖండ విజయం సాధించారని, రెండవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని, భవిష్యత్తులో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పునరంకితం అవుతోందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## కేసీఆర్ హయాం... సంక్షేమంలో స్వర్ణయుగం

రాష్ట్రంలో రూ.40వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గవర్నర్ తెలిపారు. కేసీఆర్ పాలనను సంక్షేమంలో స్వర్ణయుగంగా పేర్కొనడం సముచితమని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాలకు దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఏ రాష్ట్రం కూడా సంక్షేమ రంగానికి ఇంతటి భారీ నిధులు కేటాయించలేదన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వృద్ధుల వయోపరిమితిని 57 ఏళ్ళకు తగ్గించి పెన్షన్ పథకాన్ని వర్తింపజేయనున్నట్టు పేర్కొన్నారు. సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ కోటి 25 లక్షల ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అలాగే బహుళ ప్రయోజనాలను చేకూర్చే మిషన్ కాకతీయ పథకం ద్వారా వేలాది చెరువుల పునరుద్ధరణ జరిగిందని, తద్వారా ఆయకట్టు పెరగడంతో పాటు భూగర్భ జలాలు పురోగతి జరుగుతోందన్నారు.

## మిగులు విద్యుత్‌తో ఘన విజయం

తెలంగాణ ఆవిర్భవించే నాటికి 2,700 మెగావాట్ల విద్యుత్ కొరత ఉండగా, ప్రస్తుతం 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తున్నప్పటికీ మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ప్రజల జీవన ప్రమాణాల్లో గుణాత్మక మార్పు వచ్చిందన్నారు. పేద కుటుంబాల్లోని విద్యార్థులకు కేజీ టు పీజీ విద్యా విధానం ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించారు. 542 రెసిడెన్షియల్ స్కూళ్ళు సకల సౌకర్యాలతో నెలకొల్పడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ ఏడాది నుంచి ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 బీసీ రెసిడెన్షియల్ స్కూళ్ళు ప్రారంభించబోతున్నామని చెప్పడానికి తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పేదలకు ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉచిత ప్రసూతి సేవలు, కంటి వెలుగు పథకంతో ఉచితంగా మందులు, కళ్ళద్దాలు, ఆపరేషన్‌లతో ఎంతో మెరుగైన పరిపాలన కొనసాగుతోందన్నారు. త్వరలోనే చెవి, ముక్కు, గొంతు, దంత వ్యాధుల నిర్ధారణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేందుకు తమ ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. ఈ చర్యలవల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల శాతం 33 నుంచి 50 శాతానికి పెరిగిందన్నారు.

### వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయ అభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని అన్నారు. రైతుబంధు, రైతు జీవిత బీమా పథకాలతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని అన్నారు. ఈ రెండు పథకాలు దేశానికి రోల్ మోడల్‌గా మారడం గర్వకారణమని చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా 94 శాతం భూముల లెక్కలు తేలాయన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాన్ని ప్రోత్సహించి గ్రామీణ సంపదను, కులవృత్తులను, చేతివృత్తులను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం అనేక పథకాలను ప్రత్యేక సబ్సిడీలు, రాయితీలతో అమలు చేస్తోందన్నారు. గొల్ల, కుర్మలకు సబ్సిడీ గొర్రెలు, ముదిరాజ్, బెస్త వాళ్ళకు ఉచిత చేప పిల్లల విడుదల, చేనేత కార్మికులకు 50 శాతం సబ్సిడీపై, నూలు, రసాయనాలు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, గౌడ సోదరులు, విశ్వకర్మల కులవృత్తులకు ప్రోత్సాహకాలు, వ్యవసాయ కార్మికులకు పాడి గేదెల పంపిణీ, వెనకబడిన బీసీ కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహకారం ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు.





## త్వరలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

పేదలంతా ఆత్మగౌరవంగా బతకాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం 2.72 లక్షల రెండు పడకల గదుల ఇళ్ళ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే ఆ కల సాకారమవుతుందని తెలిపారు. అలాగే ఇల్లులేని పేద కుటుంబాలకు సొంత స్థలం ఉంటే రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలో 3,150 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేకస్థానం దక్కిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,751 గ్రామాలకు బీటీ రోడ్డు ఖచ్చితంగా ఉండాలన్న విధాన నిర్ణయం తీసుకున్నామన్నారు. పారిశ్రామిక ఉత్పత్తులు రాష్ట్రంలో భారీగా పెరిగాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని అన్నారు. టీఎస్-ఐపాస్ చట్టం తీసుకురావడంవల్ల జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.

## కొత్త చట్టంతో గ్రామస్వరాజ్యం

కొత్త పంచాయితీరాజ్ చట్టంవల్ల అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న అనేక గ్రామాలకు ప్రగతి ఫలాలు అందుతున్నాయన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌర సేవలు మెరుగయ్యాయని, పరిపాలన వికేంద్రీకరణ జరిగిందని చెప్పారు. 1,177 తండాలను గ్రామ పంచాయితీలుగా చేయడంతో అభివృద్ధికి బాటలు వేయగలిగామన్నారు. గ్రామస్థాయిలో వందల సంఖ్యలో సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నందున మహాత్ముడు ఆశించిన గ్రామ స్వరాజ్యం తెలంగాణ నుంచేఆవిష్కృతమవుతోందని గవర్నర్ ప్రకటించారు. దూరదృష్టిలో పర్యావరణ పరిరణక్ష కోసం తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో ప్రశంసనీయమన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు హరితహారం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ నిరాటంకంగా సాగుతోందని, అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నెలకొల్పుతున్నామని తెలిపారు. దీంతో నిఘా వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని, మహిళల రక్షణ కోసం షీ టీమ్‌లు సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

### సాగునీటి రంగానికి మహర్దశ

తెలంగాణ ఏర్పాటైనప్పటికీ నుంచి సాగునీటి రంగానికి రూ.99,643 కోట్లు ఖర్చు చేశారని, ఈ ఏడాది మార్చి నాటికి రూ.లక్షా 7వేల కోట్లు ఖర్చవుతోందని, రానున్న కాలంలో మరో రూ.లక్షా 17వేల కోట్ల అంచనాలతో పనులు ప్రతిపాదించామని ఈ సందర్భంగా గవర్నర్ ప్రకటించారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతం నుంచి రాష్ట్రానికి రావలసిన 1300 టీఎంసీల నీటి వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు మొత్తం రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రతిపాదించడమైందన్నారు. మిషన్ భగీరథ అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి మార్చి నాటికి వందశాతం ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. 24 గంటలు నిరంతరంగా వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టంచేశారు.

### ఆర్థికరంగంలో అద్భుత అభివృద్ధి

గత నాలుగేళ్ళుగా రాష్ట్రంలో వార్షిక సగటు ఆర్థిక వృద్ధిరేటు 17.17గా నమోదవుతూ వస్తోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నాటికి 29.93 శాతం వృద్ధిరేటును సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆర్థికపరమైన క్రమశిక్షణ పాటిస్తున్నందున అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వందశాతం లక్ష్యాన్ని చేరుకోగలుగుతున్నాయని అన్నారు. ఆర్థిక వనరులు అనేక రెట్లు పెరిగాయని, ఫలితంగా ఆ సంపద పేద ప్రజల అభ్యున్నతికి ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. పేద వర్గాల సంక్షేమం, వ్యవసాయ రంగంలో పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

### ప్రభుత్వానికి అండగా జనం

తమ ప్రభుత్వం నిబద్ధత, దీక్ష, పట్టుదలతో అభివృద్ధి లక్ష్యాలవైపు దూసుకువెళుతున్నందున ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని గవర్నర్ నరసింహన్ తెలిపారు. రానున్న కాలంలోనూ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు మరిన్ని కొత్త పథకాలు, వినూత్న కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. పేదరికం, అశాంతి, అలజడి లేకుండా పసిడి పంటలతో తూలతూగుతూ అన్ని వర్గాల ప్రజలు సమాన అభివృద్ధి ఫలాలను పొందే బంగారు తెలంగాణ త్వరలోనే ఆవిష్కృతమవుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఆ నమ్మకం, భరోసా రాష్ట్ర ప్రజల్లో బలంగా కనిపిస్తోందన్నారు. తమ ప్రభుత్వం మనసా, వాచ, కర్మణ, బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర పురోభివృద్ధికి పునరంకితం అవుతుందని ప్రకటించేందుకు గర్వపడుతున్నానని గవర్నర్ గణతంత్ర వేడుకల్లో పునరుద్ఘాటించారు.








గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమర వీరుల స్థూపం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీఎం కేసీఆర్

### షాక్‌కర్స్..!




సంపదపైనే ఆసక్తి
అధికారంపై అనురక్తి!
పెత్తనంతో అమితశక్తి
నేతాజీలకదే భుక్తి!

పంపిణీకి పోటాపోటీ
దర్పాలెన్నో చాటి!
తమకు లేరంటూ సాటి
బరిలోకి హామీలతోటి!

-దిన్నా

## చమక్కులు

### అంతేగా.. అంతేగా




ఒక్కోసారి నేతల పరిస్థితి విచిత్రంగా ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో తమపై ఆరోపణాస్త్రాలు సంధించి ఆవేశకావేశాలకు పోయిన నేతలు తర్వాత తమ పార్టీలోనే చేరి తమతోనే పనిచేస్తే.. ఆ ఆరోపణలు సరదాగా గుర్తుచేసుకుంటే చూసేవారికి, వినేవారికీ ఆసక్తి ఉంటుంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మాజీమంత్రి ఈమధ్య నేతలతో సరదా సంభాషణ సాగించిన సమయంలో.. ఎన్నికల సందర్భంలో తనపై ఆరోపణలు చేసిన నేతలను పక్కనబెట్టుకుని సరదాగా మాట్లాడారు. నన్ను ఓ ఎన్నికలో ఈయనేమో.. బలహీనవర్గాల ద్రోహి అని విమర్శించిండు. ఈ ఎన్నికల్లో పోటీచేసిన ప్రత్యర్థేమో అగ్రవర్ణాల ద్రోహి అని తిట్టిండు. ఈయన.. ఇటు విమర్శించిండు.. ఆయన అటు విమర్శించిండు. నేనెవరినో అర్థద కాకుండా పోయింది.. అయినా గా విమర్శలు నువ్వెందుకు పట్టించుకున్నవన్నా అని పక్కనున్న మరో లీడరు అంటే.. ఇగో ఈయన ఊకుంటేనే రోజూ వాట్సాప్‌లలో ఆయన ఇట్ల విమర్శిస్తుండన్నా అని కటింగ్‌లు పెట్టబట్టే అంటూ మొదటిసారి పోటీచేసిన ప్రత్యర్థివైపు చూపగానే నవ్వులు విరిశాయి. రాజకీయమంటే అంతేగా.. అంతేగా అంటూ పక్కనున్న నేతలు నవ్వేశారు.

### గుర్తు మరిచిన

ఇది ఓట్లకాలం. ఓటున్న మారాజుకు శతకోటి దండాలంటూ నేతలు ఓటర్ల చుట్టూ తిరిగే కాలం. పల్లె ఓట్లకు డిమాండ్ ఎక్కువ. ఒక్క ఓటే గెలుపుఓటములను నిర్ణయించేస్థాయిలో ఉండడంతో పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్లను బతిమిలాడుతున్నారు. ఓటర్లు బతుకుదెరువు కోసం పట్టణాల్లో ఉన్నా వారిని బతిమిలాడి.. మర్యాదలు చేసి తామే ఛార్జీలు పెట్టుకుని మరీ ఊళ్ళకు తీసుకెళ్తున్న సంఘటనలు దర్శనమిస్తున్నాయి. ఇలా తీసుకెళ్ళినా కొన్నిచోట్ల అభ్యర్థులు ఓడడంతో.. అభ్యర్థులకు డౌటనుమానాలు వచ్చి నిలదీస్తున్నారు. పల్లెలో ఎవరు ఓటేశారు.. ఎవరు ఓటేశారో మనుషులను బట్టి చెప్పేస్తుంటారు. లెక్కలు అట్లా తెలిసిపోతుంటాయి. అయితే మనోడని టౌన్ నుండి తీసుకొచ్చినోడే ఓటేయకుంటే, ఆ ఒక్క ఓటుతోనే అతను ఓడిపోతే పరిస్థితి దారుణంగా ఉంటది. అరె.. ఏం పరేషాన్ ఉందిర బై. నిన్ను బతిమిలాడి కిరాయి పెట్టి తీసుకొచ్చినా ఓటెయ్యకుంటే ఎట్లర. నిన్నేం చెయ్యాలె అని ఆ ఓడిన అభ్యర్థి నిలదీసిండట. ఆ ఓటరు అమాయకంగా ముఖంపెట్టి.. అన్నా లోపలికి పోయినంక గుర్తు మరిచిన్నే.. ఇంతకూ నీదే గుర్తే అని అనడంతో ఆ అభ్యర్థి ఫ్యూజులు ఎగిరిపోయాయట. పాలమూరు జిల్లాలోని ఓ పంచాయతీలో ఈ చిత్రం చోటుచేసుకుంది.




### నేములో ఏముంది




నేములో ఏముంది.. ఆ నేములో ఏముంది అంటే.. చాలా ఉంటది. ఎన్నికకు, పేర్లకు చాలా లింకు ఉంటది. ఎన్నికల్లో గెలుపుకోసం పేర్ల తికమకలు కాదు. ఎన్నికలు కూడా పేర్లు పెడతాయి. మన ప్రజాస్వామ్య గొప్పతనమది. సంగారెడ్డి జిల్లాలోని ఓ పంచాయతీలో నిండుగర్భిణీ అయిన మహిళ తన అత్తా,మామలతో కలిసి ఓటుహక్కు వినియోగించుకుంది. పోలింగ్ బూత్‌కు వెళ్ళగానే నొప్పులు రావడంతో ఆమెను 108ద్వారా ఆస్పత్రికి తరలించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆమెకు ఓటులక్ష్మి అని పేరుపెడుతున్నట్లు కుటుంబసభ్యులు ప్రకటించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఎలక్షన్ రెడ్డి అనే నేత ఉన్నారు. ఎన్నికలరోజు పుట్టిన కారణంగా ఆయనకు ఆపేరు రాగా, ప్రస్తుతం కార్పొరేషన్ ఛైర్మన్‌గా కూడా పనిచేస్తున్నారు. అవును.. ఎలక్షన్లు పదవులు తీసుకురావడమే కాదు.. కొందరికి నామకరణాలు కూడా చేస్తాయ్.. అని నేతలు చమత్కరిస్తున్నారు.

- కంది.రామచంద్రారెడ్డి






రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎట్ హోం కార్యక్రమంలో కేసీఆర్‌తో తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, పీసీసీ చీఫ్ ఉత్తమ్ కరచాలనం.. కేసీఆర్‌తో జానారెడ్డి ఆత్మీయ ఆలింగనం... తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జనసేనాని పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ నేత సుబ్బిరామిరెడ్డి మాటామంతీ

# తేనీటి విందు.. కనువిందు

## ఏపీ నుంచి కేఈ, పితాని హాజరు



రాజభవన్‌లో గవర్నర్ నరసింహన్ ఇచ్చిన తేనీటి విందు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మరో మంత్రి పితాని సత్యనారాయణలు హాజరయ్యారు. వారితోనూ కేసీఆర్ ఆత్మీయంగా మాట్లాడారు.



**(మొదటిపేజీ తరువాయి)**

కేసీఆర్ పవన్‌తో అత్యంత కీలకాంశాలపై చర్చించారని రాజకీయ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఇటీవల కేటీఆర్ నేతృత్వంలోని తెరాస ప్రతినిధి బృందం లోటస్‌పాండ్‌లో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో రాజకీయ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం వేదికగా వీరిద్దరి మధ్య జరిగిన చర్చలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

అందులో భాగంగానే ఎట్‌హోంలో కనిపించిన పవన్ కళ్యాణ్‌తో ప్రత్యేకంగా ముచ్చటించి ఆ రాష్ట్ర రాజకీయాలపై ఆరా తీశారు. పెద్దఎత్తున అభిమానులను కలిగి ఉన్న జనసేనానితో రాజకీయ అవసరం ఉన్నందునే అనేక మంది ప్రముఖులు ఉన్నప్పటికీ దాదాపు ఇరవై నిమిషాలకుపైగా ప్రత్యేకంగా ముచ్చటించినట్టు స్పష్టమవు తోంది. త్వరలో జరిగే ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబు పరిస్థితి ఏమిటని అడిగారు. అక్కడున్న తాజా రాజకీయ పరిణామాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ, అభివృద్ధి తదితర అంశాల గురించి కూడా తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న సందర్భంలోనే గవర్నర్ నరసింహన్ పవన్ కళ్యాణ్ వద్దకు వచ్చి కరచాలనం చేశారు.

### ఏపీ రాజకీయాలపైనే ప్రధాన చర్చ

ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపైనే ఎట్‌హోంలో పాల్గొన్న నేతల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. ఇటీవల జగన్‌తో కేటీఆర్ భేటీ, జగన్ గృహ ప్రవేశానికి హాజరయ్యేందుకు వచ్చే నెలలో కేసీఆర్ అమరావతి పర్యటన తదితర అంశాలు పవన్‌తో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. జగన్‌తో భేటీ అంశాలను పవన్‌తో కేటీఆర్ ప్రత్యేకంగా చర్చించి అవసరాన్ని, ఆవశ్యకతను వివరించినట్లు తెలుస్తోంది.

### నేతలతో కేసీఆర్ ఆత్మీయ పలకరింపులు

ఎట్‌హోం కార్యక్రమానికి హాజరైన ప్రధాన ప్రతిపక్షనేత, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సీఎం కేసీఆర్ కరచాలనం చేశారు. అక్కడే ఉన్న మాజీమంత్రి జానారెడ్డితో ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభాపక్షం నాయకుడు మల్లు భట్టి విక్రమార్కతో కరచాలనం చేసి గవర్నర్‌కు పరిచయం చేశారు. ఈ ఇద్దరు కలిసి భట్టిని అభినందించారు. తేనీటి విందులో భాగంగా కేసీఆర్ భట్టి విక్రమార్కతోనూ కాసేపు రాజకీయాలపై చర్చించారు.

### అనివార్య కారణాలతో హాజరు కాని జగన్

రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి గవర్నర్ నరసింహన్ ఆహ్వానం పంపినప్పటికీ హాజరు కాలేకపోయారు. హైదరాబాద్‌లోనే ఉన్న జగన్ ఉదయం జెండావిష్కరణ అనంతరం పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించినందున సమయాభావంతో రాజ్‌భవన్‌కు వెళ్ళలేకపోయారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ తేనీటి విందు కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ గవర్నర్ కె.రోశయ్య, కేంద్ర మాజీమంత్రులు బండారు దత్తాత్రేయ, టి.సుబ్బిరామిరెడ్డి, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాణిక్యాల రావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు జె.సత్యనారాయణ, తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, పార్టీ సీనియర్ నేత కె.కేశవరావు, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి, మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, ఏకే మహంతి, ఏకే ఖాన్, సీవీ ఆనంద్, రజత్ కుమార్, అంజని కుమార్, ఎంకే సింగ్, పలువురు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్ నరసింహన్ సంచలన వ్యాఖ్య

**కేసీఆర్ నాకు ప్రొటెక్షన్**

తేనీటి విందు ముగింపు సమయంలో అందరూ రాజ్‌భవన్ నుంచి బయటకు వెళుతున్న క్రమంలో గవర్నర్ నరసింహన్ సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఉద్దేశపూర్వకంగా అన్నారో... యాదృచ్ఛిక అన్నారో... తెలియదు కానీ 'కేసీఆరే నాకు ప్రొటెక్షన్' అన్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఆ సమయంలో అక్కడున్న కొంతమంది రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు అవాక్కయ్యారు. అనంతరం సరదాగా నవ్వుకున్నారు కూడా.




- **వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కల్వకుంట్ల తారకరామారావు తొలిసారి తెలంగాణభవన్‌లో జాతీయజెండా ఆవిష్కరణ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ కార్యక్రమాలకు అత్యధిక సమయం వెచ్చిస్తున్న కేటీఆర్ శనివారం ఉదయం జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు కోలేటి దామోదర్ గుప్తా, కిషన్‌రావు, పార్టీ రాష్ట్రనాయకులు బండి రమేష్, తెలంగాణభవన్ ఇన్‌ఛార్జి నాయిని రాజేశ్వరరావు, మాలోత్ కవిత, కిషన్‌రెడ్డి, మధు, టిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు. తొలిసారి కేటీఆర్ పతాకావిష్కరణ చేస్తుండడంతో పార్టీ కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో తెలంగాణభవన్‌కు వచ్చారు. కార్యాలయంలోని జయశంకర్ విగ్రహానికి ఈ సందర్భంగా పూలమాలవేశారు.

### నేడు డోర్నకల్‌కు కేటీఆర్

టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఉమ్మడివరంగల్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు రోడ్డుమార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 12గంటలకు మరిపెడ మండలంలో జరిగే టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి తల్లి పెద్దకర్మకు హాజరవుతారు.

# కేటీఆర్ ఉదారత

- **బాలుని గుండెజబ్బు చికిత్సకు భరోసా**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఉదారతను మరోమారు చాటుకున్నారు. గుండెజబ్బుతో బాధపడుతున్న నాలుగేళ్ళ బాలుని వైద్యచికిత్సకు భరోసానిచ్చారు. షామీర్‌పేట మండలానికి చెందిన బాలుని గుండెజబ్బుతో బాధపడుతున్న బాలుడు మిథిల్(4) వైద్యానికి రూ.8లక్షలు ఖర్చవుతుందని అంచనా వేయగా, అంతస్థోమత లేని ఆయన కుటుంబం చితికిపోయింది. శనివారం ఉదయం తెలంగాణభవన్‌కు వచ్చిన కేటీఆర్‌ను బాధిత కుటుంబసభ్యులు కలిసి తమ ఆవేదన వివరించగా, బాలుని వైద్యానికి కేటీఆర్ భరోసానిచ్చారు. కేటీఆర్ ఉదారత, మానవీయతపై కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# చెట్లు నరికితే పీడీయాక్ట్

- కలప స్మగ్లింగ్ అడ్డుకట్టకు నిఘా
- రంగంలోకి జాయింట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- జంగిల్ బచావో.. జంగిల్ బడావో నినాదం
- నగరాల్లో వాకింగ్ పార్క్‌లు, ఫారెస్ట్ బ్లాకులు
- సంరక్షణ బాధ్యత స్థానిక సంస్థలదే
- ఉన్నతాధికారులకు కేసీఆర్ మార్గదర్శకాలు
- ప్రగతిభవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష



ప్రగతి భవన్‌లో శనివారం నిర్వహించిన పోలీస్, అటవీశాఖ అధికారుల ఉన్నతస్థాయి సమిక్షా సమావేశంలో సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో అడవులు కాపాడే విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, కలప అక్రమ రవాణాపై పీడీ యాక్టు నమోదుచేసి శిక్షిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హెచ్చరించారు. అడవులు నరికి కలప స్మగ్లించే వారిని గుర్తించే పనిలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నాయన్నారు. అడవులను రక్షించే విషయంలో చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన అటవీశాఖ అధికారులను అటవీ ప్రాంతాల్లో నియమించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, అడవి నుంచి పూచికపుల్ల కూడా బయటకు పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయుధ పోలీసులు, అటవీశాఖ అధికారులతో కలిసి జాయింట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందాలు అడవిలో నిరంతర తనిఖీలు నిర్వహించడంతో పాటు అడవి నుంచి వెళ్ళే మార్గాలపై నిఘా పెట్టాలని చెప్పారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలు కలిసి తమ పరిధిలో అడవుల సంరక్షణకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అడవులు రక్షించే బాధ్యతలు నెరవేర్చాలని కోరారు. ఇప్పుడున్న సంరక్షణ, మొక్కల పెంపకం కోసం తీసుకోవలసిన చర్యలపై సీఎం శనివారం ప్రగతి భవన్‌లో పోలీస్, అటవీశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే ఝా, అడిషనల్ డీజీ జితేందర్, ఐజీలు నవీన్‌చంద్, స్టీఫెన్ రవీంద్ర, నాగిరెడ్డి, సీసీఎఫ్ రఘువీర్, సీఎంవో అధికారులు భూపాల్‌రెడ్డి, ప్రియాంక వర్గీస్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శంభీపూర్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమన్వయం.. కఠినవైఖరి

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, 'జంగిల్ బచావో... జంగిల్ బడావో' (ఉన్న అడవిని కాపాడాలి, పోయిన అడవిని పునరుద్ధరించాలి) అనే నినాదంతో అధికార యంత్రాంగం ముందుకు సాగాలన్నారు. చెట్లు పెంచడం కోసం ప్రతిష్టాత్మకమైన హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మరోవైపు అడవులు అంతరించిపోతుంటే చూస్తూ కూర్చోవడంవల్ల లాభం లేదన్నారు. అడవిని కాపాడకుంటే హరితహారం లాంటి ఎన్ని కార్యక్రమాలు అమలు చేసినా ఫలితం ఉండదన్నారు. అడవిని కాపాడే విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని, ఇందుకోసం పోలీసులు, అటవీశాఖ అధికారులు కలిసి పని చేయాలని సూచించారు. అటవీ శాఖకు సాయుధ పోలీసులు అండగా నిలుస్తారని అన్నారు.

### ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు.. పహారా

అడవులను నరికే వారిని, స్మగ్లింగ్ చేసేవారిని గుర్తించే పనిలో ఇంటెలిజెన్స్ ఉందని, వారిని గుర్తించడానికి చర్యలు చేపట్టాన్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోనే స్మగ్లింగ్ జరుగుతోందన్నారు. అడవులు ఎక్కువగా నరికివేతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఒక్క చెట్టు కూడా పోకుండా చూడాలన్నారు. పోలీసులు, అటవీశాఖ అధికారుల సంయుక్త నిర్వహణలో అడవికి వెళ్ళే అన్ని మార్గాల్లో పెద్ద సంఖ్యలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, అక్కడ సాయుధ పోలీసుల పహారా పెట్టాలన్నారు. మొత్తంగా అడవిలో ఒక్క చెట్టు కూడా నరికివేతకు గురికావద్దన్నారు.

### కలపదొంగలపై ఉక్కుపాదం

మాకు ప్రజలే ముఖ్యం.. వారి భవిష్యత్తే లక్ష్యం.. అంతకు మించి ప్రాధాన్యం మరొకటి లేదని కేసీఆర్ స్పష్టంచేశారు. భావితరాలు బాగుండాలన్న ఉద్దేశంతో అడవుల రక్షణ, పచ్చదనం పెంచడం కార్యక్రమాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకున్నామని అన్నారు. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని, కలప స్మగ్లింగ్‌కు పాల్పడేవారు ఎంతటి వారైనా చర్య తీసుకోవాలని సీఎం ఆదేశించారు. తెరాస కార్యకర్తలు, నాయకులు స్మగ్లింగ్‌కు పాల్పడితే అందరికన్నా ముందు వారినే అరెస్టు చేయాలన సీఎం చెప్పారు.

### 33 శాతం పచ్చదనం ఉండాల్సిందే

భూభాగంలో 33 శాతం పచ్చదనం ఉంటేనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని, కానీ తెలంగాణలో 24 శాతం మాత్రమే అటవీ భూమి ఉందని అధికారిక లెక్కల్లో తేలిందని సీఎం చెప్పారు. కానీ రాష్ట్ర భూభాగంలో 12 శాతం కూడా పచ్చదనం లేదని, అటవీ ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత విషాదకరంగా ఉందన్నారు. సమైక్య రాష్ట్రంలో పెద్దఎత్తున అడవులు నరికివేతకు గురయ్యాయని అన్నారు. అప్పటి పాలకులు లక్షల ఎకరాల్లో అడవి పోతున్నా ప్రేక్షకపాత్ర వహించారని, అటవీ భూమి అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోలేదన్నారు. పర్యావరణం సమతుల్యంగా లేకుంటే మానవ మనుగడ సాధ్యంకాదన్నారు. అటవీ భూభాగంలో పచ్చదనాన్ని పెంచాలని, పెద్దఎత్తున అటవీ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచాలని సీఎం సూచించారు. ప్రతి ఇంట్లో చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో చెట్ల పెంపకాన్ని విధిగా చేపట్టడం కోసం పంచాయితీరాజ్ చట్టంలో మార్పులు తెచ్చామన్నారు. ప్రతీ గ్రామంలో ఖచ్చితంగా నర్సీలు ఏర్పాటు చేయాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను స్థానిక సంస్థలు స్వీకరించాలని సీఎం కోరారు.

### వచ్చే బడ్జెట్‌లో గ్రీన్‌ఫండ్

పచ్చదనం పెంచే కార్యక్రమాలకు నిధుల కొరత ఏమాత్రం లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. కంపా నిధులను వినియోగించుకుని అవసరమైతే మరిన్ని నిధులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధుల విరాళాలు సేకరించి వాటిని గ్రీనరీ కోసం ఖర్చు చేయాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ భాగస్వామ్యాన్ని పెంచి హరిత తెలంగాణ సాధన కోసం కృషి చేయాల్సిందిగా కేసీఆర్ మార్గదర్శకాలు ఇచ్చారు. వచ్చే బడ్జెట్‌లో అడవుల సంరక్షణకు గ్రీన్ ఫండ్ కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

### ఢిల్లీ కష్టాలు మనకొద్దు

దేశ రాజధాని ఢిల్లీ తరహాలో హైదరాబాద్ నగరంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాయుకాలుష్యం పెరిగినకొద్దీ అనారోగ్యంతో పాటు అనేక సమస్యలు ఎదురవుతాయని, సమస్య పెరిగిన తర్వాత నివారించడం కష్టసాధ్యమని ఆయన స్పష్టంచేశారు. ముందుజాగ్రత్త, నియంత్రణ చర్యలు చేపట్టకుంటే భావితరాలకు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. హైదరాబాద్‌తోపాటు వరంగల్ నగరంలోనూ కాలుష్య నియంత్రణకు విరివిగా చెట్లను పెంచాలన్నారు. కొన్ని ప్రాంతాలను ప్రత్యేకంగా అటవీ బ్లాకులుగా గుర్తించి పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్‌లు, వాకర్స్ క్లబ్‌లు, ఫారెస్ట్ బ్లాకుల సంరక్షణ బాధ్యతలను స్థానిక మునిసిపల్ కార్పొరేషన్లకు అప్పగించాలన్నారు. అందుకోసం ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధం చేసుకుని చర్యలు ప్రారంభించవలసిందిగా సీఎం ఆదేశించారు.

### నిబంధనలు కఠినం చేస్తూ కొత్త చట్టం

అడవుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉన్న చట్టాలపై పూర్తిస్థాయిలో సమీక్షించి వాటిని అమలు చేయాలన్నారు. అడవి దొంగలను నియంత్రించడం, పచ్చదనాన్ని పెంచడం సామాజిక బాధ్యత అని, ఉల్లంఘించిన వారిపై కఠినమైన శిక్షలు అవసరమని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ కోసం కొత్త చట్టం రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.


GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Telephone No:7729995917
e-mail id: venkati.sandaki@gmail.com
Tender Notice No:62/2018-19/SE(W-II)/EE-II/DB/ Dt:25-01-2019

01. Number of works : 1 No
02.Value of Works (ECV) : Rs.176.32 Lakhs

| Tender Notice | | |
|---|---|---|
| 01. | Down Loading Starting Date | : 28.01.19 @ 11.00 p.m |
| 02. | Down Loading End Date | : 14.02.19 @ 2.00 p.m |
| 03. | Last Date of submission of Bid | : 14.02.19 @ 3.00 p.m |
| 04. | Date of opening Tenders (Technical Bid) | : 14.02.19 @ 4.00 p.m |
| 05. | Date of opening Tenders (Price Bid) | : 18.02.19 @ 4.00 p.m |

E-Tender Website: https://tender.apeprocurement.gov.in/
E-Mail ID for Clarifications / Communication : venkati.sandaki@gmail.com

Note: Any addendum / corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

For COMMISSIONER

స్వచ్ఛ విశాఖ మన లక్ష్యం - స్వచ్ఛ ఆంధ్ర మన గమ్యం

# ప్రియాంకంలో మెరుపులు!



సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ రాజకీయ యవనిక మీదికి కొత్త పాత్రలు ప్రవేశిస్తున్నాయి. ప్రియాంక గాంధీ రంగప్రవేశం ఆ కోవలోకే వస్తుంది. యావద్దేశానికి ఆమె కొత్త కాకపోయినా ఆమె మాత్రం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెర తీయక తప్పనిస్థితి. ప్రతి సార్వత్రిక ఎన్నికలకు ముందుగా.. ఇదుగో ఆమె వచ్చేస్తోందంటూ ప్రచారం జరిగేది. కాని అది కేవలం ప్రచారంగా మాత్రమే మిగిలిపోయేది. ఈసారి ఎలాంటి ప్రచారార్భాటాలు లేకుండానే ఆమె రాజకీయ ప్రవేశం చేసేశారు. ప్రకటన వచ్చేదాకా మూడోకంటికి కూడా తెలీదు. మామూలుగా అయితే కొద్ది నెలల ముందు నుంచీ రాష్ట్రాల పార్టీ శాఖలు తీర్మానాలు చేయడం.. ఒత్తిళ్లు పెంచడం లాంటి కార్యక్రమాలుంటాయి. కాని అవేవీ లేకుండానే చాలా నిశ్శబ్దంగా జరిగిపోయింది. ఇంతకీ కాంగ్రెస్ పార్టీలో ఆమె ఏమి చేస్తారు? ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతానికి మాత్రమే ఆమెను పరిమితం చేస్తున్నట్టు అధికారిక నియామక పత్రం చెబుతున్నప్పటికీ ఆమె పాత్ర మాత్రం అపరిమితమనే చెప్పుకోవాలి. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ కేవలం ఉత్తరప్రదేశ్ మీదే దృష్టి పెట్టి యావత్ రాష్ట్రాన్ని ఓట్లపరంగా కొల్లగొట్టి అజేయుడిగా నిలిచినట్టు.. ప్రియాంకగాంధీ కూడా ఆ రాష్ట్రం మీదే సకల శక్తియుక్తులు కేంద్రీకరించాలన్నది కాంగ్రెస్ పార్టీ వ్యూహంగా ఉన్నది. లోక్‌సభ ఎన్నికల ద్వారా అది సాధించగలిగితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠం ఆమెదేనన్నది అంతర్లీన భావం. అందుకనుగుణంగానే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈసారి యూపీ సీఎం ప్రియాంకేనన్నట్టు బాహాటంగానే చెప్పేశారు. సువిశాల భారతదేశానికి ఆయువుపట్టుల్లాంటి రాష్ట్రాలను గుర్తించి అక్కడ అత్యధిక ప్రాధాన్యత ప్రాతిపదిక మీద కృషి చేయాలని రాహుల్‌గాంధీ తలపోస్తున్నారు. అందులో భాగంగానే ప్రియాంక ఆరంగేట్రం. ఈలెక్కన మరికొన్ని కీలక రాష్ట్రాల్లో మరికొన్ని కొత్త పాత్రలు ప్రవేశించొచ్చన్న తర్కాన్ని కొందరు లేవదీస్తున్నారు. అయితే సమయం మించిపోతున్న నేపథ్యంలో దీనికి పెద్దగా ఆస్కారం ఉండకపోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లో ప్రియాంకగాంధీయే ఆలస్యంగా అడుగేశారన్న అభిప్రాయం కాంగ్రెస్ పార్టీలో బలంగా వినిపిస్తున్నది. ఈ విషయంలో బీజేపీ వ్యూహాత్మకంగా చాలా వేగంగా అడుగులేస్తుంటుంది. కేరళ, అసోం తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఆపార్టీ సంసిద్ధమైన తీరుని గతంలోనే చూశాం. ఏడాది పైచిలుకు నుంచి దృష్టిపెట్టి.. ఏ పార్టీలు బలంగా ఉండే ప్రమాదం ఉందో అధ్యయనం చేసి.. ఆయా పార్టీల్లో బలమైన నాయకులకు ఆహ్వానం పలికి ఎన్నికలను ఎదుర్కోవడంలో కమలనాథులు వారికి వారే సాటి అనిపిస్తుంది. ఈ లెక్కన చూస్తే కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వెనకబడ్డట్టే అనుకోవాలి.

ప్రియాంకగాంధీ అలవోకగా రాజకీయాల్లోకి వచ్చేసినట్టు పైకి కనిపిస్తున్నది గాని ఆమె చాలాకాలం నుంచే తెర వెనక కసరత్తు చేయడమే కాకుండా కాంగ్రెస్ రాజకీయాల్లో అప్రత్యక్షపాత్రలో ప్రత్యక్షంగానే ఉన్నారని వినికిడి. అయితే ఈ విషయం గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్‌లోని అత్యంత కీలక నేతలకు మాత్రమే తెలుసు. పలువురు సీనియర్ నేతలకు కూడా ఈ విషయం పొక్కకుండా జాగ్రత్త పడ్డారని వినికిడి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ గులాం నబీ ఆజాద్‌కి కూడా ఈ విషయంలో ఏమాత్రం ప్రమేయం లేదని తెలుస్తున్నది. రాహుల్‌గాంధీ ఆ రోజు అమేథీలో ప్రకటించేదాకా అత్యంత రహస్యంగా ఉంచారు. కేవలం కాంగ్రెస్‌లోని గాంధీ కుటుంబ సన్నిహితులకు మాత్రమే.. అంటే ఒకరకంగా బంధువర్గానికి మాత్రమే ప్రమేయం ఉన్నట్టు తెలుస్తున్నది. ఆమె రాకను రహస్యంగా ఉంచినంత మాత్రాన ఆమె వీరందరినీ కాదని తానొక్కరే చక్రం తిప్పి అండపిండ బ్రహ్మాండాన్ని బద్దలు చేస్తుందని ఎవ్వరూ అనుకోరు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ల సహకారం లేనిదే అడుగైనా వేయలేరని ఇటీవలి కొన్ని పరిణామాలు స్పష్టం చేశాయి. రాహుల్‌గాంధీ తనదైన శైలిలో పార్టీలోకి కొత్త రక్తాన్ని ప్రవేశపెట్టాలని దశాబ్దకాలంగా ప్రయత్నిస్తున్నారు. కొండొకచో ఆయన ప్రయత్నాలు సఫలం అవుతున్నాయి. అంతమాత్రాన ఒక్కసారిగా ఏకమొత్తంగా కింది నుంచి పైదాకా మార్పులు సాధ్యం కాదన్న విషయాన్ని గ్రహించి ఇంతకాలం ఆయన లౌక్యంగా మసులుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి వయోవృద్ధుల సమస్య తీవ్రంగా ఉందని కాంగ్రెస్‌లోని ఒక వర్గం బాహాటంగానే చెబుతుంటుంది. ఆ సీనియర్ల స్థానంలో యువతను తెరమీదికి తేవాలన్నది రాహుల్ నిశ్చితాభిప్రాయం. అయితే ఈ ప్రయత్నం ఆయన తృప్తి మేరకు జరగడం లేదు. మొన్నటికి మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అశోక్ గెహ్లాట్, కమలనాథ్‌లను నమ్ముకోక తప్పలేదు. తప్పనిసరి చోట్ల సీనియర్లకు జీ హుజూర్ అంటూనే రాహుల్ గాంధీ తనకే సొంతమైన విభిన్నశైలిలో వెళుతున్నారు. ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి గతంలో మాదిరి లాబీయింగ్ నేతల మీద ఆధారపడకుండా ఒక సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకుని.. రాష్ట్రాల్లో దశలవారీగా భిన్న పద్ధతుల్లో సర్వేలు చేయించి.. రాష్ట్ర పీసీసీలు ఇచ్చే జాబితాలతో తన జాబితాలు సరిపోల్చి చూసి.. ఇలా అభ్యర్థుల్ని ఎంపిక చేయడంలో తన పాత్ర తప్ప వేరెవరి ప్రమేయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సీనియర్ల నుంచి అసంతృప్తిని చవిచూడకుండా మరోవైపు నుంచి యువతను తెరమీదికి తెచ్చే కార్యక్రమాన్ని రాహుల్‌గాంధీ కొనసాగిస్తున్నారు. ప్రియాంక గాంధీ అయినా ఇదే పద్ధతిని అవలంబించక తప్పని స్థితి పార్టీలో నెలకొని ఉన్నది. కాకపోతే ప్రియాంకగాంధీ తన అన్నలాగా మొహమాటస్తురాలు కాదు. అందర్నీ కలుపుకొనిపోయే ప్రక్రియలో రాహుల్‌గాంధీ కొంత సంయమనంతో వ్యవహరిస్తారని కాంగ్రెస్ వర్గాల కథనం. మరి ప్రియాంకగాంధీ అంతటి సంయమనం పాటిస్తారా అన్నది ప్రశ్న. రాహుల్ గాంధీలో కన్నా ఆమెలో దూకుడుతత్వం ఎక్కువగా కనిపిస్తుంది. సత్వర నిర్ణయాలకు అది ఉపకరిస్తుంది గాని కొన్ని సందర్భాల్లో బెడిసికొట్టే ప్రమాదమూ ఉంది. ఆ దూకుడు ఒక సానుకూలాంశంగా ఉంటే ఆమె సత్ఫలితాలు సాధిస్తారు. ఇప్పటిదాకా ఆమె మీద ఎలాంటి క్రీనీడలు లేవు. పైగా యావత్ కాంగ్రెస్ శ్రేణులు ఆమె రాకను హర్షిస్తున్నాయి. ఇది ఆమెకు నైతికంగా పెద్ద ప్లస్ పాయింట్. ఆమెలో ఇందిరాగాంధీ పోలికలుంటాయని అంటుంటారు. భౌతికమైన పోలికలెలా ఉన్నా మానసికంగా ప్రియాంకగాంధీ తన నానమ్మలాగా ఉంటారా అన్నది ప్రశ్న. ప్రియాంక సన్నిహితుల కథనం ప్రకారం ఇందిరాగాంధీ మాదిరే ప్రియాంక కూడా తాను నమ్మిన వారికోసం ఎంతైనా శ్రమిస్తారు. ఇందిరిగాంధీ తన హయాంలో తనని నమ్మి తనతో ఉన్నవారిని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వారు ఎన్నికల్లో గెలిచినా ఓడినా నిమిత్తం లేకుండా వారికి అండగా ఉండేవారు. ఆమె కోటరీలో సురక్షితంగా ఉన్నవారిలో ప్రణబ్ ముఖర్జీలాంటి వాళ్లు చాలామందే ఉండేవారు. ప్రియాంక గాంధీ కూడా ఇదే విషయాన్ని తనని తానే ప్రశ్నించుకోవడం కాకుండా తన సన్నిహితుల వద్ద చర్చిస్తుంటారని అంటుంటారు. ప్రియాంకగాంధీ హావభావాల్లో.. ఆహార్యంలో.. నడకలో దూకుడుగా కనిపించినప్పటికీ ఆమెలో కరకుదనం గాని మొండి పట్టుదలలాంటివి గాని లేవని ఆమె సన్నిహితులు చెబుతుంటారు. ఇందుకు ఉదాహరణలు కూడా వారు ఉదహరిస్తుంటారు. తన తండ్రి హత్య కేసులో నేరస్తురాలిగా జైలు జీవితంలో ఉన్న నళినిని చూడటానికి ఆమె తమిళనాడులోని జైలుకి వెళ్లారు. తన తండ్రిని ఎందుకు హత్య చేశారో తెలుసుకోవాలని.. దీనికి సమాధానం దొరకాలంటే నళినితో మాత్రమే మాట్లాడాలని ఆమె భావించారు. నళినిని ఆమె మన్నించేశారు. ఇది ఆమెలోని మానవతా కోణంగా వారు చెబుతుంటారు. అలాగే 1999 ఎన్నికల్లో అరుణ్ నెహ్రూ రాజీవ్‌గాంధీని వీడి వీపీసింగ్‌తో జత కట్టారు. ఆ తర్వాత బీజేపీలో చేరి రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసిన సంగతి తెల్సిందే. అప్పట్లో బోఫోర్సు కుంభకోణం సంచలనమై ప్రతిపక్షాలకు ఎన్నికల ప్రధానాస్త్రంగా మారిన సందర్భమది. పైగా ఆ కుంభకోణంలో అరుణ్ నెహ్రూకీ పాత్ర ఉందని ప్రచారం జరిగింది. నిజానికి అరుణ్ నెహ్రూ రాజీవ్ కుటుబానికి బంధువే. అరుణ్ నెహ్రూ తన తండ్రి రాజీవ్‌తో కలిసి రాజకీయ పోరాటం చేయాల్సి ఉండగా శిబిరం మార్చేసి తమకు ద్రోహం చేశారని ప్రియాంకగాంధీ భావించేవారు. అందుకే ఆమె అప్పటి ఎన్నికల్లో రాయ్‌బరేలీ నియోజకవర్గ ఓటర్లను ఒకటే ప్రశ్న వేసేవారు. నా తండ్రికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తిని రాయ్‌బరేలీలోకి ఎలా రానిస్తారు? ఎక్కడికి వెళ్లినా ఇదే ప్రశ్నతో ఆమె తన ప్రసంగాలను ప్రారంభించేవారు. అదే ప్రియాంక గాంధీ అరుణ్‌నెహ్రూ 2013లో చనిపోయినప్పుడు ఆయన అంత్యక్రియల బాధ్యత తీసుకున్నారు. ఆమె ఎప్పుడు న్యూయార్క్ వెళ్లినా అరుణ్‌నెహ్రూ కుమార్తె రాధిక ఇంట్లోనే ఉంటారట. దీన్నిబట్టి ఆమె కుటుంబ సంబంధాలకు ఎక్కువ విలువిస్తారని ఆమె సన్నిహితులు చెబుతుంటారు. ఇవన్నీ ఆమె మనస్తత్వాన్ని తెలుసుకోవడానికి ఉపకరించే సంఘటనలే. అందుకే ఇటీవల ఇలాంటి ఎన్నో ఉదాహరణలను ఆమె సన్నిహితులు వివిధ మార్గాల ద్వారా ప్రజల్లోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె రాజకీయాల్లోకి ఇప్పుడే వచ్చినా.. తెర వెనక ఎంతో కాలంగా ఆమె పార్టీతో అనుబంధంగా ఉన్నారు. ఆమె ఎందర్నో కాంగ్రెస్ పార్టీలోకి చేర్చిన సంగతిని కూడా మరువకూడదు. మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రియాంకే కారణం. ఇదే విషయాన్ని సిద్ధూయే చాలాసార్లు చెప్పారు. అలాగే హాకీ లెజెండ్ పర్గత్‌సింగ్. అంతేకాదు. ఉత్తరప్రదేశ్‌లో కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో అలయెన్సు కుదుర్చుకోవాలని రాహుల్‌ని, అఖిలేష్‌ని, డింపుల్ యాదవ్‌ని బలవంతం చేసి ఒప్పించిందీ ప్రియాంకే. సరే దాని ఫలితాలు ఎలా ఉన్నాయనేది కాదిక్కడ. ఆమె కాంగ్రెస్ పార్టీలో ఏస్థాయిలో క్రియాశీలకంగా ఎంతకాలం నుంచీ ఉన్నారన్నదానికే ఇదంతా. ప్రియాంకగాంధీ రాకతో రాహుల్ రాజకీయంగా తన ఇమేజీని కొంతమేరకైనా ఫణంగా పెట్టినట్టా అన్న చర్చ నడుస్తున్నది. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌తో పాటు మరికొందరు బీజేపీ సీనియర్ నేతలు అంటున్నట్టు రాహుల్ వల్ల కాకనే ఆమెను తీసుకొచ్చారన్న ప్రచారం జనంలోకి వెళుతుందా? ఇలాంటి సున్నితమైన అంశాలను పట్టించుకోకుండా చెల్లెల్ని రంగప్రవేశం చేయించిన రాహుల్‌గాంధీని మెచ్చుకోవాల్సిందే. రాజకీయంగా ఒక లక్ష్యాన్ని సాధించాలంటే కొన్ని త్యజించాలన్న సూత్రాన్ని రాహుల్‌గాంధీ ఇటీవల మనసా వాచా అమలు చేస్తున్నారనడానికి మనకు కొన్ని ఉదాహరణలు కళ్లముందున్నాయి. అయితే ప్రియాంక రావడం వల్ల రాహుల్ అస్తిత్వానికి ఎలాంటి భంగం వాటిల్లకపోవచ్చు. ఇక్కడ స్పష్టమైన విభజనరేఖ గీశారు. ప్రియాంకను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగాను, కాలం కలిసొస్తే రాహుల్‌ను ప్రధానమంత్రి పీఠానికి కాంగ్రెస్‌వాదులు నిర్ణయించేశారు. అందువల్ల రాహుల్‌కి ఆమె రాకతో లాభమే గాని నష్టమేమీ ఉండదని ప్రయివేటు సంభాషణల్లో కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. యూపీలో ఆమె ప్రభావం ఏమాత్రం ఉంటుందన్నది అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తున్నది. ఆ రాష్ట్రంతో నెహ్రూ-గాంధీ కుటుంబానికి తరాల అనుబంధం ఉందన్న సంగతి అందరికీ తెల్సిందే. ప్రియాంక-రాహుల్ తరమూ అదే కోవలో గుర్తింపుని కలిగిఉంది. ఉత్తరప్రదేశ్‌లో.. ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలో ఎవరైనా ఎవ్వరినైనా భయ్యా అని పిలవడం పరిపాటి. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఒకరినొకరు అలానే పిలుచుకుంటారు.. ఆడామగా తేడాలేకుండా. మన దగ్గరైతే మగవారినే భయ్యా అనడం రివాజు. కాని అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లో ప్రియాంకగాంధీని భయ్యాజీ అనే అంటారు. ఇది ఆమెకు కొత్త అనుభవమేమీ కాదు. దీనికి కారణం లేకపోలేదు. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు ప్రియాంక, రాహుల్ ఇందిరాగాంధీతో కలిసి నియోజకవర్గాలకు వెళుతుండేవారు. అలాగే తండ్రి రాజీవ్‌గాంధీ హయాంలోనూ. అప్పట్లో ఆ పిల్లలిద్దరూ పొట్టి జుట్టుతో ఒకే ఆహార్యంతో కనిపించేవారు. దాంతో అక్కడి జనం ప్రియాంకను కూడా అబ్బాయిగానే భావించేవారు. దాంతో ఇద్దర్నీ భయ్యాజీ అంటూ సంబోధించారు. ఆమె ఇప్పుడు పెద్ద పిల్లలకు తల్లయ్యాక కూడా అదే భయ్యా ఆమెకు స్థిరపడిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ నుంచీ పెద్ద నాయకులే ఉన్నారు. అయితే ప్రియాంక- రాహుల్ ద్వయంతో ఉండే సెంటిమెంటు సంబంధాలు వారికి లేవు. ఇదే కమలనాథుల్ని వేధిస్తున్న అంశం.

ఇక తెలుగురాష్ట్రాల్లో రాజకీయాల విషయానికొస్తే.. తెలంగాణలో సీఎం కేసీఆర్ సహస్ర చండీయాగం నిర్వహించారు. మరొక్కసారి యావత్ దేశాన్ని తనవైపు తిప్పుకున్నారు. ఆధ్యాత్మికం, రాజకీయాలు పొంతనలేని దారులే అయినా ఆయన మాత్రం ఆ రెండింటిని సమన్వయం చేసి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నారు. ఏక్షణమైనా కేబినెట్ విస్తరణ జరగొచ్చనే వాతావరణంలో ఎమ్మెల్యేలందరూ ఆయనవైపే చూస్తున్నారు. ఆయన మాత్రం గుంభనంగా ఉంటున్నారు. యాగం అయిపోయింది కాబట్టి ఆయనిక ఈ పెండింగ్ అంశం మీద దృష్టి పెట్టక తప్పదన్నట్టు తెరాస వర్గాలు ఎదురుచూస్తున్నాయి. రెండువారాల్లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున ఆలోపు కేబినెట్ ఏర్పాటు తప్పదన్న ధీమా వారిలో వ్యక్తమవుతున్నది.


ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణం. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున ఆ వేడి రోజురోజుకీ అధికమవుతున్నది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల వరాలు ప్రకటిస్తూ పావులు కదుపుతున్నారు. అక్కడ చతుర్ముఖ పోటీ అనివార్యమని తాజా రాజకీయ ప్రకటనల ద్వారా స్పష్టమవుతున్నది. తెలుగుదేశం, వైకాపా, జనసేన, కాంగ్రెస్ పార్టీలు ఎవరికి వారే ఒంటరిగా పోటీ చేసే సూచనలైతే స్పష్టమవుతున్నాయి. అయితే ఈ స్పష్టమైన వాతావరణంలో అనుమానపు రాళ్లువేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు అర్థమవుతున్నది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాను వామపక్షాలతో మాత్రమే జట్టుకడుతున్నట్టు పదేపదే చెబుతున్నా.. తెలుగుదేశం నేతల వేరే భాష్యాలతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే ఎవరు ఎవరితో జట్టు కడుతారన్నది ఇప్పటికిప్పుడు పెద్ద ప్రశ్న కాకపోయినా.. ఎన్నికలయ్యాక మాత్రం ఎవరో ఒకరు ఎవరితోనైనా జట్టు కట్టాల్సిన పరిస్థితి వస్తే ఏమిటన్నది ఓటర్ల ముందున్న సందేహం. ఇది అసెంబ్లీ ఎన్నికలకే కాదు అటు లోక్‌సభ ఎన్నికలకూ వర్తిస్తుంది. తెలుగుదేశంతో పొత్తు లేదని తేలాక ఏపీకాంగ్రెస్ పార్టీ ఉత్సాహంగా ఉందా లేక నిరుత్సాహంతో ఉన్నదా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. ప్రియాంక గాంధీ రంగప్రవేశంతో వారిలో కొత్త ఆశలు పుట్టుకొస్తున్న మాటైతే నిజం. ఆమె గనక రాష్ట్రంలో ఒక్కసారి తిరిగితే తమ పార్టీ పరిస్థితి గణనీయంగా మారుతుందని కాంగ్రెస్‌లోని ఆశావహులు అంటున్నారు. ప్రియాంక గాంధీ ఉత్తరప్రదేశ్ వదిలి ఆంధ్రప్రదేశ్ వస్తారా అన్నది వేచిచూడాల్సిందే!

**-వయ్యస్సారెస్**

# మహాభారతంలో... సీతాదేవి

తనను దర్శింప వచ్చిన మార్కండేయ మహామునితో ధర్మజుడిలా అన్నాడు. నాలాగా, ద్రౌపదిలాగా ఇడుములు బడిన రాజులు రాణులున్నారా? అని. మిక్కిలి దుఃఖపడుతున్నానని పలుకవద్దు. నీకన్నా అధికంగా కష్టపడిన రాముడు లేడా? సీతామహాదేవి లేదా? అని పలికి రామకథను మార్కండేయుడు ధర్మజుడికి ఇలా చెప్పాడు. వ్యాసమహర్షి ఆదికవి వాల్మీకి ననుసరించే సంగ్రహంగా రామాయణాన్ని మహాభారతంలో వ్రాశాడు. అది ఇక్ష్వాకు వంశం. అందు అజుడు ఓ రాజు. ఆతడి కుమారుడు దశరథుడు. ఆతడికి ముగ్గురు భార్యలు. పుత్రకామేష్టి వలన కౌసల్యకు శ్రీరాముడు, కైకకు భరతుడు, సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అనే నలుగురు పుత్రులు కలిగారు. వారు పెరిగి పెద్దవారై సకలవిద్యాపారంగతులయ్యారు. అందు అగ్రజుడు, అతిలోకోతరగుణుడు, అయిన రాముడికి దశరథుడు యౌవరాజ్యపట్టాభిషేకం చేయ నిర్ణయించగా, మంథర మాయదారి మాటలతో మనసు మారిన కైక రాముడిని పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యానికి పంపి తన పుత్రుడు భరతుడికి పట్టాభిషేకం చేయమన్నది. పతి తనకెప్పుడో ఇచ్చిన వరాన్ని ఇపుడు ఆయుధంగా ధరించి రాముణ్ణి తాను కన్నతల్లి కౌసల్య కన్నా అతిగా ప్రేమించేవాడిని అడవులకు పంపింది. రామవియోగ దుఃఖంతో దశరథుడు మరణించాడు. భరతుడు తల్లిని దూషించి రాముణ్ణి ప్రార్థించి పాదుకలతో మాత్రమే వెనుదిరిగి నందిగ్రామమందే నివసించి పరిపాలన సాగిస్తున్నాడు. నెమ్మదిగా రాముడు చిత్రకూటాన్ని దాటి దండకారణ్యానికి వచ్చి అక్కడ గోదావరీతీరంలో భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణుడితో నివసించదొడగాడు. సీతాదేవి, లక్ష్మణుడు ఎంత వారించినా వినకుండా రాముడి వెంట అరణ్యానికి వచ్చారు. సీత అర్ధాంగి. అరణ్యం అంతఃపురం కాదు. మృగరాక్షస భయంకరం. స్త్రీలకు మిక్కిలి బాధాకరం. అయినా ఆమె పత్నీధర్మాన్ని పాటించి వనవాసానికి వచ్చింది. ఇంతలో శూర్పణఖ రామలక్ష్మణుల్ని చూసి మోహించి సీతకు అపకారం తలపెట్టింది. దాంతో ఆమె ముక్కు చెవులు తెగగోసి శిక్షించి అవమానపర్చారు. శూర్పణఖ రావణుడి సవతిసోదరి.

అవమానపడిన శూర్పణఖ రావణుణ్ణి ఆశ్రయించింది. రావణుడు రాముణ్ణి పరాభవింప సమకట్టాడు. లంక విడిచి గోకర్ణానికి వచ్చాడు. అక్కడే మారీచుడు రాముడివల్ల బాధింప బడి మునివృత్తిలో ఉన్నాడు. మారీచుడు రావణుడికి పూర్వ సచివుడు. రావణుడి ప్రయత్నం తెలిసి రాముడితో వైరం అనర్థదాయకమని చెప్పాడు. అయినా రావణుడు వినలేదు. నామాట మన్నించకుంటే ఇపుడే నిన్ను వధిస్తానన్నాడు. తన మరణం రావణుడిచేత కన్నా రాముడిచేత మిన్నయని భావించి బంగారు లేడియై రాముడు పర్ణశాల సమీపంలో తిరుగాడజొచ్చాడు మారీచుడు. సీతాదేవి ఆ స్వర్ణమృగాన్ని చూచింది. దానిని పట్టి తెమ్మని రాముణ్ణి కోరింది. రాముడు లక్ష్మణుణ్ణి సీతకు రక్షకుడిగా నిలిపి ఆ మృగాన్ని పట్టి తేవడానికి వెళ్లాడు. అది అందక చాలా దూరం త్రిప్పింది. ఇంతలో అది మాయా మృగమనే శంక రాముడికి కలిగి బాణం సంధించి వదలాడు. బాణం తగిలి నేలకొరుగుతూ రాముడి కంఠధ్వనిని అనుకరిస్తూ మారీచుడు లక్ష్మణా! సీతా! అని కేక పెట్టాడు. ఆ ధ్వని సీతాలక్ష్మణులు విన్నారు. సీత భయపడింది. రాముడు అపాయంలో ఉన్నాడనుకున్నది. రక్షించడానికి లక్ష్మణుణ్ణి వేగంగా వెళ్లమన్నది. లక్ష్మణుడు అది రాక్షసమాయ.




రాముణ్ణి ఎవరూ ఏమీ చేయలేరు. త్వరగా వస్తాడు. నాకు నీరక్షణ ముఖ్యం అన్నాడు. ఆమె ఒక స్త్రీ. సామాన్య కాదు. స్వర్ణమృగం ఉండదని ఆమెకు తెలుసు. పట్టితేవడానికి వెళ్లిన రాముడికీ తెలుసు. అంతేకాక ఆమెకు రాముడి శౌర్యప్రతాపాలు తెలుసు. అయినా అదో బలహీనక్షణం. భయవిహ్వల అయ్యింది. విచక్షణ నశించింది. పాతివ్రత్యం గల ఒక సామాన్యమైన స్త్రీగా మారింది. శీలరక్షణ గుర్తొచ్చింది. లక్ష్మణుడు అకృత్యం తలపెడతాడేమోనని అనుమానించింది. పుత్రతుల్యుడైన లక్ష్మణుణ్ణి శంకించింది. భయం, అనుమానం, కోపం ముప్పిరిగొన్నాయి. నేను విషాగ్నుల్ని ఆశ్రయించి ప్రాణం విడుస్తానేగాని నీకు దక్కను. ఆ మాటలు వినలేక లక్ష్మణుడు రాముడి రక్షణకై వెళ్లాడు. సీతాదేవి భూమిజ. రాజర్షి జనకుడి పుత్రిక. జనకుడు మిక్కిలి గుణగరిష్ఠుడు. ఆయన పెంపకంలో పెరిగిన గుణవతి. ఎందుకో భావోద్రేక అయి లక్ష్మణుణ్ణి అవమానించి ఆపద కొని తెచ్చుకున్నది. లక్ష్మణుణ్ణి నిందించిన ఆ పాపమే రావణుడు ఆమెను ఎత్తుకుని పోవడానికి సహకరించింది. లేకుంటే అది అంత సాధ్యమైన పనికాదు. ఇట్టి అదనుకై వేచియున్న రావణుడు మునివేషంలో కుటీరానికి వచ్చాడు. సీత ఆతణ్ణి నిజమైన మునిగానే భావించి పూజించింది. ఆతడు మదనపరవశుడై తన నిజస్వరూపాన్ని చూపి తనను పరిగ్రహించమన్నాడు. సామాన్యమానవుడైన రాముణ్ణి విడిచి పెట్టి సుఖించమన్నాడు. సూర్యచంద్రులు గతులు తప్పినా, జలనిధులింకినా ఆ పని జరగదన్నది. కాని ఆతడు ఆమెను భయపెట్టి పట్టుకుని పుష్పకాన్ని ఎక్కి లంకకై వెళ్లసాగాడు. అపుడామె దేవతల్ని, భూదేవతల్ని రక్షింపమని ప్రార్థించింది. నేను రాముడి ధర్మ పత్నిని, జానకిని. ఒక రాక్షసుడు అపహరిస్తున్నాడు దయతో కాపాడమన్నది. ఆ మాటలు విన్న జటాయువు ఘోరవీరంగా రావణుడితో పోరి ఆతడు రెక్కలు ఖండింపగా ఓడిపోయాడు. పుష్పకం వేగంగా సాగుతున్నది. ఒక పర్వతశిఖరంమీద కొందరు వానరులు కన్పించారు. దాంతో తన పెయిట చెంగును కొంతకు కొంత చించి భూషణావళిని అందుకట్టి జారవిడిచింది. తర్వాత రావణుడు లంకకు చేరి సీతను అశోకవనంలో ఉంచి రాక్షసీగణాన్ని రక్షణగా నిలిపాడు. ఈ లోపు రావణుడు పలు విధాలుగా సీతను పొందడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. కాపున్న రాక్షస స్త్రీలు సీతను మిక్కిలి బాధింపదొడగారు. చంపదలిస్తే చంపమన్నది. ఆ స్త్రీలలో ధర్మజ్ఞ అయిన త్రిజట జానకిని ఊరడించింది. నేను స్వప్నంలో రావణుడు, ఆతడి బంధువులు అవలక్షణులై చనిపోయే స్థితికి చేరడాన్ని చూశానని, రామలక్ష్మణులు సుగ్రీవాదులు దివ్యతేజస్సులో వెలుగొందడం చూశానని చెప్పింది. నా కల నిజమవుతుందన్నది పైగా రావణుడు నిన్ను బలాత్కరించడని, స్త్రీని బలాత్కరిస్తే చనిపోయే శాపం ఆతడికి ఉన్నదని పలికింది. దాంతో సీతకు కొంతకు కొంత వంత తీరింది.

రావణుడు అప్పుడప్పుడు సీత దగ్గరకు వచ్చి తనను స్వీకరించి భోగించమని పలికేవాడు. తనవైభవాన్ని ప్రకటించేవాడు. సీత దుఃఖిస్తూ ఆతడి వైపు చూడకుండానే ఒక గడ్డి పరకవైపు చూస్తూ ముఖానికి కొంగుకప్పుకుని పలికేది. తిరస్కరించేది.


హనుమంతుడు వచ్చి రామలక్ష్మణుల క్షేమసమాచారం చెప్పగా హనుమంతుణ్ణి నమ్మింది. కొద్దిగా సంతసించింది. గురుతుగా తన శిరోభూషణాన్ని ఇచ్చింది. నీకు కార్యసిద్ధి అవుతుందని దీవించింది. రావణమరణానంతరం అవింధ్యుడు విభీషణుడితో కూడి సీతను రాముడి దగ్గరకు తీసుకుని వచ్చి పరిగ్రహించమన్నాడు. కాని రాముడు ఇలా పరుషంగా పలికాడు. ఇంతకాలం పరాయివాడి యింటగల నిన్ను స్వీకరిస్తే నన్ను లోకం నిందించదా?

అవమానభారం దించుకోవడానికై రావణుణ్ణి చంపాను. నీకోసం మాత్రం కాదు. నీవు పతివ్రతవైనా, కాకపోయినా నిన్ను నేను స్వీకరించను. నీవు కుక్క ముట్టిన పురోడాశం మాదిరివి అయ్యావు నీవు. ఇక్కడ ఉండరాదు. నీ యిష్టం వచ్చిన చోటుకు వెళ్లమన్నాడు. ఆ మాటలు విన్న ఆమె మొదలు నరికిన అరటి చెట్టులాగా నేలకొరిగింది. నెమ్మదిగా తెప్పరిల్లి ఇలా పలికింది. నేను అగ్నిప్రవేశం చేసి నా పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటాను అపుడే నన్ను స్వీకరించమన్నది. పంచభూతాలు ఆమె పాతివ్రత్యాన్ని పొగిడాయి. తర్వాత బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై జానకి పాతివ్రత్యాన్ని ధ్రువీకరించాడు. రావణుడు ఆమెను బలాత్కరించడు. ఆతడికి నలకూబరుడి శాపం ఉంది. కావున సీతయందు ఎట్టి దోషమూ లేదు. స్వీకరించమన్నాడు. సీతాదేవి రాముడే ప్రాణంగా జీవించింది. ఆయన కోసమే బ్రతికింది. వలదన్నా అరణ్యానికి వచ్చింది. దుష్టుణ్ణి వధించి తనను తీసుకువెళ్లగలడనే ఆశే, నమ్మకమే ఆమెను బ్రతికించింది. ఆమె నిలువెత్తు సౌశీల్యం. రూపుదాల్చిన పాతివ్రత్యం. రామాయణం సీతాయాః చరితం మహత్తు అని గదా. అది శ్రీమద్రామాయణం కాదు. శ్రీరామాయణం. శ్రీ అంటే సీతాదేవి. సీతారాముల జీవనయానం - శ్రీరామాయణం. ఇద్దరూ ముఖ్యులే. అలాంటి ఆమెను రాముడు ఆ విధంగా అవమానించడం ఎంతైనా తగనిదే. లోకమే ముఖ్యం కావచ్చు. లోకాపవాదానికి భయపడి ఉండవచ్చు. తర్వాత రాముడి అనుమానం నిజమే అయి ఉండవచ్చు. ఎవ్వడో ఒకడు నిందించి ఉండవచ్చు. అవి అన్నీ ముఖ్యం కాదు. తానే ముందుగా అంతమాట అనడం పొరపాటే. ఎంతటి వారైనా స్త్రీ విషయంలో అంతటి నిర్దయగా, చులకనగా ప్రవర్తించడం పితృస్వామ్యసమాజ దౌష్ట్యానికి ప్రతీక కాక మానదు. నలుడూ

దమయంతిని ఈ విధంగానే అనుమానించాడు. జూదంలో పందెంగా కూడా పెట్టాడు. ధర్మరాజు ద్రౌపదిని ఒడ్డి ఓడాడు.వ్యాసుడు వాల్మీకి కన్నా భిన్నంగా సీతను అగ్నిప్రవేశం నుంచి తప్పించాడు.అది లేకుండానే పంచభూతాల చేత, బ్రహ్మచేత,ఆమె పాతివ్రత్యాన్ని ప్రకటింపంజేసి కథ సుఖాంతం చేశాడు.ఇది మెచ్చదగిన అంశం. స్త్రీ పట్ల ఆయనకు గల అనుకంపగా తెలియవచ్చు.



కళారత్న, (హంస)
డా. సి హెచ్. బాబావలిరావు
హైదరాబాద్, 9989792247





తోటపల్లి సాయినాథ్,
9394449777

# నేరంలో మానవ కోణం!





సినీ రచయితగా నా జీవితంలో తెలుగుతో పాటు ఇతర భాషల్లో కూడా చాలా చిత్రాలకు సంభాషణా రచయితగా డైలాగ్స్ రాశాను. రాస్తూతే ఉన్నాను. వాటిలో స్వాతిముత్యం,పుణ్యస్త్రీ వంటి కొన్ని చిత్రాలతో పాటు నాకు సంభాషణా రచయితగా తృప్తిని ఇచ్చింది నేరం. నా మిత్రుడు పుచ్చలపల్లి సత్యారెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. దర్శకుడిలో సత్తా ఉంటే ఏరకమైన చిత్రాన్ని అయినా గొప్పగా రూపొందించగలరు. ప్రతి ఆర్టిస్టులో పాత్రకు తగ్గట్టు నటించే టాలెంట్ ఉంటుంది.నటుడికీ, దర్శకునికీ మధ్య సమన్వయం ఉన్నప్పుడు తేలికగా దర్శకుడు ఆ ఆర్టిస్టులో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసుకుని రాగలడు.ఒక ప్రతిభ గల నటుడు ,సత్తా ఉన్న డైరక్టర్ ఉన్నప్పుడు రచయిత కూడా చక్కటి సంభాషణలు రాస్తే తప్పక ఆ సీను పండుతుందని నేను విశ్వనాథ్‌గారి వద్ద అనుభవంతో నేర్చుకున్నాను. ఆ ముగ్గురు పోటీ పడితే ఆ సీను తప్పక ప్రేక్షకాదరణ పొందుతుందనే విషయం నిర్మాణంలో కూడా సత్యారెడ్డి ద్వారా మరోసారి నాకు రుజువు అయింది.

నా ఆప్త మిత్రుడు ,నిర్మాత కొసరాజు రాజేంద్ర బాబు ,దర్శకుడు సత్యారెడ్డి కలిసి సంయుక్తంగా నేరం చిత్రాన్ని నిర్మించారు. ఎల్‌సుబ్రహ్మణ్యం, ఈ .దామోదర రెడ్డి నిర్మాతలుగా, రాజేంద్రబాబు అల్లుడు అనంత కుమార్ ఈ చిత్రానికి నిర్మాణ సారథ్యం వహించారు.పుచ్చలపల్లి సత్యారెడ్డి కథ,స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి నేను స్క్రీన్ ప్లేవిషయంలో సంపూర్ణ సహకారం అందిస్తూ సంభాషణలు రాశాను. సుధారా క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రానికి భూమా నాగిరెడ్డి సమర్పించారు. ఇక చిత్రం కథ విషయానికి వస్తే .... సీనియర్ నటుడు గుమ్మడి గారు ఈ సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో ముందు 5 నిమిషాలలో నటించారు.తొలి శ్వాస జననం..తుది శ్వాస మరణం అనే గుమ్మడి గారి డైలాగ్‌తో సినిమా ప్రారంభమవుతుంది.

ఫ్లాష్ బ్యాక్‌లో ....ఆంధ్రాబ్యాంకులో క్యాషియర్ గా పని చేస్తున్న వీరభద్రరావును గుమ్మడి స్నేహం పేరుతో మోసం చేసి డబ్బు కొట్టేస్తాడు. ఆ డబ్బును పెట్టుబడిగా పెట్టి కోట్ల రూపాయిల ఆస్తిగా సంపాదిస్తాడు. ముసలితనంలో చని పోయే ముందు అమెరికాలో ఉన్న తన కుమారుడు జాకీని పిలిపించి తన ఆస్తినీ, వ్యాపార సామ్రాజ్యాన్ని అప్పగిస్తాడు. కానీ, ఆయనకు తాను,వీరభద్రరావుకు చేసిన మోసం గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఆయన కుమారునితో నేను జీవితంలో ఒక తప్పు చేశాను. దానికి పరిహారం నువ్వే చేయాలి.నా వల్ల మోసపోయిన వీరభద్రరావు ఆచూకీ కోసం చాలా ప్రయత్నాలు చేశాను.కానీ, దొరకలేదు.నీవు ఆయన ఆచూకీ తెలుసుకోవాలి.ఆయనకు కుమారుడు ఉంటే మన ఆస్తిలో సగం అతనికి ఇచ్చేయ్ ....కూతురు కూడా ఉంటే, ఒక వేళ ఆమె నీకు నచ్చితే పెళ్ళి చేసుకుని ఈ ఇంటి కోడలుగా తీసుకుని రా.అంటూ కొడుకు దగ్గర మాట తీసుకుంటాడు. మన దగ్గర పని చేసే డ్రైవర్ బహదూర్, మేనేజర్ బాపినీడు ఎంతో నమ్మకస్తులు. వారు నీకు అన్ని విధాలా సహకరిస్తారు అని చెప్పి కన్నుమూస్తాడు. నేరం చిత్రంలో చెప్పుకోదగిన అంశం మానవతా విలువల విశ్లేషణ.ఒక మనిషి తాను ఎదిగే క్రమంలో అన్ని విలువలను పక్కన పెట్టి కేవలం తన స్వార్థం, అభివృద్ధి గురించే ఆలోచిస్తాడు.అప్పటి వరకు ఉన్న ఆశయాల స్థానంలో కొత్త ఆశలు పుట్టుకొస్తాయి. అందరి కంటే ఉన్నతంగా తాను ఎదగాలనే కోరిక బలంగా మారి స్నేహ ధర్మాన్ని, మానవతా విలువలను మర్చిపోయేలా చేస్తుంది. ఆ స్థితిలో ఎదగాలనే ఆరాటం తప్ప బంధాలు,అనుబంధాలు గుర్తుకు రావు. తన కోర్కెలకే పెద్ద పీట వేసి ,తన అభివృద్ధి మాత్రమే పరమావధిగా పనులు చేస్తాడు. ఆ దశలో మనిషి రాక్షసుడు అవుతాడు. మానవ ధర్మం మృగధర్మంగా మారుతుంది. అనే విషయాన్ని నేరం సినిమాలో బాగా డీల్ చేశాము.

ఒక వ్యక్తిలో స్వార్థం ప్రవేశిస్తే, మనసు ఇది తప్పు అని చెప్తున్నా.... అతని వాటిని సమాధి చేసి తన కోరికలను ముందుకు పరిగెత్తిస్తాడు. అలా స్వార్థంతో డబ్బు కోసం ప్రాకులాడిన చాలా మంది చరమాంకంలో లేదా డబ్బు సంపాదనలో తృప్తి అనిపించినప్పుడో అకస్మాత్తుగా మారుపు వస్తుంది. వారిలో మానవత్వం నిద్ర లేస్తుంది. నా స్వార్థం కోసం తప్పులు, పాపాలు చేశాను అనే ఆలోచన వారిలో మొదలవుతుంది. అదే పశ్చాత్తాపం చెందడం. తాను గతంలో చేసిన తప్పులకు పరిహారం చేయాలనే పరివర్తన వారిలో కలుగుతుంది. కానీ, అప్పటికి వారికి వయసు మీరిపోవడం... తాను స్వయంగా ఆ పని చేయలేక పోవడం జరగవచ్చు.

నేరం చిత్రంలో కూడా జరిగింది అదే. గుమ్మడి గారు స్వయంగా తన తప్పునక పరిహారం చేయలేక ఆ పనిని తన కుమారుడు జాకీకి అప్పగిస్తాడు. తన తండ్రి కోర్కెను ఏవిధంగా తీర్చాడు.హీరో,హీరోయిన్లు చివరకు ఏ విధంగా కలుసుకుంటారు అనేదే నేరం చిత్రం.

ఈ చిత్ర నిర్మాణంలో పాలు పంచుకున్న ఆర్టిస్టులు,సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే హీరోగా జాకీ అద్భుతంగా నటించారు. ఇది తన రెండో చిత్రం అయినప్పటికీ గొప్ప పరిణతి కనబర్చారు.హీరోయిన్లు దివ్యవాణి, కావ్య అన్నిరకాల సన్నివేశాల్లో తగ్గట్టుగా నటించి మెప్పించారు.

చిత్రం కచ్చితంగా సక్సెస్ అవుతుందని భావించాం.కానీ,ఇది అని చెప్పలేని ఏదో కారణంతో చిత్రం విజయవంతం కాలేకపోయింది. సత్యారెడ్డి గారు తనకు ఉన్న అనుభవంతో కొంత బిజినెస్ డీల్ చేసి నిర్మాతలు నష్టపోకుండా చూశారు. అది వేరే విషయం.


# త్రివర్ణ పతాకం రెపరెపలు

## ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశ వ్యాప్తంగా 70వ గణతంత్ర వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రతి ఊరిలోనూ, ప్రతి బస్తీలోనూ జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా చేసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ గోవింద్ జాతీయ జెండాను ఎగురవేయగా రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఇటు తెలంగాణతోపాటు, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ జాతీయ జెండాను ఎగురవేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, ప్రైవేటు ఆఫీసుల్లోనూ జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ స్కూల్స్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఇటు రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ మూడు రంగుల జెండాను ఎగురవేసి ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. శాసనసభ ఆవరణలో సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. శాసనమండలి ప్రాంగణంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్ జెండా ఎగురవేశారు.

తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రాములు జెండాను ఎగురవేశారు. కమిషన్ సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, ఆంజనేయులు గౌడ్, జూలూరీ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అధికారిక కార్యాలయం ప్రగతి భవన్‌లో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అధికార టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో డాక్టర్ లక్ష్మణ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఉస్మానియా యూనివర్సిటీతోపాటు ఇఫ్లూలో, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోనూ జాతీయ జెండాను ఎగురవేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా రూపొందించిన 100 ఫీట్ల జాతీయ జెండాను ఆవిష్కరించారు. సికింద్రా బాద్ దక్షిణ మధ్యరైల్వే కార్యాలయంలో అదనపు జనరల్‌మేనేజర్ జాన్ థామస్ జాతీయ జెండాను ఎగురవేశారు.



గణతంత్ర వేడుకల్లో ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

## విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలపాలని ట్రాన్స్‌కో, జెన్కో సంస్థల సీఎండి డి.ప్రభాకర్ రావు అన్నారు. శనివారం విద్యుత్ సౌధలో రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొన్న ప్రభాకర్ రావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డైనమిక్ సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో విద్యుత్ వ్యవస్థలు మెరుగైన సేవలు అందిస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొంటున్నాయన్నారు. గత 50 నెలలుగా నిరంతర విద్యుత్ సరఫరాతో రాష్ట్రం ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. పరిశ్రమలకు టీఎస్ ఐపాస్ పాలసీ ఎంతో ఉపకరిస్తోందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతోపాటు అన్ని కేటగిరిల వారికి నిరంతర విద్యుత్ ఇస్తున్నామన్నారు.

## రూ.7975 కోట్లతో సబ్‌స్టేషన్లు

### ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** విద్యుత్ వ్యవస్థలను పటిష్టపరిచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నది లక్ష్యంగా రూ.7975కోట్లు ఖర్చుచేసి సబ్ స్టేషన్లు నూతన లైన్లు నిర్మిస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి తెలిపారు. శనివారం సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.శ్రీనివాస్ , జె.శ్రీనివాస్ రెడ్డి, కె.రాములు స్వామిరెడ్డి, నరసింహరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

## ఎంసీహెచ్‌ఆర్డీలో...

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 70వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. అధికారులు, సిబ్బంది, ఫ్యాకల్టీ, ట్రైనీ అధికారులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎంసీహెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ బిపి ఆచార్య ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపనతో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు.

## గణతంత్ర వేడుకల్లో జగన్



ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో జగన్ తొలుత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీలు వైఎస్ వివేకానందరెడ్డి, మిధున్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈ రోజునే రాజకీయాల్లోకి వచ్చా...



గణతంత్ర దినోత్సవం రోజునే రాజకీయరంగ ప్రవేశం చేసిన తనను ఆదరించిన ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ విజయశాంతి కృతజ్ఞతలు తెలిపారు. తాను చేపట్టిన ఈ అలుపెరుగని పోరాటాల ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారందరికి హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ విజయశాంతి శనివారం ట్వీట్ చేశారు.



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నెలకొల్పిన 100 అడుగుల జాతీయ పతాకం

## 'అందరికీ సమాన హక్కులివ్వాలి'

దేశంలోని ప్రతి పౌరునికి సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో కుల, మతాలకు అతీతంగా వర్గ, లింగ, భాషా బేధాలకు అతీతంగా భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించారని తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ గుర్తుచేశారు. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఎన్‌టీఆర్ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్రు శోభారాణి, పి సాయిబాబా, కాట్రగడ్డ ప్రసూన, గడ్డి పద్మావతి, జాటోతు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి మరవొద్దు: కోదండరాం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరామ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ రాజ్యాంగం రావటం అంటే రాజకీయ విప్లవం రావటమేనని అన్నారు. పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి పని చేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చాక ఏదైనా చేయవచ్చనే భావనను పాలకులు విడనాడాలని ఆయన హితవు పలికారు. ఎన్నికల సంఘం కమిషనర్ రజత్‌కుమార్ కూడా రాజ్యాంగానికి అతీతుడేమి కాదన్నారు.

# రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశంలో కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ గణతంత్ర దినోత్సవమని, సుధీర్ఘ పోరాటం తర్వాత వచ్చిన స్వతంత్ర దేశానికి దిశానిర్దేశం చేయడానికి రచించిన రాజ్యాంగం అత్యంత విలువైనదని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాగమే మూలమని అన్నారు. దేశంలో పేద, ధనికుల మధ్య అంతరాలు పెరుగుతున్నాయని, కేవలం 30శాతం మంది దగ్గరనే దేశసంపద కేంద్రీకృతమైందని స్పీకర్ పోచారం వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్యలను ప్రతి సభ్యుడు సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే దిశగా కృషి చేయాలని స్పీకర్ సూచించారు. తెలంగాణ శాసన సభలో భారతదేశ గణంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఆవరణలో చైర్మన్ స్వామిగౌడ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అంతకు ముందు అసెంబ్లీ ఆవరణలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసిన నివాళులు అర్పించారు. అ తర్వాత మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించగా.. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవెందర్‌రెడ్డి, మండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

మండలిలో జెండా ఎగురవేసిన స్వామిగౌడ్



# సహకారంతోనే అభివృద్ధి

• తెలంగాణ హైకోర్టు సీజే రాధాకృష్ణన్



**హైదరాబాద్,ఆంధ్రప్రభ :** న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే అంశాలతో పాటు శాసనాలు చేసే అధికారం మనకు 68 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చిన రాజ్యాంగ ప్రకటన ద్వారా లభించాయని, మనం సదా స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ ఉద్బోధించారు. హైకోర్టు ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. 70వ రిపబ్లిక్ డే సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ.. ఈ దేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా మార్పు చెందేందుకు, చైతన్యంతో తొణికిసలాడేందుకు, బంగారు లక్ష్య సాధనకు కారణం రాజ్యాంగ నిర్మాతల మహోన్నతమైన ఆశయాల ప్రతిఫలమేనని సీజే కొనియాడారు. దేశంలో సున్నితంగా అమలయ్యే శాసనబద్ధమైన యంత్రాంగం కారణంగా భిన్నత్వంలో ఏకత్వం (యూనిటీ ఇన్ డైవర్సిటీ) ప్రతిబింబిస్తోందన్నారు. నైపుణ్యం గల సేవలో వ్యక్తులు కలిసికట్టుగా పరస్పరం సహకరించుకున్నపుడే ఓ సంఘం, ఓ సమాజం లేదా, దేశం సురక్షితంగా, సంతోషంగా ఉంటుందన్నారు. అపుడే శాసనబద్ధమైన విలువలు వివిధ పాలనా విభాగాల్లోకి జాలువారుతాయన్నారు. రాజ్యాంగం, చట్టబద్ధమైన విధులు, బాధ్యతలు దీక్షబూని సేవాభావంతో నిర్వర్తించినపుడే దేశం మరియు ప్రజలు ముందుకు సాగుతారని అభిప్రాయపడ్డారు. భారతీయ పౌరునిగా ఏ పాత్రనైనా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. న్యాయవ్యవస్థ తరపున రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సి.దామోదర్ రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలో సిరుల సింగరేణి

• సింగరేణి సీఎండీ శ్రీధర్





**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశాభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి పునరంకితమవుతూ అనతికాలంలో వంద మిలియన్ టన్నుల లక్ష్యం సాధించే దిశగా ముందుకు సాగాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండే మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్యఅతిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సింగరేణి కార్మికులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుతంగా పురోగమిస్తున్నదని, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. తెలంగాణ రాకపూర్వం ఐదేళ్ళకాలంలో 2009-14మధ్య బొగ్గు రవాణాలో కేవలం 90లక్షల టన్నుల వృద్ధిని సాధించిన సింగరేణి, తెలంగాణ ఆవిర్భావం తర్వాత గడిచిన ఐదేళ్ళలో 200 లక్షల టన్నుల వృద్ధి (122శాతం) సాధించిందన్నారు. ఓబి తొలగింపులో తెలంగాణ రాకపూర్వం ఐదేళ్ళలో 250 మిలియన్ క్యూబిక్ మీటర్ల వృద్ధిని నమోదు చేసిందని, తెలంగాణ రాకముందు ఐదేళ్ళ అమ్మకాలలో 5,600 కోట్ల వృద్ధిని నమోదు చేసిన కంపెనీ, తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014-19కాలంలో రూ.13వేల కోట్ల రూపాయల వృద్ధిని సాధించడం గమనార్హమన్నారు. టాక్సులు చెల్లించిన తర్వాత కూడా నికరలాభం భారీగా పెరిగిందని, తెలంగాణ రాకపూర్వం నికరలాభం రూ. 290 కోట్లు నమోదుచేసిన కంపెనీ గడచిన ఐదేళ్ళలో రూ.1200కోట్ల వృద్ధిని (314శాతం) సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశంతో సంస్థలో సంక్షేమ కార్యక్రమాలు ముమ్మరంగా అమలు చేస్తున్నామని, సింగరేణిలో ఉన్నన్ని సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఏ ఇతర ప్రభుత్వసంస్థలో కూడా లేవని వివరించారు. కారుణ్య నియామకాల ప్రక్రియ ఎంతో వేగంగా నిర్వహిస్తున్నామని సింగరేణి సీఎండి శ్రీధర్ తెలిపారు.

# ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలి

• పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : కాంగ్రెస్ పార్టీ ఎంతో పోరాటం చేసి నిర్మించిన ఈ ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ, పీసీసీ మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు, పి. నర్సారెడ్డి, సేవాదల్ చైర్మన్ కనుకుల జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డెబ్బై ఏళ్ల క్రితం నిర్మించిన అనేక ప్రజాస్వామ్య సంస్థలను ఈ ప్రభుత్వాలు విధ్వంసం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక కారణాలతో ఓటమిపాలైందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఓటమికి భయపడదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కేడర్ సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి విస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోనూ విజయం సాధిస్తామని ఆయన అభిప్రాయపడ్డారు.

### ప్రధానిప్రసంగంలో రవీంద్రుని ప్రస్తావనేది ? వీహెచ్

భావితరాలకు జాతీయ గీతం రాసిన మహోన్నత వ్యక్తి రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి ప్రతి ఒక్కరికి తెలియాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అన్నారు. అయితే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రసంగంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రస్తావనను గుర్తు చేయకపోవడం శోచనీయమన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ గీతం ప్రతి పౌరుడిలో దేశంపైన ప్రేమను పెంచుతోందన్నారు. ఓట్ల గల్లంతుపైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రజత్‌కుమార్ తీరు సరిగా లేదని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఎన్నికలలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. గవర్నర్ కూడా ప్రజల పక్షాన నిలబడకుండా కేసీఆర్ భజన చేస్తున్నారనివీహెచ్ విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సాఫీగా జరిగేలా చూడాలన్నారు.

## భారత్‌ను అగ్రదేశంగా తీర్చిదిద్దాలి: కృష్ణయ్య

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇండియాను అగ్రదేశంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఇందులో విద్యార్థులు, యువత ముందుండాలని పిలుపునిచ్చారు. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, దాసు సురేష్, నరేష్ గౌడ్, మహేందర్ గౌడ్, టీఆర్ చందర్, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 68 సంవత్సరాలు గడుస్తున్నా పేదలకు సామాజిక న్యాయం లభించలేదని ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 56 శాతం ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విద్య, ఉద్యోగ, పాలన, ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో పాలకులు బీసీలకు వాటా ఇవ్వకుండా కుట్ర చేశారని మండిపడ్డారు. రాజ్యాంగ రచనా సమయంలోనే బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లను పెట్టి ఉంటే ఎంతో ప్రగతి జరిగి ఉండేదన్నారు.

## దేశానికే ఆదర్శం తెలంగాణ పథకాలు

• ఢిల్లీ తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకల్లో ప్రశంసలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ జి. అశోక్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం స్వీకరించారు. గణతంత్ర వేడుకలకు హాజరైన అధికారులు, సిబ్బంది, తెలుగు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ నూతన సంస్కరణలు, సరికొత్త ఆలోచనలతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మదర్స పిల్లలు, తెలంగాణ భవన్ సిబ్బంది, పోలీసులకు ఆయన మిఠాయిలు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, డిప్యూటీ కమిషనర్ జి. రామ్మోహన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ జి. బిందు అశోక్ కుమార్, భవన్ ఉద్యోగులు, పోలీసులు, మదర్సా విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కే లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, బండారు దత్తాత్రేయతదితరులు



గణతంత్ర వేడుకల్లో సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి, చాడ వెంకటరెడ్డి తదితరులు



ఎమ్మార్పీఎస్ కార్యాయలంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన నాయకులు

## ఓయూ ఆర్ట్స్ కళాశాలపై చిరిగిన పతాకం

• గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

**హైదరాబాద్ (ఉస్మానియా యూనివర్సిటీ), ప్రభ న్యూస్ :** ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో అపశ్రుతి చోటుచేసుకుంది. వందేళ్ల చరిత్ర ఉండి ఎన్నో గౌరవ మన్ననలు అందుకుంటున్న ఉస్మానియా యూనివర్సిటీలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థుల సమక్షంలో వైస్ ఛాన్సలర్ చిరిగిపోయిన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సెల్యూట్ చేసి జనగణమన జాతీయగీతంతో వందనాలు సమర్పించుకునే సమయానికి జెండా చిరిగిపోయినట్లు గుర్తించి, హుటాహుటిన మరో జెండా మార్చడం చూసి అక్కడున్న వాళ్లంతా నిర్ఘాంతపోయారు.

### పోలీస్ స్టేషన్‌లో ఏబీవీపీ ఫిర్యాదు

భారత రాజ్యాంగాన్ని వేడుకగా చేసుకుని, జెండాని ఎగురవేయాల్సిన రోజున ఇలాంటి ఘటన తీవ్ర దిగ్భ్రాంతిలోకి నెట్టివేసిందని ఏబీవీపీ కార్యకర్తలు అన్నారు. దేశ ప్రతిష్టని ఉల్లంఘించినందుకు ఈ నిర్లక్ష్యానికి కారణం అయిన



వారిని చట్టపరంగా శిక్షించాలని ఉస్మానియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఛాంబర్‌లోకి వెళ్లి ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేసి ఇలాంటి నిర్లక్ష్య ధోరణి పునరావృతం కాకుండా చూడాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతితో పాటు అక్కడే ఉన్న ఇతర అధ్యాపకులను దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు.

### తీవ్రంగా గాలి వీచడం వల్లే జరిగింది: ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

జెండా ఎగురవేస్తున్న తరుణంలోనే తీవ్రమైన గాలి విచడం వల్ల ఇనుప హుక్కుకు జెండా పట్టుకుని చినిగిపోయిందని, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.





# పెరుగుతున్న పసిడి ధర

**• వారంలో రూ.90 అధికం • దిగొస్తున్న వెండి**



**న్యూఢిల్లీ :** పసిడి ధర రోజురోజుకూ పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడమే దీనికి కారణమని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. శుక్రవారం ఒక రోజే 10 గ్రాములపై రూ.90 పెరిగింది. రిటైలర్ల నుంచి బంగారం కొనుగోళ్లు ఊపందుకోవడంతో ఒక వారంలో 10 గ్రాముల బంగారంపై రూ.140 పెరిగింది. దీంతో వారాంతానికి పసిడి ధర రూ.33,300లకు చేరుకుంది. అదేవిధంగా వెండి నాణెల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గుతోంది. దేశీయంగా పెళ్లిళ్లకు బంగారం డిమాండ్ పెరగడం పసిడి ధర పెరగడానికి కారణమైనట్టు తెలుస్తున్నది. గత వారంతో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా ఒక ఔన్స్ బంగారం ధర రూ.1,282.30 అమెరికన్ డాలర్ల నుంచి 1,284.30కు పెరిగింది. రిపబ్లిక్ డే కారణంగా శనివారం మార్కెట్‌కు సెలవు ఉంది. వెండి కూడా ఒక ఔన్స్‌కు 15.41 డాలర్ల నుంచి 15.46 డాలర్లకు పెరిగింది. దేశరాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.33,200లు ఉండగా, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.33,050గా ఉంది. కిలో వెండి ధర వారంలో రూ.50 తగ్గి రూ.40,050గా పలికింది.







# అందరూ మనవాళ్లే..!

# ఐటీ ఘనాపాఠీలు!

## టెక్నాలజీని శాసిస్తున్న భారతీయులు

**• ప్రముఖ కంపెనీల్లో ఉన్నత స్థాయి పదవుల్లో రాణింపు • టెక్నాలజీ రంగంలో తమదైన ముద్ర • గూగుల్, మైక్రోసాఫ్ట్ అధినేతలు మనోళ్లే... • ఐటీ రంగానికి మార్గదర్శకులు**



**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ రంగం అభివృద్ధిలో భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యంత్రాలను నడిపించడంలో భారతీయ ఐటీ రంగ నిపుణులు ఎంతో కృషి చేస్తున్నారు. ప్రపంచంలోనే రెండు అతిపెద్ద టెక్నాలజీ కంపెనీలను భారతీయ సంతతికి చెందిన వ్యక్తులే ముందుకు తీసుకెళ్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలకు మనోళ్లు నేతృత్వం వహిస్తున్నారు. ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా భారతీయులు టెక్నాలజీ రంగంలో తనకంటూ ప్రత్యేకస్థానాన్ని సంపాధించుకుంటున్నారు. దేశం తలెత్తుకొనేలా చేస్తూ ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తూ విస్తృత సేవలు అందిస్తున్నారు. ఈ రెండు అతిపెద్ద కంపెనీలతో పాటు మరికొందరు కూడా ప్రపంచ టెక్నాలజీ రంగాన్ని తన గుప్పిట్లో తీసుకుని శాసిస్తున్నారు. 9 మంది భారతీయ సంతతికి చెందిన ఐటీ రంగ నిపుణులు వివిధ కంపెనీలకు సీఈఓలుగా పని చేస్తున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా 15 మంది భారతీయ ఐటీ రంగ నిపుణుల గురించి తెలుసుకుందాం....


### సుందర్ పిచాయ్, గూగుల్, సీఈఓ

భారత్‌లో పుట్టిన సుందర్ పిచాయ్ గూగుల్ సంస్థకు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గూగుల్ సంస్థకు బాస్‌గా ఉన్న 44 ఏళ్ల పిచాయ్, తమిళనాడులోని చెన్నైలో జన్మించాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో (బీటెక్) ఉన్నత విద్యను అభ్యసించాడు. కాలిఫోర్నియాలోని స్టాండ్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశాడు. పెన్సిల్వేనియా ఫిలడెల్ఫియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ ది యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నాడు. 2015లో గూగుల్ సంస్థకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా నియమించబడ్డాడు. గూగుల్ క్రోమ్ బ్రౌజర్, ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించాడు. యాండ్రాయిడ్, క్రోమ్, మ్యాప్స్‌తో పాటు ఇతర ప్రముఖ గూగుల్ ఆవిష్కరణల బృందానికి నేతృత్వం వహించాడు.

### సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్, సీఈఓ

22 ఏళ్ల పాటు మైక్రోసాఫ్ట్ కంపెనీలో వివిధ హోదాల్లో సేవలందించాడు. ఫిబ్రవరి 2014లో అదే సంస్థకు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్‌గా నియమితుడయ్యాడు. దీనికంటే ముందు నాదేళ్ల, మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఎంటర్‌ప్రైజెస్‌కు ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నాడు. హైదరాబాద్‌లో పుట్టిన 47 ఏళ్ల నాదేళ్ల మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి బీఈ పూర్తి చేశాడు. చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మిల్వాకీ నుంచి ఎంఎస్ పూర్తి చేశాడు. 1967, ఆగస్టు 19న హైదరాబాద్‌లో జన్మించాడు. సీఎన్ఎన్ ఐబీఎన్ ఇండియన్ ఆఫ్ ది ఇయర్ - గ్లోబల్ ఇండియన్ అవార్డును సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించారు.

### శంతను నారాయణ్, అడోబ్, సీఈఓ



హైదరాబాద్‌లో పుట్టిన నారాయణ్ 1998లో అడోబ్ కంపెనీలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. 2005లో సీఓఓగా, 2007 నుంచి సీఈఓగా కొనసాగుతు న్నాడు. ఓయూ నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, కాలిఫోర్నియా, బెర్కలీలో ఎంబీఏ, బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ పూర్తి చేశాడు. ఫొటో షేరింగ్ స్టార్టప్ పిక్ట్రాకు సహ వ్యవస్థాపకుడికంటే ముందు యాపిల్, సిలికాన్ గ్రాఫిక్స్‌లో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో పని చేశాడు. ఆ తరువాత అడోబీలో చేరాడు. 2016లో బ్యారెన్స్ వ్యాగజైన్‌లో వరల్డ్ బెస్ట్ సీఈఓగా గుర్తింపు పొందాడు.

### రాజీవ్ సూరి, నోకియా, సీఈఓ అండ్ ప్రెసిడెంట్



1995లో రాజీవ్ సూరి నోకియాలో అడుగుపెట్టాడు. 2014 ఏప్రిల్‌లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు చేపట్టాడు. దీనికంటే ముందు రాజీవ్, కంపెనీలో వివిధ హోదాల్లో పని చేశాడు.
నోకియా సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత మైక్రోసాఫ్ట్ సంస్థ నోకియా ఫోన్ల ఉత్పత్తిని సొంతం చేసుకుంది. 2007-2009లో నోకియా సీమెన్స్ నెట్‌వర్క్, సర్వీసెస్‌కు నేతృత్వం వహించాడు. భారత్‌లో పుట్టిన సూరీ మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశాడు. ఎలాంటి పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీలు లేవు.

### ఫ్రాన్సిస్కో డిసౌజ, కాగ్నిజెంట్, సీఈఓ



సాఫ్ట్‌వేర్ సెక్టార్‌లోని యువ సీఈఓల్లో డిసౌజ ముందు వరుసలో ఉంటాడు. కాగ్నిజెంట్‌కు సీఈఓగా పని చేస్తున్నాడు. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడిగా ఉన్నాడు. 1994లో డిసౌజ, కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్నాడు. 2007 నుంచి సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత 55వేలు ఉన్న ఉద్యోగులు 2,30,000కు చేరుకున్నారు. డిసౌజ, కెన్యాలో జన్మించాడు. ఈస్ట్ ఆసియా యూనివర్సిటీ నుంచి బీబీఏ, కారెంగి మెల్లన్ యూనివర్స్‌టీ, పిట్స్‌బర్గ్ నుంచి ఎంబీఏ పూర్తి చేశాడు. బోర్డ్ ఆఫ్ జనరల్ ఎలక్ట్రిక్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించాడు.

### దినేష్ పలివాల్, హర్మాన్ ఇంటర్నేషనల్, సీఈఓ



హర్మాన్ ఇంటర్నేషనల్‌కు దినేష్ ప్రెసిడెంట్, సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. జేబీఎల్, బెకర్, డీబీఎక్స్ వంటి ప్రీమియం ఆడియో గేయిర్ బ్రాండ్ కంపెనీ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో జన్మించాడు. రూర్కీ ఐఐటీ నుంచి బీఈ, మియామీ యూనివర్సిటీ నుంచి ఎంఎస్, ఎంబీఏ పూర్తి చేశాడు. హర్మాన్‌లో అడుగుపెట్టక ముందు 22ఏళ్ల ఏబీబీ గ్రూప్‌లో పని చేశాడు. కంపెనీకి ప్రెసిడెంట్‌గా ఆ తరువాత ఏబీబీ నార్త్ అమెరికా గ్రూప్‌కు చైర్మన్, సీఈఓగా కూడా ఉన్నారు. చైనాలోని గువాంగ్‌డాన్ గవర్నర్ వద్ద మూడేళ్ల పాటు ఆర్థిక సలహాదారుగా కూడా పని చేశారు.

### సంజయ్ మెహ్రోత్రా, మైక్రాన్ టెక్నాలజీ, సీఈఓ



బిట్స్ పిలానీ నుంచి ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశారు. వెస్టర్న్ డిజిటల్‌లో బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నాడు. 2017, మే 8న మైక్రాన్ టెక్నాలజీకి సీఈఓగా నియమితులయ్యారు. 1958, జూన్ 27న కాన్పూర్‌లో జన్మించాడు. సాన్ డిస్క్‌కు 1988లో సహ వ్యవస్థాపకుడిగా ఉన్నాడు. ప్రెసిడెంట్, సీఈఓగా 2011 నుంచి 2016 వరకు పని చేశాడు. నాన్ వోల్టైల్ సెమీ కండక్టర్ మెమోరీ ఇండస్ట్రీలో 30 ఏళ్ల అనుభవం ఉంది.

### నేహా నర్ఖడే, కన్‌ఫ్యూయెంట్, సీఈఓ



పుణె యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్‌లో పట్టా పొందిన నేహా కన్‌ఫ్యూయెంట్‌కు సీఈఓగా వ్యవహరిస్తోంది. 2018లో విడుదలైన 50 శక్తివంతులైన మహిళా వ్యాపారుల ఫోర్స్ జాబితాలో నేహాకు చోటు లభించింది. లింక్డ్ ఇన్‌లో నాలుగేళ్లు, ఒరాకిల్‌లో రెండేళ్ల పాటు సేవలందించారు. ఫిబ్రవరి 2008 నుంచి 2010 వరకు ఒరాకిల్ కార్పొరేషన్‌లో టెక్నికల్ స్టాఫ్ మెంబర్‌గా ఉంది. డిజైనింగ్‌లో లీడ్ ఇంజినీర్‌గా పని చేశారు.

### పద్మశ్రీ వారియర్, నియో, మాజీ సీఈఓ



చైనాకు చెందిన ఎలక్ట్రానిక్ వాహన రంగ సంస్థ అయిన నియోకు పద్మశ్రీ సీఈఓగా ఉన్నారు. అమెరికాలో బాధ్యతలు నిర్వహించారు. డిసెంబర్, 2018 లోనే ఈ బాధ్యతల నుంచి ఈమె బయటికి వచ్చారు. మైక్రోసాఫ్ట్, స్పోటిఫై కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లో సభ్యురాలిగా ఉన్నారు. సిస్కో కంపెనీకి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పని చేశారు. 1961లో విజయవాడలో పుట్టారు. కోర్నెల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీలో విద్యనభ్యసించారు. మోటారోలాకు సీటీఓగా కూడా పని చేశారు.

### అంజలీ సౌద్, విమియో, సీఈఓ



హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. ప్రస్తుతం విమియో సీఈఓగా ఉన్నారు. ఇదో పాపులర్ ఓపెన్ వీడియో ప్లాట్‌ఫాం. 2017లో కంపెనీకి సీఈఓగా నియామకం అయ్యారు. అమెజాన్‌తో పాటు టైం వార్నర్‌లో కూడా పని చేశారు. దీనికి ముందు సౌద్, 2016 నుంచి 2017 వరకు ఎస్‌వీపీ జనరల్ మేనేజర్, వీపీ గ్లోబల్ మార్కెటింగ్‌కు హెడ్‌గా ఉన్నారు. 2010-2014లో అమెజాన్‌లో మార్కెటింగ్ డైరెక్టర్‌గా పని చేశారు.

### కామాక్షి శివరామకృష్ణన్, డ్రాబ్రిడ్జ్, సీఈఓ



2018లో విడుదలైన 50 శక్తివంతులైన మహిళా వ్యాపారుల ఫోర్స్ జాబితాలో కామాక్షికి చోటు లభించింది. డ్రాబ్రిడ్జ్‌కు సీఈఓగా ఉన్నారు. ఇది ప్రజల ఆధారిత గుర్తింపు నిర్వహణ సంస్థ. స్టాండ్‌ఫర్డ్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కొన్నేళ్ల పాటు గూగుల్ కంపెనీలో కూడా పని చేశారు. 2010 నవంబర్ నుంచి సీఈఓగా ఉన్నారు. డ్రాబ్రిడ్జ్ కంపెనీకి డైరెక్టర్‌గా పని చేశారు. శివరామకృష్ణన్ సీనియర్ రీసెర్చ్ సైంటిస్టుగా ఉన్నారు. స్టాండ్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### పరాగ్ అగర్వాల్, ట్విట్టర్, సీటీఓ




2011లో పరాగ్ అగర్వాల్ ట్విట్టర్ అడుగుపెట్టాడు. చీఫ్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాడు. మైక్రోసాఫ్ట్, ఏటీ అండ్ టీ, యాహు సెర్చ్ టీంలో కూడా పని చేశాడు. జూన్ 2009 నుంచి సెప్టెబర్ 2009 వరకు మైక్రోసాఫ్ట్‌లో ఉన్నాడు. జూన్ 2007 నుంచి సెప్టెంబర్ 2008 వరకు యాహూలో, 2010 జూన్ నుంచి 2010 సెప్టెంబర్ వరకు ఏటీ అండ్ టీ ల్యాబ్‌లో పని చేశాడు.

### దీపక్ అహుజా, టెస్లా, సీఎఫ్ఓ



10 ఏళ్లుగా దీపక్ అహుజా టెస్లా కంపెనీలో పని చేస్తున్నారు. 2017లో ఈయన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీనికి ముందు ఫోర్డ్ మోటార్స్‌లో పని చేశారు. వారణాసిలో ఐఐటీ విద్యనభ్యసించారు. కర్నేగీ మెల్లాన్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందాడు. 1963లో ముంబైలో పుట్టాడు. పిట్స్‌బర్గ్ సమీపంలోని కెన్నామెటల్‌లో ఆరేళ్ల పాటు పని చేశారు. ఆటో ఆలియాన్స్ ఇంటర్నేషనల్ జాయింట్ వెంచర్ అయిన ఫోర్డ్, మాజ్డాకు చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా కూడా పని చేశారు.

### జార్జ్ కురియన్, నెట్ యాప్, సీఈఓ, ప్రెసిడెంట్



స్టోరేజ్ అండ్ డేటా మేనేజ్‌మెంట్ కంపెనీ అయిన నెట్ యాప్‌కు జార్జ్ సీఈఓగా ఉన్నారు. 2015, జూన్‌లో ఈ బాధ్యతలు చేపట్టారు. దీని కంటే ముందు రెండేళ్ల పాటు ప్రొడక్ట్ ఆపరేషన్స్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సిస్కో సిస్టం, అప్లికేషన్ నెట్‌వర్కింగ్, స్విచ్చింగ్ టెక్నాలజీలో వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అకామై టెక్నాలజీస్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పని చేశారు. నెట్ యాప్‌కు 2016, మే 20 నుండి ప్రెసిడెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు.

### అశోక్ వేమూరి, కాండియెంట్, సీఈఓ



జిరాక్స్‌కు సంబంధించిన కంపెనీ ఇది. ఐగేట్ సీఈఓగా కూడా పని చేశారు. అదేవిధంగా ఇన్ఫోసిస్‌లో పని చేసిన అనుభవం కూడా ఈయన సొంతం. 1968, 22 ఏప్రిల్‌లో న్యూఢిల్లీలో పుట్టాడు. ప్రస్తుతం న్యూజెర్సీలో నివాసం ఉంటున్నారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీలో విద్యనభ్యసించారు. అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి డిగ్రీ పొందారు. 2013-2014 వరకు ఐగేట్‌లో, క్యాప్ జెమినీలో 2015, 1992-2013 వరకు ఇన్ఫోసిస్‌లో వివిధ హోదాల్లో పని చేశారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యం

**• రూ.50వేల కోట్లతో ప్రాజెక్టులు • ఢిల్లీని అతలాకుతలం చేస్తున్న వాయు, నీటి కాలుష్యం • కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరి • 6 లైన్ల ఎక్స్‌ప్రెస్‌వే కారిడార్‌కు శంకుస్థాపన**



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని గత కొన్నేళ్లుగా రెండు ప్రధాన సమస్యలు ఎదుర్కొంటోందని, అవి నీటి, వాయు కాలుష్యం అని, వీటిపై యుద్ధం చేసేందుకు ప్రభుత్వం రూ.50,000 కోట్లతో ప్రాజెక్టులను చేపడుతోందని కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. భాగ్‌పత్ రోడ్డులో అక్షర్‌ధామ్-ఈస్టర్న్ పెరిఫరెల్ ఎక్స్‌ప్రెస్‌వే (ఈపీఈ) జంక్షన్‌ను కలుపుతూ రూ.2,820 కోట్లతో హైవే కారిడార్ ప్రాజెక్టు శంకుస్థాపనలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ్కరీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీ నీటి, వాయు కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటోందని, వీటికి శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.50వేల కోట్లతో హైవే ప్రాజెక్టులు చేపట్టడం జరుగుతోందని అన్నారు. రూ.10వేల కోట్లతో నిర్మించబోయే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే కోసం వచ్చే వారం శంకుస్థాపన చేయడం జరుగుతుందని, దీనికి ప్రధాని నరేంద్ర మోడీ కూడా హాజరు అవుతారని తెలిపారు. మార్చికల్లా ఢిల్లీ - మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే పనులు పూర్తి అవుతాయని, ఏప్రిల్‌లో ఈ మార్గాన్ని ప్రారంభించడం జరుగుతుందని, ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 40 నిమిషాల్లో వెళ్లొచ్చని తెలిపారు. గతంలో 3 గంటలకు పైగా సమయం పట్టేదని గుర్తు చేశారు. ఢిల్లీ అభివృద్ధి కోసం వివిధ ప్రాజెక్టులు చేపట్టడం జరుగుతోందని, రూ.4,000 కోట్లతో అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ (యూఈఆర్)ను నిర్మించనున్నామని తెలిపారు. ఈస్టర్న్ పెరిఫరెల్ ఎక్స్‌ప్రెస్‌వే (ఈపీఈ)తో మరికొన్ని ప్రాజెక్టులు పూర్తి అయితే ఢిల్లీలో కాలుష్యం అనేది తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్షర్‌ధామ్ నుంచి సహరన్‌పూర్ బైపాస్ వరకు 31.3 కిలోమీటర్ల హైస్పీడ్ సిగ్నల్ ఫ్రీ కారిడార్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందని, దీనికి శంకుస్థాపన చేపట్టనున్నామని అన్నారు. ఆరు లైన్ల రహదారి తూర్పు ఢిల్లీలోని అక్షర్‌ధామ్‌తో కనెక్ట్ చేయబడుతుందని తెలిపారు. అక్షర్‌ధామ్-గీతా కాలనీ-శాస్త్రీ పార్క్-ఖజూరీఖాస్-ఢిల్లీ/యూపీ బార్డర్-మండోలా-ఈపీఈ కలుపుతూ ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఉంటుందన్నారు. ఇది రెండు దఫాలుగా ఉంటుందని గడ్కరీ ఈ సందర్భంగా తెలిపారు.

## నేడు సదరన్ ట్రావెల్స్ 'హాలిడే బజార్'

SOUTHERN TRAVELS

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి 8 సార్లు 'బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్' అవార్డును అందుకున్న సదరన్ ట్రావెల్స్ హైదరాబాద్ నగరంలో శని, ఆదివారాల్లో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా 'హాలిడే బజార్'లను నిర్వహించనుంది. నగరంలోని మాసాబ్‌ట్యాంక్ గోల్కొండ హోటల్, మియాపూర్‌లోని హోటల్ శ్రీక్రిష్ణా గ్రాండ్‌లో, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్డులోని హోటల్ స్వాగత్ గ్రాండ్‌లో, హైటెక్ సిటీలోని ది పీర్లెస్ ఇన్ హోటల్‌లో ఈ రెండు రోజుల పాటు హాలిడే బజార్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతాయి. దేశ, విదేశాల్లోని విహార యాత్రలకు వెళ్లే పర్యాటకులు ఈ హాలిడే బజార్‌ను సందర్శించి సదరన్ ట్రావెల్స్ ఎక్స్‌పర్ట్స్‌తో నేరుగా మాట్లాడొచ్చు. అనుభవజ్ఞులైన సీనియర్ స్టాఫ్‌తో ఐదు దశబ్దాలుగా సేవలందిస్తున్నట్టు ఎండీ ఆలపాటి కృష్ణ మోహన్, జాయింట్ ఎండీ ఆలపాటి వెంకట ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# విశ్వవిపణిలో ఓఎన్‌జీసీ!

**• 2040 నాటికి ప్రపంచ గుర్తింపు • ఆ దిశగా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు • ఓఎన్‌జీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్**



**న్యూఢిల్లీ :** 2040 నాటికి ప్రభుత్వ ఆధారిత ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) అందరి దృష్టిని ఆకర్షిస్తుందని, రాబోయే రెండు దశాబ్దాలకు గాను దేశంలోని అతిపెద్ద చమురు, గ్యాస్ ఉత్పత్తి సంస్థ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా డెహ్రాడూన్‌లోని ఓఎన్‌జీసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూపొందించిన ప్రణాళికలు దీర్ఘకాలం వరకు ఉపయోగపడేలా ఉంటాయని అన్నారు. 2030 ప్లాన్‌లో మార్పులు చేస్తూ విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేసినట్టు తెలిపారు. సంస్థ అభివృద్ధి, దేశం కోసం శక్తి ఉత్పాదన, రక్షణ వంటి ముఖ్యమైన లక్ష్యాలను ముందుపెట్టుకున్నట్టు తెలిపారు. గత దశాబ్దకాలంలో కంపెనీలో ఎన్నో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం కంపెనీ నుంచి ఈఅండ్‌పీ, రిఫైనింగ్, పెట్రో కెమికల్స్, ఎల్ఎన్‌జీ, పైప్‌లైన్స్, రిటైల్, సెజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ వంటి ఎన్నో ఉత్పత్తులు బయటికి వస్తున్నాయని అన్నారు. శక్తి ఉత్పాదనలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచేందుకు ఓఎన్‌జీసీ అన్ని మార్గాలను అన్వేషిస్తోందని, భారత్‌లో, బయట అభివృద్ధికి దోహదపడే ప్రాంతాలను ఎంచుకుని పని ప్రారంభించిందన్నారు. హైడ్రో కార్బన్ ఉత్పాదన ప్రతీ ఏడాది పెరుగుతూ పోతోందని అన్నారు.

## చైనా విమానాశ్రయంలో 5జీ సేవలు

**బీజింగ్ :** దక్షిణ చైనా, గుయంగ్డోంగ్ రాష్ట్రంలోని గ్వాంగ్జోయ్ బయియూన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మొదటి సారిగా 5జీ బేస్ స్టేషన్‌ను ప్రారంభించారు. దేశంలో 5జీ సేవలు అందుకుంటున్న మొదటి ఏయిర్‌పోర్టుగా నిలిచింది. సెకనుకు 1.14 గిగా బైట్ స్పీడ్‌తో ఇది కొనసాగుతుంది. 4జీ నెట్‌వర్క్ కంటే ఇది 50 రెట్లు అధికం అని జిన్హువా న్యూస్ ఏజెన్సీ తెలిపింది. స్టేషన్‌ను చైనా యూనికమ్స్ గ్వాంగ్జోయ్ బ్రాంచ్ ఏర్పాటు చేసింది. దక్షిణ చైనాలో గ్వాంగ్జోయ్ బయియూన్ విమానాశ్రయం పెద్ది. ఇక్కడి నుంచి 90 మార్గాల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రయాణించే సౌకర్యం ఉంది. 2017లో 65.8 మిలియన్ మంది ఇక్కడి నుంచి ప్రయాణించారు.

## ప్రియుడితో కలిసి వివాహిత ఆత్మహత్య



ఘట్‌కేసర్, ప్రభన్యూస్ : అనుమానాస్పదస్థితిలో మహిళ, మరో యువకుడు ఒకే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రంగారెడ్డి జిల్లా, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... అల్వాల్‌కు చెందిన మున్న మల్లేష్ (26), సుచిత్ర ప్రాంతంలో నివాసం ఉంటున్న వివాహిత బాలే పార్వతి (40) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు కలిసి వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకుని ఈ నెల 13న ఇంట్లోనుంచి వెళ్లిపోయారు. పార్వతి భర్త అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మిత్రుడి సాయంతో రాజీవ్ గృహకల్ప కాలనీ లోని బ్లాక్ నెంబర్ 78/4లో వారం రోజులు ఇద్దరు నివాసం ఉండి తిరిగి ఇంటికి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. మళ్లీ నాలుగు రోజుల క్రితం ఇద్దరు కలిసి వచ్చి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు మృతులు వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకుని కుటుంబ సభ్యులకు వివరించగా వారు సమ్మతించకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలు పార్వతికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని... వారికి వివాహాలు కూడా జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు.

# తెలుగు పాటకు...పట్టం

**● సిరివెన్నెలకు పద్మశ్రీ గౌరవం ● పరవశించిన విశాఖ ● అరుదైన గౌరవం అంటూ సంబరాలు**

**విశాఖపట్నం, ప్రభన్యూస్:** తన పాటతో ప్రతినోటనూ అనుభూతుల మత్తులో ముంచేసే పద ప్రయోగ విరించి సిరివెన్నెల సీతా రామ శాస్త్రికి ప్రభుత్వం పద్మశ్రీ ప్రదానం చేయడంతో పాటల పూదోటలన్నీ మురిసాయి. ఆశ్లీలతకు తావులేని పద శరాలను సంధించే చెంబోలు సీతారామ శాస్త్రి ని కేంద్ర ప్రభుత్వం భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పద్మశ్రీ ప్రదానం చేసి గౌరవించడంతో తెలుగు పాటు పారవశ్యంతో పులకించిపోయింది. తెలుగు సినిమా పూదోటలో పారిజాత పుష్పంగా గుభాళించి తెలుగు యవనికపై సాహితీ వెన్నెల సిరిని అద్దిన సినీ కవిగా సీతారామ శాస్త్రికి దక్కినగౌరవానికి యావత్తు సాహితీ లోకం పులకించిపోయింది. ప్రణయం,యుగళం, సందేశం, శాస్త్రీయం, .. లయం., పద విన్యాసం., తొణకని బెణకని పద గాంభీర్యంతో పాటూ వైవిధ్యభరత భావ తంత్రులతో పాఠక హృదయాలపై సమ్మోహనా తరంగ పద ఝరి కురిపించిన వింజామరగా విరాజిల్లుతున్న సినీకవి శ్రేష్టుడు చెంబోలు సీతారామ శాస్త్రిని వరించిన పద్మశ్రీ పురస్కారంకు విశాఖజిల్లా పాటల లోకం మురిపిసోయింది. కవి,రచయిత,గాయకుడు, నటుడుగా అందరికీ సుపరిచయస్తులే.1955 మే 20న విశాఖ జిల్లా అనకాపల్లి జన్మించారు. టెలిఫోన్ శాఖలో సాధారణ ఉద్యోగిగా బాధ్యతలు వహిస్తూ పద్యాలూ, గేయాలూ రాసే సీతారామ శాస్త్రి గంగావతరణం గేయాన్ని చూసిన కళాతపస్వి కె.విశ్వనాథ్ తన సిరివెన్నెల సినిమాతో వెండితెరకు పరిచయంచేశారు. తొలి అవకాశంతోనే సినిమాలోని అన్ని పాటలూ రాసి, వారసత్వంగా వచ్చిన చెంబోలు ఇంటిపేరు స్థానంలో అందరూ ఆయన తొలి సినిమా సిరివెన్నెలనే ఇంటిపేరుగా గుర్తుంచుకునేలా తన పాటల కమ్మదనంతో చెరగని ముద్ర వేసుకున్నారాయన. తొలి సినిమాతోనే సీతారామ శాస్త్రి నంది అవార్డుని పొందారు. సాహిత్యంతో సమాజాన్ని రంజిపంజేయాలి.,సంస్కరించాలీ అనే భావం ఆయన పాటల్లో కనిపిస్తుందని ప్రతి ఒక్కరూ భావిస్తుంటారు. నడవరా ముందుకు అటో ఇటో ఎటో వైపు అంటూ ఎలుగెత్తిన ఆయన పాటలో ఆదిబిక్షువువానినేమి అడిగేది?. ,తెలవారదేమో స్వామి., భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరూ భర్తగ మారకు బ్యాచిలరూ.., అంటూనే జగమంత కుటుంబం నాదీ ఏకాకి జీవితం నాదీ అంటూ తన సాహిత్యంతో అన్ని కోణాలనూ సీతారామ శాస్త్రి స్పృశించారు. కవినై..కవితనై.. భార్యనై..భర్తనై..అన్నీ తానై.. పాటతో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం వహించి,ప్రాణం పోసి తెలుగు సినిమాలో ఇంచుమించు అందరు అగ్రహీరోలకూ, అందరు సంగీత దర్శకులకూ,దర్శకులకూ తన కలం సిరా సిరిని అద్దిన (చెంబోలు) సిరివెన్నెల సీతారామ శాస్త్రికి 2019 ఏడాదికి కేంద్రం పద్మశ్రీ అవార్డుతో గౌరవించడం తెలుగు సాహిత్యానికి, తెలుగు సినిమా పాటకు దక్కిన గౌరవంగా ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. కలంతో సుళువుగా రాసే రాతలతో లోతైన అర్థం పలికించే సిరివెన్నెల పాటలో అర్ధభాగంగా జీవితాన్ని పద్మ పంచుకుని నడిపిస్తూ,కేంద్రం పద్మ శ్రీని కూడా ప్రదానం చేసి పద్మల నాభుడి ని చేయడం విధాత సిరివెన్నెల కురిపించడమేనని అభిమాన ధనం భావిస్తుంది.



## అనాథ పిల్లలకు గగన విహారం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనాథ పిల్లలకు మేఘా టర్బో ఎయిర్‌వేస్ చిన్నారులు కలల్లో కూడా ఊహించని విమానయానాన్ని అందించింది. పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ట్రూజెట్ 'వింగ్స్ ఆఫ్ హోప్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గత ఏడాది కూడా నిర్వహించింది. అనాథ పిల్లలకు విమానయానాన్ని ఉచితంగా కల్పించడంతో పాటు వారిని వివిధ దర్శనీయ స్థలాలకు తీసుకువెళుతున్నది. వింగ్స్ ఆఫ్ హోప్-3 కార్యక్రమంలో భాగంగా చార్మినార్‌కు చెందిన ఆశ్రిత రెయిన్ బో ఫౌండేషన్, గాజుల రామారానికి చెందిన కేర్ అండ్ లవ్ స్వచ్ఛంద సంస్థలకు చెందిన 30 మంది చిన్నారులను శనివారం కడపకు ట్రూజెట్ విమానంలో తీసుకువెళ్ళింది. పిల్లలంతా విమానం గాలిలోకి ఎగిరే సమయంలో జింగ్.. జింగ్. అమేజింగ్ అంటూ కేరింతలు కొట్టారు. విమాన కిటికీల్లోంచి చూస్తూ పట్టరాని ఆనందంతో కేరింతలు కొట్టారు. జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలని అనుకున్న కోరికను ట్రూజెట్ తీర్చిందని విద్యార్థులు తెలిపారు. కడప జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలకు ట్రూజెట్ ప్రత్యేక విమానాల్లో తీసుకువెళ్ళింది. తొలుత పుష్పగిరి ఆలయం, ఆ తర్వాత గండికోటను సందర్శించారు. పిల్లలంతా గండికోటను చూసేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. అక్కడి నుంచి కడపలోని దర్గాకు తీసుకువెళ్ళారు. ఆధ్యాత్మిక కేంద్రాల్లో చిన్నారులు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. విమానయానం, వసతి, భోజన సదుపాయాలతో పాటు వివిధ దర్శనీయ స్థలాల సందర్శనను ట్రూజెట్ భరించింది. వింగ్స్ ఆఫ్ హోప్ కింద ఇప్పటి వరకు 300 మంది విద్యార్థులను గగన విహారానికి తీసుకువెళ్లాలని నిర్ణయించగా, ప్రస్తుతం 40 మంది అనాథ విద్యార్థులను కర్నాటకలోని హంపికి తీసుకువెళ్ళింది. అందుకు వాల్మీకి ఫౌండేషన్ సహకారం అందించింది.

## 29న పీజీటీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రెసిడెన్షియల్ సొసైటీల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పీజీటీ తెలుగు అభ్యర్థులకు 29న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు బోర్డు చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అర్హులైన వారి జాబితాను రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో ఇప్పటికే పొందుపర్చినట్టు స్పష్టం చేశారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు అర్హులైన అభ్యర్థులు 29న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు.

## 10% రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఛలో ఢిల్లీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశంలోని అగ్రవర్ణ పేదలకు కేంద్రం తీసుకొచ్చిన 10 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 11న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షులు జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేశంలోని బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 11న ఛలో ఢిల్లీ కార్యక్రమంతోపాటు వేలాది మందితో జంతర్‌మంతర్ దగ్గర మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. అంతకంటే ముందు బీసీ సంఘాలతో రేపు సన్నాహక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. దేశంలో అగ్రవర్ణాలు 10 శాతం ఉంటే వారికి 10 శాతం 16 శాతంఉన్న ఎస్సీలకు 16 శాతం, 9 శాతంగా ఉన్న ఎస్టీలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్రం 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అందుకే బీసీలకు జనాభా దామాషా ప్రకారం కనీసం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## విశాఖలో భారీ అగ్ని ప్రమాదం



**ఆరిలోవ,(విశాఖపట్నం) ప్రభ న్యూస్:** జీవీఎంసీ 1వ వార్డు రామకృష్ణాపురం ఎదురుగా సెంట్రల్ జైల్ దగ్గరలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళితే వాటర్ పైప్‌లైన్లకు నిల్వ ఉంచిన భారీ పైపుల మధ్యలో మంటలు చెలరేగాయి. రెప్పపాటు కాలంలో మంటలు దావాణంలా వ్యాపించాయి. సుమారు అరమీటరు వెడల్పు డయా కలిగిన పైప్‌లైన్లు సంవత్సరాల తరబడి బిఆర్‌టిఎస్ రోడ్డు పక్కన పడవేసి వుంచడంతో అవి తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకునాయి. మంట కోసం నిప్పు పెట్టగా ఒక్కసారిగా మొత్తం పైపులకు వ్యాపించింది. ఈ పైపులు కొన్ని ఐరన్, ప్లాస్టిక్ కలిపి వుండడంతో మంటలు ఎగసిపడ్డాయి. జీవీఎంసీ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో పైపులైన్లు అలా సంవత్సరాల తరబడి పడేసి వుండడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అగ్నిమాపక యంత్రాలు రావడం ఆలస్యం కావడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. స్థానిక ఆరిలోవ పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. రెండు అగ్నిమాపక వాహనాలు, ఫోమ్, నీటిని వెదజల్లి మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ అగ్ని ప్రమాదం బిఆర్‌టిఎస్ రోడ్డుకు కొండవైపు భాగాన జరగడంతో ఆ మంటలు కొండవైపు వ్యాపించకుండా సర్వీస్ రోడ్డు వుండడంతో ప్రమాద తీవ్రత జనావాసాలపై పడలేదు. అయితే స్థానికంగా కరెంటు సప్లయ్ పూర్తిగా నిలిపివేశారు. ఈ ప్రమాదానికి కూతవేటు దూరంలో సెంట్రల్ జైలు వుండడం, భయానక పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షల రూపాయల ప్రజాధానం పైపులు దహనం అవ్వడం ద్వారా వృథా అయ్యిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జాతకాలివిగో... జాగ్రత్త!

**● దిద్దుకోపోతే నష్టపోతారు ● సత్తా చూపలేని వాళ్ళు తప్పుకోండి ● అభ్యర్థుల ఎంపికలో స్పీడు పెంచిన ఏపీ సీఎం చంద్రబాబు ● సిట్టింగులకు అతి విశ్వాసం పనికిరాదంటూ హెచ్చరికలు ● ఒకవైపు ప్రజాభిప్రాయ సేకరణ.. మరోవైపు నేతలతో ముఖాముఖి చర్చలు ● ప్రజలతో మమేకమైతే గెలుపు ఏకపక్షమేనని హితవు**

**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో కీలక పరిణామానికి తెరలేచింది. తమ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖాముఖి భేటీలను నిర్వహిస్తున్నారు. వారి జాతకాలను వారి చేతిలోనే పెట్టి నియోజకవర్గాల్లో వారి బలాలు, బలహీనతలను చెప్పి ఎలా దిద్దుకోవాలో, ఏవి సరిచేసుకోవాలో వివరిస్తున్నారు. పరిస్థితి బాగోలేని వారికి మొహమాటం లేకుండా అక్షింతలు వేస్తున్నారు. ఈ భేటీలను బుధవారం నుండే ఆయన ప్రారంభించారు. రోజుకు 15 నుండి 20 మంది వరకూ పిలిపించుకుని మాట్లాడుతున్నారు. మొదటి రోజు మాట్లాడిన వారిలో మంత్రి శిద్ధా రాఘవరావు వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని సామాజికవర్గాలను కలిపి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. బలంగా ఉన్న ఎమ్మెల్యేలు, బలహీనంగా ఉన్న ఎమ్మెల్యేలను కలిపి పిలవడం ద్వారా ఎవరికీ ఏ సంకేతాలు అందకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో వారిపై ఉన్న అభిప్రాయం, ప్రజలు, పార్టీ వారితో సంబంధాలు, బలాలు, బలహీనతలపై ఈ సమాచారం సేకరిస్తున్నారు. వాటిని నివేదిక రూపంలో తయారుచేసి ఇప్పుడు వారి చేతికి ఇస్తున్నారు. ఎమ్మెల్యేలకు గతంలో కూడా కొన్ని నివేదికలు ఇచ్చారు. అప్పుడవి సంక్షిప్తంగా ఉండేవి. సరిదిద్దుకోవాల్సిన అంశాలు దూరంగా ఉన్న పార్టీ నేతలు, వివిధ అంశాల్లో వారికి వచ్చిన మార్కులతో ఉండేవి. ఈ సమాచారాన్ని ఇప్పుడు మరికొంత విపులంగా ఎమ్మెల్యేల చేతికి ఇవ్వబోతున్నానని సోమవారం జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు చెప్పిన సంగతి పాఠక విధితమే. ఈనేపథ్యంలోనే ఆయన ఆ కార్యక్రమాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చారు. అయితే, అన్నీ చెబితే సమాచారం ఇచ్చిన వారిపై దండెత్తుతారని గతంలో కొన్ని చెప్పలేదు. కానీ, ఇప్పుడు సమయం వచ్చినందున నిర్మొహమాటంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చిట్టా విప్పుతున్నారు. మీ లోపాలు, సమస్యలు ఏమిటో అన్నీ చెప్పదలిచాను. కొందరు బాగా చేసుకుంటున్నారు, కొందరు బాగా పనిచేస్తున్నా సరైన సంబంధాలు నిర్వహించలేకపోతున్నారంటూ ముఖ్యమంత్రి వారికి చెబుతున్నారు. మరి కొందరు వివాదాల్లో చిక్కుకుంటున్నారని, ప్రజల్లో మంచిపేరు ఉండటం మీకు, నాకు అవసరం, అందుకే మీ లోపాలు ఏమిటో మీ చేతికే ఇస్తాను. దిద్దుకుంటే మంచిది. లేకపోతే నష్టపోతారు. అని ఈసందర్భంగా వారికి ముఖ్యమంత్రి నిష్కర్షగా చెప్పేస్తున్నారు. ఈ భేటీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బయటకు వచ్చాక పైకి గంభీరంగానే కనిపిస్తున్నారు. ఆయన చెప్పిన లోపాలు నిజమే అని మాకు తెలుసు, వాటిని సరిచేసుకునే ప్రయత్నంలో ఉన్నాం. కావాలని కొందరు మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. అదీ ఆయన దృష్టికి తీసుకెళ్లాం అని ఒక ఎమ్మెల్యే చెప్పారు.

### మీరు మారరా ?

కొందరు శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఎన్నిసార్లు చెప్పినా వారి పనితీరులో మార్పు రావడం లేదని, ప్రజలకు దగ్గరవడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమన్వయ కమిటీ భేటీలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల పనితీరుపై ప్రజలు, పార్టీ కేడర్ అభిప్రాయం ఎలా ఉందో బహిరంగంగానే ప్రకటిస్తానంటూ వార్నింగ్ కూడా ఇచ్చారు. పోటీలో తట్టుకుని నిలబడగలం అనుకున్న వారు తనతో ఉంటారని, ఎవరైనా మేం చేయలేమని చెబితే వేరే వాళ్లను చూసుకుంటామని ఈసందర్భంగా ముఖ్యమంత్రి వారితో భేటీ సందర్భంగా స్పష్టంచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల పట్ల విశ్వాసపాత్రులుగా ఉండేవారికే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని తెగేసి చెప్పారని చెబుతున్నారు. ఇన్ని రోజులు సున్నితంగా చెప్పినా కొందరిలో మార్పు రావడం లేదని, ఇకపై గట్టిగానే చెబుతానంటూ ముఖ్యమంత్రి వారితో అన్న మాటలను బయటకు వచ్చాక గుర్తుచేసుకుంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసినప్పుడు ప్రజలకు విశ్వాసపాత్రులుగా ఉంటామని మీ అందిరతో ప్రమాణ స్వీకరం చేయిస్తానని, అలా ఉన్న వారికే టిక్కెట్టు అని స్పష్టంచేసినట్లు వారు పేర్కొంటున్నారు.

### నేను వెళ్లకపోయినా ప్రజలు ఆమోదించడం లేదు

శాసనసభ్యుల పనితీరుపై ప్రతి నియోజకర్గంలోనూ ప్రతి నెలా 25 వేల మంది నుండి వివిధ మార్గాల్లో అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్ని సంక్షేమ కార్యకమాలు చేసినా, శాసన సభ్యులు నియోజకవర్గంలో అందుబాటులో లేకపోతే ప్రజలు ఆమోదించడం లేదన్న విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సిట్టింగులకు హితబోధ చేస్తున్నట్లు తెలిసింది. తాను కుప్పం నియోజకర్గానికి వెళ్లకపోయినా ప్రజలు అంగీకరించడం లేదని చెప్పినట్లు వినికిడి. చిత్తూరులో గత నెలలో ప్రజల్లో 58 శాతం ఉన్న సంతృప్తిస్థాయి ఈనెల్లో 62కి, పలమనేరులో 55 నుండి 61కి, బనగానపల్లెలో 65 నుండి 72కు, నంద్యాలలో 72 నుండి 79కి చేరినట్లు ముఖ్యమంత్రి స్వయంగా వారికి చెబుతున్నారు. తాను కుప్పం వెళ్లి వచ్చాక 13 శాతం పెరిగిందని ప్రస్తావించినట్లు తెలిసింది. అతి విశ్వాసంతో వెళితే సమస్యలు వస్తాయని చంద్రబాబు సిట్టింగులను హెచ్చరిస్తున్నారు. ప్రజలు తెదేపాపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే తెదేపా గెలుపు ఏకపక్షమేనని హితబోధ చేస్తున్నారు.

## రుణదాతలకు జీగ్రూప్ చైర్మన్ క్షమాపణలు


**ముంబై:** స్టాక్‌మార్కెట్‌లో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు 25 శాతం పతనమవ్వడంపై జీ అండ్ ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర స్పందించారు. బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, మ్యూచ్‌వల్ ఫండ్స్ రుణదాతల అంచనాలను అందుకోలేకపోయినందుకు క్షమించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ బహిరంగ లేఖరాశారు. కొన్ని వ్యతిరేకశక్తుల కారణంగా షేరు విలువ పడిపోయిం దన్నారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ చెల్లింపుల ఆలస్యం కారణంగా ఈ పరిస్థితని నిందించారు. జీ గ్రూప్స్ విధ్వంసానికి పథకం ప్రకారం అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అప్పులు సంస్థపై నమ్మకాన్ని తగ్గించాయన్నారు. తిరిగి చెల్లించాల్సిన దాదాపు రూ. 20 వేల కోట్ల అప్పులతో జీ అండ్ ఎస్సెల్ ఒత్తిళ్లను ఎదుర్కొంటుందన్న విషయం తెలిసిందే.

## వైసీపీలో చేరిన సీఐ మాధవ్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన సీఐ గోరంట్ల మాధవ్ ఆ పార్టీలో చేరారు. శనివారం మాధవ్‌ను సాదరం గా ఆహ్వానించిన జగన్ పార్టీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీఎంపీ మిథున్ రెడ్డితో పాటు పార్టీ బీసీ అధ్యయన కమిటీ సభ్యులు మాజీ న్యాయమూర్తి ఎం.కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

# సాగు, సంక్షేమాలకే ప్రాధాన్యం

**● ఎన్నికల వేళ పన్నులకు దూరం**
**● గత ఏడాదికన్నా 22.38 శాతం అధికంగా నిధుల కేటాయింపు?**
**● ముగిసిన ప్రీ బడ్జెట్ భేటీలు**
**● సీఎంతో భేటీలో తుదిమెరుగులు**
**● 5న శాసనసభలో రాష్ట్ర బడ్జెట్**



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే శాసనసభ చివరి సమావేశాలు ఈనెల 30 నుండి జరగనున్న నేపథ్యంలో సభలో ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆర్థికశాఖ ఉన్నతాధికారులు తమ కసరత్తు ను పూర్తిచేశారు. గత నాలుగు రోజులుగా ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులు, ఉన్నతాధికారులు, శాఖాధిపతులతో కలిసి ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ లతో కూడిన ఉన్నతాధికారుల బృందం బడ్జెట్ అంచనాలను రూపొందించారు. త్వరలో ముఖ్యమంత్రితో సమావేశమై తుదిమెరుగుల దిద్దిన అనంతరం ఫిబ్రవరి 5న శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గత ఏడాది రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యతా రంగాలకు కేటాచింని నిధులతో పోలిస్తే ఈ ఏడాది అదనంగా మరో 22.38 శాతం అధిక నిధులు కేటాయించాలని ఆయా శాఖల నుండి ప్రతిపాదనలు అందినట్లు అత్యంత విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా నీటిపారుదల, రైతులకు పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతోపాటే రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికి చేయూతనిచ్చేందుకు వీలుగా భారీ కేటాయింపుల చేపట్టాలని ఆయాని ఆయాశాఖలు అంచనాలు వేశారు. అయితే గత నాలుగు రోజులుగా రాష్ట్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారులు చేపట్టిన ప్రీ బడ్జెట్ సమావేశాలలో తొలిరోజున వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పౌరసరఫరాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, మహిళ, శిశుసంక్షేమ, గ్రామీణ గృహనిర్మాణ, కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధిశాఖల ఉన్నాధికారుల నుండి బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలను స్వీకరించారు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో రైతులకు రూ.24 వేల కోట్లకు పైగా రైతురుణమాఫీ పథకాన్ని అమలు చేసిన ప్రభుత్వం 2019-20 ఆర్థికసంవత్సరంలోనూ అదే ఒరవడిని కొనసాగించడంతోపాటు అదనంగా మరికొందరికి ప్రయోజనం చేకూరేలా అదనపు కేటాయింపులకు ప్రభుత్వం మొగ్గు చూపిస్తున్నట్లు తెలిసింది. పౌరసరఫరాలు, బీసీ, ఎస్సీఎస్టీమైనార్టీ, స్త్రీ శిశుసంక్షేమం, గ్రామీణ గృహనిర్మాణం, నైపుణ్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం బడ్జెట్‌లో మరో 20.15 శాతం అదనపు కేటాయింపులు ఉండే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రెండవరోజు ఆర్థికశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన భేటీలో పరిశ్రమలు, విద్యుత్, ఆదాయ ఆర్జన రెవెన్యూశాఖలు, హోం, పురపాలక, అటవీశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న ఆయా శాఖలు తమ ఆదాయ మార్గాలను మెరుగుపర్చుకోవడంపై ప్రత్యేక దృష్టిని సారించారని సమాచారం. అలాగే ఆదాయం పెంపుతోపాటే ఖర్చులు కూడా పెరుగుతున్నాయని ఆయాశాఖల ఉన్నతాధికారులు ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు వెల్లడించినట్లుగా తెలిసింది. మానవవనరుల అభివృద్ధి, గ్రామీణ, పంచాయితీరాజ్, రవాణా, రోడ్లు భవనాలు, ఆరోగ్య, జలవనరులశాఖలతో పాటు వరుసగా మూడు, నాల్గవ రోజున సాధారణ పరిపాలన, ఐటీ, సమాచార ప్రసారాలు, ప్రణాళిక, పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో ప్రీబడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 22.38 అధికంగా నిధుల కేటాయింపుతో బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

మరోవైపు విభజన హామీలు నెరవేరనేలేదు.. సభా సమక్షంలో నాటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునఃవ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన అంశాలు ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదన్న విమర్శలను ఎక్కుపెడుతూనే రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలతో కొత్త ఒరవడికి తెర తీసింది. ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయరంగానికి పెద్దపీట వేసినప్పటికీ 2013-14లో ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగ వాటా 23 శాతంగా నమోదు అయ్యింది. విభజన సమయంలో 30.2 శాతం వరూ పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 34.4 శాతానికి చేరుకుంది. విభజన అనంతరం 2017-18లో పారిశ్రామికరంగం వాటా 22.09శాతం నమోదు కాగా, సర్వీసు రంగానికి సంబంధించిన వాటా 43.55 శాతానికి తగ్గింది.

2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల రంగాల శాతాన్ని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధిస్తున్న వృద్ధిరేటు వ్యత్యాసం తేటతెల్లమవుతుంది. ఏపీ వ్యవసాయ రంగంలో 34.37 శాతం, పరిశ్రమల రంగంలో 22.09, సేవా రంగంలో 43.54 శాతం వృద్ధిని మోదు చేసుకోగా, తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో14.28 శాతం, పరిశ్రమల రంగంలో 21.92, సేవా రంగంలో 63.8 శాతంగా నమోదు అయ్యింది. తమిళనాడు వ్యవసాయ రంగంలో 12.58, పరిశ్రమల రంగంలో 34.05 శాతం, సేవా రంగంలో 53.37 శాతాన్ని కైవసం చేసుకుంది. కర్ణాటక వరుసగా 10.82, 22.91, 66.27శాతం రేటును సాధించింది. కేరళ రాష్ట్రం వ్యవసాయంలో 17.09, పరిశ్రమల విభాగంలో 29.06, సేవా రంగంలో 53.85 శాతం రేటును సాధించింది. దక్షిణాధిరాష్ట్రాలకు సంబంధించిన వృద్ధిరేటుతో జాతీయస్థాయి వృద్ధిరేటును పోలిస్తే.. వ్యవసాయరంగంలో 17.09 శాతం, పరిశ్రమల రంగంలో 29.06శాతం, సేవా రంగంలో 53.85 శాతం నమోదు అయ్యింది. సుస్థిరమైన రాజధానిని కలిగి ఉన్న రాష్ట్రాలతో విభాగిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేవలం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంపైనే కాకుండా రాజధాని నిర్మాణానికి సంబంధించి నిధుల సమీకరణలోనూ మరింత దృష్టిని సారించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వాదిస్తోంది. గత నాలుగేళ్ల పాలనలో ఆర్థిక అసమానతలను పరిగణలోకీ తీసుకొని దానికి అనుగుణంగా ప్రత్యేకంగా జనాకర్షక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

### నేడో.. రేపో.. సీఎంతో ఉన్నతాధికారుల భేటీ

రాష్ట్ర శాసనసభ సమావేశాలలో భాగంగా ఫిబ్రవరి 5న ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడతో ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కె.వి.వి.సత్య నారాయణలు నేడో.. రేపో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ సమావేశాల్లో ఆయా శాఖలు అందజేసిన బడ్జెట్ అంచనాలపై ఆర్థికమంత్రి యనమల సీఎం చంద్రబాబుకు వివరించనున్నారు. ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రతిపాదనలపై చేసే సూచనల ప్రకారంగా తుదిమెరుగులు దిద్దిన అనంతరం ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం గంటలకు శాసనసభలో బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల ప్రవేశపెట్టనున్నారు.



**న్యూఢిల్లీ :** రైసినాహిల్స్ రోడ్‌లో విద్యుత్ కాంతుల ధగధగలు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు.



**చెన్నై : కోయంబతూర్ విమానాశ్రయంలో డీఆర్ఐ తనిఖీల్లో రూ. 55 లక్షల విలువైన 16 క్రూడ్ బాక్సుల బంగారం బిస్కెట్లు పట్టుబడ్డాయి.**



## సర్పంచ్ అభ్యర్థిపై ప్రత్యర్థుల దాడి

### రుద్రూరులో ఉద్రిక్తత.. పోలీస్ పికెటింగ్



**రుద్రూరు, ప్రభ న్యూస్ :** రెండో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా రుద్రూరు మండల కేంద్రంలో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థిపై, ఆయన అనుచరులపై ప్రత్యర్థులు దాడి చేయడం సంచలనం సృష్టించింది. సర్పంచ్‌గా గెలుపొందిన ఇందూరు చంద్రశేఖర్‌తో పాటు ఆయన అనుచరులపైన ప్రత్యర్థులు దాడి చేయడంతో రుద్రూరు మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి ఓట్ల లెక్కింపు చివరి దశకు చేరుతున్న సమయాన చంద్రశేఖర్ వర్గీయులు ఆనందంతో కేరింతలు కొడుతు మోటార్ సైకిళ్లపై తిరుగుతు ఉత్సవాలు జరుపుకున్నారు. లెక్కింపు పూర్తి కావడంతో ఇందూరు చంద్రశేఖర్ (కాంగ్రెస్ మద్దతుదారుడు) తన ప్రత్యర్థి పత్తిరాము (తెరాస మద్దతు దారుడు)పై గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ఓట్ల లెక్కింపు కేంద్ర వద్ద వేడుకలు జరుపుకుంటున్న సమయంలోనే ప్రత్యర్థులు కొందరు చంద్రశేఖర్ మద్దతు దారుడు, కాంగ్రెస్ నాయకుడు అయిన కర్క అశోక్ ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు కర్క సాయిలక్ష్మణ్ తో పాటు పలువురు యువకులపై దాడికి పాల్పడటమే కాకుండా, ఇంట్లోని వస్తువులను చిందర వందరగా పడేసి ధ్వంసం చేస్తూ అడ్డువచ్చిన ఒక వృద్ధురాలిని సైతం తోసివేశారు. విషయం అనుచరుల ద్వారా తెలుసుకున్న చంద్రశేఖర్, ఆయన సోదరుడు విజయ భాస్కర్ మరికొంత మందితో కర్క అశోక్ ఇంటికి వెళ్లి పరిస్థితిని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బయలు దేరారు. దారిలో వీరిని పత్తి రాము వర్గీయులు అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రుద్రూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పోలీస్ స్టేషన్‌కు అపై వైద్య నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు, మద్దతు దారులు, గ్రామస్థులు తమకు న్యాయం చేయాలని కోరుతు రుద్రూరు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి తమకు న్యాయం చేసేవరకు కదిలేది లేదని పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. రుద్రూరు సిఐ దామోదర్ రెడ్డి బాధితులతో మాట్లాడి ప్రత్యర్థులపై కేసు నమోదు చేసి, న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# బీర్ విక్రయాలకు ఎన్నికల కిక్కు

### చలిలోనూ తెగ తాగిన బీరుబాబులు

● విక్రయాల్లో 6 శాతం వృద్ధి ● వరుస ఎన్నికలతో రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు ● లక్ష్యసాధన దిశగా ఆదాయం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** చలి గజగ జలాడించినా ఎన్నికల వేడితో మందు బాబులు బీరు బలులుగా వ.ారి పోయారు. ఎన్నికల వేళ మద్యం విక్రయాల జోరు పెరిగింది. రాష్ట్రంలో వరుస ఎన్నికలతో ప్రభుత్వానికి కాసుల పంట పండుతోంది. కీలక ఆదాయ వనరైన అబ్కారీ విక్రయాలకు ఎన్నికలతో కిక్కు వచ్చింది. వరుస ఎన్నికలు రావడంతో మద్యం అమ్మ కాలలో కనీవినీ ఎరుగని రీతిలో వృద్ధి రేటు నమోదవుతోంది. అన్ని జిల్లాల్లోనూ మద్యం విక్రయాల జోరు పెరుగుతున్నది. జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రమంతటా ఎన్నికల కోలాహలంతో పండుగ వాతావరణం నెలకొంది. మొదటి, రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మద్యం విక్రయాలు జోరు సాగాయి. చివరి విడత పంచాయతీ ఎన్ని కలకూ మద్యం కోసం భారీ డిమాండ్ ఉంది. ఈనెల 30న జరగనున్న పోలింగ్ సంద ర్భంగా ఓటర్లకు సరఫరా చేసేందుకు భారీఎత్తున మద్యాన్ని కొని ఎక్క డిక క్కడ నిల్వ చేస్తున్నారు. తాజాగా అమ్మకాలలో నమోదైన వృద్ధి ఇందుకు ఉదా హరణ. కాగా గత నెలరోజులుగా వాతావరణం చల్లబడినప్పటికీ రికార్డు స్థాయిలో బీర్ విక్రయాలు నమోదయ్యాయి. వరుసగా న్యూఇయర్ డే సంబరాలు, సంక్రాంతి, అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు రావడంతో పల్లెల్లో మద్యం ఏరులై పారుతుండగా, ఖజానాకు కాసుల పంట పండుతోంది. ఈ ఏడాది జనవరి 1నుంచి 25 వరకు రికార్డు స్థాయిలో రూ. 15,536.73 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇందులో మద్యం 2,53,90,672 కేస్‌లతో రూ. 11,713.84 కోట్ల అమ్మ కాలు నమోదవగా, 3,69,06,282 పెట్టెల బీర్లతో రూ. 3822.87 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాదికంటే దాదాపు 10శాతంపైగా వృద్ధిరేటు నమోదైనట్లుగా విక్ర యాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే డిసెంబర్‌లో మద్యం దుకాణాలు పెద్దఎత్తున కొని నిల్వ చేశాయి. ఆ తర్వాత రాజకీయ నేతలు కూడా మద్యం, బీర్లను కొనుగోలు చేసి దాచారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది బెల్టు షాపులు భారీ మొత్తంలో మద్యం వ్యాపారం కొనసాగించాయి. ప్రస్తుత ఆర్థిక సంవ త్సరంలో స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, అబ్కారీ శాఖలు లక్ష్యం మించనున్నాయి. ఈ రెండింటి ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమ కూరు తోంది. తాజాగా ఈ ఏడాది లక్ష్య సాధనలో ఇప్పటికే 80 శాతం రాబడిని సాధించి రూ. 9350 కోట్లను ఆర్జించింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు 20 శాతం వృద్ధి రేటు ను సంతరించుకోగా బీర్ విక్రయాల్లో 6 శాతం పెరుగుదల నమో దైంది. అమ్మకాల ఆదాయంతోపాటు పన్ను లు, ఇతర మార్గాల్లో ఆశించిన రాబడి సమకూరుతోంది. మార్చిలోగా రూ. 10,600 వేల కోట్ల లక్ష్యం మించే అవకాశం ఉంది.

**బడ్జెట్ అంచనాల పెంపు...**

ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో సొంత వనరుల వృద్ధి రేటు 29 శాతంపైగా నమో దుకావడంతో వచ్చే ఆర్థిక సంవత్సరంపై దృష్టిపెట్టారు. వచ్చే బడ్జెట్‌లో కీలకమైన వనరులపై 10నుంచి 20 శాతం వరకు అంచనాలు పెంచుకోవాలని యో చిస్తోంది.

**గల్లీకో బెల్టు షాపు...**

రాష్ట్రంలో జరుగుతున్న మద్యం విక్రయాల్లో బెల్టు షాపులే కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఎన్నికలకు అవసరమైన మద్యం వీటి ద్వారానే సులువుగా నేతలకు చేరుతోంది. 8685 గ్రామాలు, 21వేల హాబిటేషన్లలో ఇవి నడుస్తున్నాయని తేలింది. ప్రతీ గ్రామంలో సగటున ఐదు, హాబిటేషన్‌లలో మూడు చొప్పున బెల్టు దుకాణాలు నడుస్తున్నాయని అంచనా. ఇవన్నీ కలిపితే రాష్ట్రంలో అనధికారకంగా లక్షకుమించి బెల్టు దుకాణాలు నడుస్తున్నాయని అబ్కారీ శాఖ అంచనా వేసింది. వీటి ద్వారా ఏటా రూ. 18 వేల కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం.

**కఠిన నిబంధనలు...**

రాష్ట్రంలో బార్లు, మద్యం దుకాణాలపై కఠిన నిబంధనలు అమలు చేయాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా షాపింగ్ మాల్స్, హైదరాబాద్‌లో రాత్రి 11గంటల వరకు మద్యం విక్రయాలకు అనుమతించిన తర్వాత విక్రయాలు బాగా పెరిగాయి. రాష్ట్రంలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు 60 శాతం విక్రయాలు సాగుతున్నాయని, రాత్రి 7 తర్వాత 12 గంటలవరకు ఒక్కసారిగా 40 శాతం మద్యం వినియోగం జరుగుతున్నట్లు గుర్తించారు.

### జల్లపల్లి పంచాయతీకి 30న రీపోలింగ్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని జల్లపల్లి గ్రామ పంచాయతీకి ఈ నెల 30 ఎన్నికలు జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ సర్పంచ్ పదవితోపాటు 3,4,5,6,7,8 వార్డు స్థానాలకు కూడా ఎన్నికలు జరపాలని ఆదేశించింది. ఈనెల 25న జరిగిన పోలింగ్ సందర్భంగా జరిగిన పొరపాట్ల కారణంగా ఇక్కడ తిరిగి పోలింగ్ జరపనున్నారు.

### శివ్వారంలో 28న ఉప సర్పంచ్ ఎన్నిక

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారం గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య 28న ఉదయం 11.30గంటలకు ఉప సర్పంచ్ ఎన్నికలు జరపాలని ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

### ముల్కల కాల్వలో ఫిబ్రవరి 8న పోలింగ్

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని ముల్కల కాల్వ గ్రామ పంచాయతీలో 5వవార్డుకు ఫిబ్రవరి 8న పోలింగ్ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అదే రోజు ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటించాలని ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

### రూ.7.44లక్షల నగదు సీజ్

రాష్ట్రంలో మూడవ విడత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో వివిధ ప్రాంతాల్లో అధికారులు శనివారం తనిఖీలు జరిపారు. రూ744140 నగదు పట్టుబడింది. అంతే కాకుండా వేర్వేరు సంఘటనల్లో 27మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు.

# తాయిలాలు.. శాశ్వతమేనా..?

● లోక్‌సభ ఎన్నికల వేళ రైతు కేంద్రంగా మధ్యంతర బడ్జెట్ ● రుణమాఫీ శాశ్వత పరిష్కారం కాదన్నది కేంద్రం వాదన.. ● మరి బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు ఉంటాయ్..? ● రైతుబంధు, కేఏఎల్ఏలను సమ్మిళితం చేస్తారా..? ● ఎంఎస్‌పీ, మార్కెట్ సౌకర్యాలను మెరుగుపరుస్తారా? ● మోడీ సర్కార్ ఓటాన్ బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి..



**ఎన్డీయే ప్రభుత్వం చివరి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమ వుతున్నది. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు పాలనా పరమైన వ్యయానికి అవసరమైన పద్దుకు అనుమతి పొందడమే ఈ బడ్జెట్ ముఖ్య ఉద్దేశం. క్లుప్తంగా దీన్ని ఓటాన్ అకౌంట్‌గా పేర్కొంటారు. ఉత్తరాదిలో మూడు ప్రధాన రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ ఓటమి పాలవడం.. సార్వత్రిక ఎన్నికలు సమీపి స్తున్నందున మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆఖరి బడ్జెట్ జనరం జకంగా మారుతుందని ఆర్థికవేత్తలు, రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.**

**న్యూఢిల్లీ:** దేశంలో ఇప్పుడున్న ప్రధాన సమస్యల్లో వ్యవసాయ సంక్షోభం ఒకటి. ఏటికేడాది ఈ సమస్య తీవ్రమవుతూ వస్తోంది. దేశంలోని మెజారిటీ ప్రజలు ఎక్కువగా ఆధారపడిన రంగం కావడం, వృద్ధిరేటును ప్రభావితం చేస్తున్న రంగమైనందున ఎన్నికలకు ముందు ఇది ప్రాధాన్యాంశంగా మారనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. దీర్ఘకాలంగా వెన్నాడుతున్న సాగు సంక్షోభానికి, అప్పుడప్పుడు రుణమాఫీ ప్రకటనలు మినహా, శాశ్వత పరిష్కారం దిశగా చేపట్టిన చర్యలు అరకొరే. 2017 ఏప్రిల్ నుంచి నేటిదాకా 8 రాష్ట్రాలు రైతులకు రుణమాఫీ ప్రకటిం చాయి. ఇందుకు దాదాపు 1.9 లక్షల కోట్లు అవసరం. రక్షణ కేటాయింపుల్లో మూడింట రెండొంతులకు సమానం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ అమలు చేస్తామని రాహుల్ గాంధీ గట్టిగానే హామీ ఇచ్చారు. ఈ చర్య సమస్యకు తాత్కాలిక ఊరట నిస్తుందే తప్ప, సమర్థవంతమైన నివారిణి ఎంతమాత్రం కాదు.

● నాబార్డ్ లెక్కల ప్రకారం జులై 2015 నుంచి జూన్ 2016 మధ్య కాలంలో 43.5 శాతం రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. వీరితోపాటు 69.7శాతం మంది సంస్థాగత రుణాలు పొందారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిజంగా రుణ మాఫీ పథకాన్ని అమలు చేసినా, 70శాతం మంది రైతులు ఈ ప్రయోజనానికి బయటే ఉంటారు. బ్యాం కింగేతర రుణాలు రైతుకు గుదిబండగానే మిగులుతాయి. ఈ క్రమంలో కౌలు రైతులకు ఒనగూడేదేమీ ఉండదు.

● రైతు రుణమాఫీ పథకం ఆర్థిక వ్యవస్థకు భారంగా మారుతుంది. ద్రవ్యలోటు అదుపు తప్పుతుంది. ఇలాంటి చర్యల వల్లే ఇండియా తరచూ ద్రవ్యలోటు లక్ష్యాలను చేరలేకపోతున్నది. ఇలాంటి డిమాండ్లకు ప్రభుత్వం ఎక్కువ కేటాయింపులు చేస్తే, అభివృద్ధి పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుంది. ఇది మొత్తం సామాజిక వ్యవస్థను దెబ్బతీస్తుంది.

● ఎన్నికలు.. రుణమాఫీ పథకాలకు అలవాటు పడటం మూలంగా రైతుల రుణసామర్థ్యం బాగా క్షీణించింది. ఇలాంటి సంస్కృతి రుణగ్రహీతల్లో ఉదాసీనతకు కారణమౌతున్నది. అప్పులు చెల్లించాలన్న సంకల్పం నుంచి దూరం చేస్తున్నది.

● వ్యవసాయ సంక్షోభ నివారణకు మరింత సమర్థవంతమైన, వాస్తవ ఆధారిత చర్యల అనివార్యం. కనీస మద్దతు ధర వంటి ప్రయత్నాలు కూడా సమస్యాత్మకంగానే గోచరించాయి. నష్టాలను కొంత మేరకు తగ్గించగలుగుతాయే తప్ప, సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం కావడం లేదు. మొత్తానికి ఎంఎస్‌పీ చర్యలు కేవలం పెద్దరైతులకు (భూస్వాములు) మాత్రమే లాభదాయకన్న అపవాదు ఉంది.

● ఈ క్రమంలో కొన్ని రాష్ట్రాలు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా సరికొత్తగా ఆలోచిస్తుండటం మంచి పరిణామం. మెజార్టీ రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చేలా తెలంగాణ ప్రభుత్వం రైతు పెట్టుబడికి శ్రీకారం చుట్టింది. ఎకరాకు ఐదువేలు పెట్టుబడి సాయం అందిస్తోంది. మునుపటి పథకాల కంటే ఇది ఆచరణీయంగానూ, ప్రభావ శీలంగాను ఉంది. దాదాపు 90 శాతం రైతాంగానికి మేలు చేకూర్చుతున్నది. అయితే ఇక్కడా కొన్ని విమర్శలు వస్తున్నాయి. కౌలు రౌతులకు ఈ పథకంలో చోటు లేకపోవడం కొత్త సమస్యకు దారితీస్తున్నది.

● ఒడిశా ప్రభుత్వం ఈ కోణంలో ఒక అడుగు ముందుకేసింది. కృషక్ సహాయత పథకానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు ఒకేసారి సహాయం అందించడం దీని ఉద్దేశం. ఇక్కడా చిక్కులున్నాయి. ఈ రెండు విభాగాల్లో సరైన రికార్డులు అందుబాటులో లేనందున, ఈ పథకం అమలుపై సందేహాలు నెలకొన్నాయి. ఏదేమైనా ఇలాంటి చర్యలు అవినీతి రహితంగా ఉండటమే కాకుండా నేరుగా రైతుకు మేలు కలిగించేవని చెప్పవచ్చు.


● ఐసీఆర్ఐఈఆర్-ఓఈసీడీ గతేడాది నివేదికలో ఇండియన్ వ్యవసాయ విధాన లోపాలను ఎత్తిచూపింది. మధ్యవర్తులు, దళారీ వ్యవస్థ కారణంగా అంతర్జాతీయ మార్కెట్ల సగటు ధరకంటే ఇక్కడి కనీస మద్దతు ధర స్థాయిలు తక్కువగా ఉన్నాయని పేర్కొంది. తద్వారా వ్యవసాయ ఆదాయ వృద్ధి ఏటా సగటున 6శాతం నష్టపోతున్నట్లు స్పష్టం చేసింది.

● ఈవిధమైన వ్యవసాయ విధానాలు రైతుపై సంపూర్ణ పన్నుకు కారణమవుతున్నాయి. ఈ దుస్సంప్రదాయానికి ముగింపు పలికేందుకు, పరిష్కార మార్గాలు ప్రవేశపెట్టేందుకు మోడీ ప్రభుత్వం ముందున్న చివరి అవకాశం ఇదే.

## సాగు సవాళ్లు, ఉద్యోగ కల్పన కీలకం

### కేంద్రానికి ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి సూచన

వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారం, ఉద్యోగ, ఉపాధికి తోడ్పాటునిచ్చే అంశాలకు ప్రాధాన్యమివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. తద్వారా ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలపై దృష్టిసారిస్తూనే, సామాజిక సంక్షేమాన్ని కొనసాగించాలని తెలిపింది. వారం రోజుల్లో మధ్యంతర బడ్జెట్ రానున్న క్రమంలో ప్యానల్ ప్రభుత్వానికి ఓ నివేదికను ఇచ్చింది. చిన్న,సన్నకారు రైతాంగానికి మేలుచేసే చర్యలు చేపట్టాలని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్న వేళ సలహా మండలి నివేదిక కీలకంగా మారనుంది. కేంద్రం త్వరలోనే రైతులకు ప్రోత్సాహమిచ్చే ప్యాకేజీ ప్రకటిస్తుందని నాలుగు రోజుల కిందట కేంద్ర వ్యవసాయ సహాయమంత్రి పర్షోత్తం రూపాల చేసిన వ్యాఖ్య ఇందులో భాగంగానే కనిపిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 3.3శాతానికి తీసుకు రావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అంతకు ముందుకంటే ఇది 0.02 తక్కువ. గతేడాది ఏప్రిల్ -నవంబర్ త్రైమాసికానికి ద్రవ్యలోటు 92, 349 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యం కంటే 15శాతం అదనం. ఈ పరిస్థితుల్లో ఉపశమన చర్యల భారం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయకుండా జాగ్రత్త వహించాలని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనదేశ మైక్రో ఎకానమీ మూలాలు బలంగా ఉన్నాయి. అంతర్జాతీయ పరిణా మాలు దేశీయ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. స్థూలంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి ఏమంత ఆశాజనకంగా లేదు. ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాల కంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వృద్ధి స్థిరంగా ఉందని, ఈ కోణంలో భారత్ మెరుగైన స్థితిలో ఉందన్నది మరికొందరు నిపుణుల వాదన. ఏదేమైనా ద్రవ్యలోటు లక్ష్యానికి నష్టం వాటిల్లకుండా ఉపశమన, ప్రోత్సాహక చర్యలు ఉంటేనే మేలన్నది ఆర్థికవేత్తల అభిప్రాయం.



## త్వరలో ఎమర్జెన్సీ కాల్‌బాక్స్‌లు

### అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదు సౌకర్యం

### టెక్నాలజీలో తెలంగాణ పోలీస్ మరో అడుగు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రజాసేవలో తెలంగాణ పోలీసులు ఎల్లవేళలా ముందంజలో ఉంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు భాగ్యనగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ కాల్ బాక్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎల్ అండ టీ సంస్థ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని రూపొందిస్తోంది. అత్యవసర పరస్థితుల్లో రోడ్డు ప్రమాదమైనా? ఆపదలో ఉన్న సమయంలో ఈ ఎమర్జెన్సీ కాల్ బాక్స్ మీటాను నొక్కి ఫిర్యాదు చేయవచ్చు. ప్రథమంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద దీనిని ఏర్పాటు చేయనున్నారు. అనంతరం భాగ్యనగరంలోని పలు కూడళ్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వీటిని అందుబాటులోకి తేనున్నారు. ఎమర్జెన్సీ కాల్‌బాక్స్‌లో ఆడియో, వీడియో రికార్డ్ కూడా అందుబాటులో ఉంటుంది. ఫోన్ చేస్తున్న వారి వివరాలన్నీ రికార్డవుతాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎవరు మాట్లాడుతున్నారో సైతం ఇందులో చూసే అవకాశం ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే ప్యాట్రోలింగ్, గస్తీ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. క్షణాల్లో పోలీసులు ఘటనాస్థలికి వచ్చేందుకు ఇది ఉప కరిస్తుంది. దీనిని బంజారాహిల్స్‌లో ప్రారంభానికి నోచుకోనున్న కమాండ్ కంట్రోల్ సెంటర్, పోలీసు కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అను సంధానం చేస్తారు. మరోవైపు సీసీ కెమెరాలకు సైతం ఈ సిస్టమ్‌ను అనుసంధానం కాబోతోంది. ఈ ఎమర్జెన్సీ కాల్ బాక్స్‌లు అందుబాటులోకి వస్తే అత్యవసర సమయాల్లో క్షణాల్లో సమస్యను పరిష్కరించే వీలుంది.

## మహాత్ముల అడుగుజాడల్లో నడుద్దాం

### భరత మాత మహా హారతి కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశభక్తిని అణువణువునా గుండెల్లో నింపుకుని, దేశం కోసం శ్రమించి, బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుంచి భారతావనికి విముక్తి కలిగి ంచి భరత మాత బిడ్డలుగా ఖ్యాతి గడించిన నాటి మహాత్ముల అడుగుజాడల్లో నడ వాల్సిన అవసరం ఉందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. భారత గణతంత్ర దినోత్సవాల సందరర్భాన్ని పురస్కరించుకుని నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో భరతమాత ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, కన్వీనర్ రావుల శ్రీధర్‌ల అధ్యక్షతన నిర్వహించిన భరత మాత మహాహారతి కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హరతి కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యా ర్థులను ఉద్దేశించి ప్రవ చించారు. నా బొజ్జపొట్టకు శ్రీరామరక్ష అన్న చందంగా వ్యవహ రించరాదని, అందరం కలిసి ముందుకు సాగితేనే దేశాభివృద్ధి పురోగమి స్తుందన్నారు. బాబూ రాజేంద్రప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని ఆయన సోదా హరణంగా వివరించారు. మహాత్మాగాంధీ 1915వ సంవత్సరం నుంచి కొల్లాయిగుడ్డ ధరించి స్వాతం త్ర్యం కోసం పాటుపడ్డారని, అదే కొల్లాయిగుడ్డతోనే ప్రాణం విడిచారన్నారు. నిబ ద్ధత, కమిట్‌మెంట్ అన్న పదానికి నిలువుటద్దంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవ నం ఉందన్నారు. సర్దార్ భగత్‌సింగ్‌ను ఉరి తీసిన తర్వాత ఆమె తల్లికి కొంత పరిహారం ఇవ్వజూపిన నేప థ్యంలో ఆ కన్నతల్లి తాను తీసుకోకుండా మిగతావారికి అంద జేసిందన్నారు. అబ్దుల్ కలాం చివరి క్షణం వరకూ విద్యార్థుల్లో జ్ఞాన ప్రకాశానికి పాటుపడ్డారని తెలిపారు. భరత మాత మహాహారతి కార్యక్రమంలో భరత మాతకు సప్తహారతిని కేవలం ఒక చోట మాత్రమే కాకుండా దేశమంతటా వివిధ ప్రాంతాల్లో నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.

# నేతల్లో యాగం సెంటిమెంట్
# కేబినెట్ విస్తరణ?

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారాలు జరుగుతున్నాయి. ఖమ్మం,రంగారెడ్డి జిల్లాలకు తొలివిడత క్యాబినెట్‌లో చోటుదక్కే అవకాశాలు లేవన్న ప్రచారం టీఆర్ఎస్ వర్గాల్లో ఉంది. ఇక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు, మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇద్దరికీ తొలివిడత క్యాబినెట్‌లో చోటు లభిస్తుందా.. లేదా అన్న ఆసక్తి నెలకొంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్‌నేత, మాజీమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డిని స్పీకర్‌గా నియమించడంతో ఆ జిల్లానుండి వేముల ప్రశాంత్‌రెడ్డికి దాదాపు లైన్‌క్లియర్ అయినట్లేనన్న చర్చ సాగుతోంది. కరీంనగర్ నుండి కొప్పుల ఈశ్వర్ పేరు ఈసారి బలంగా వినిపిస్తోంది. ఇక వరంగల్ నుండి పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు కలను ఈసారి కేసీఆర్ నెరవేర్చడం ఖాయమేనన్న చర్చ సాగుతోంది. చీఫ్‌విప్‌లు, విప్‌లను కూడా సీఎం ఖరారు చేసే అవకాశం ఉంది. ఈసారి పదవులకు నేతల ఎంపికలో కొన్ని అనూహ్య నిర్ణయాలు, కేసీఆర్ మార్కు సంచలనాలు కూడా ఉంటాయన్న చర్చ సాగుతోంది.

**ఉమ్మడిజిల్లాల వారీగా ప్రచారంలో ఉన్న ఆశావహులు**

- **వరంగల్:** కడియం శ్రీహరి, దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్
- **కరీంనగర్:** కేటీఆర్, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్
- **ఆదిలాబాద్:** ఇంద్రకరణ్‌రెడ్డి, బాల్కసుమన్, జోగురామన్న, రేఖానాయక్, కోనేరుకోనప్ప,
- **నిజామాబాద్:** వేముల ప్రశాంత్‌రెడ్డి
- **మెదక్:** హరీష్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి,
- **మహబూబ్‌నగర్:** లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, నరేందర్‌రెడ్డి
- **రంగారెడ్డి:** గాంధీ, కేపీవివేక్,
- **హైదరాబాద్:** నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, పద్మారావు, దానం నాగేందర్
- **నల్లగొండ:** జగదీష్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, గొంగడిసునిత
- **ఖమ్మం:** పల్లా రాజేశ్వరరెడ్డి, పువ్వాడ అజయ్

# దేవుడి పేరుతోనే మాన్యం రికార్డులు

(మొదటిపేజీ తరువాయి)

దేవుడి పేరుతోపాటు సదరు ఆలయం పేరును రాయాలని రెవెన్యూ శాఖ యోచిస్తోంది. పహాణీ, సర్వే రికార్డులలో ఆయా భూముల వివరాలను చేర్చి పకడ్బందీగా రికార్డుల నమోదుకు శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వం విజయవంతంగా పూర్తిచేసిన భూ రికార్డుల ప్రక్షాళనలో వెలుగులోకి వచ్చిన దేవుడి మాన్యాలను ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు.

**12వేల ఆలయాలు.. 84వేల ఎకరాలు...**

రాష్ట్రంలోని 12 వేల దేవాలయాలకు దాదాపు 84,195 ఎకరాల భూములున్నాయని రికార్డుల ప్రక్షాళనలో వెల్లడైంది. కానీ వీటిపై యాజమాన్య హక్కులు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో దేవాదాయ శాఖ పేరుమీద లేవు. మరోవైపు కాస్రా పహాణీ, కబ్జా కాలంలో ఇతరులు పేర్లు వస్తుండటంతో న్యాయపరమైన వివాదాలు పెరిగాయి. ఈ మాన్యాలను కౌలుకు తీసుకున్న వాళ్లు, పొరుగు భూ యజమానులు యధేచ్చగా ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో గత కొన్నేళ్లుగా దేవాదాయ శాఖ భూ వివాదాలు కోర్టుల్లో పేరుకుపోయాయి. రెవెన్యూ రికార్డుల్లో లెక్కలు లేకపోవడం, దేవాదాయ శాఖ వద్ద ధ్రువీకరణ పత్రాలు కనిపించకపోవడం వంటి కారణాలు ఆక్రమణదారులకు వరంగా మారాయి. రాష్ట్రంలోని అనేక ప్రధాన దేవాలయాలు మొదలు కొని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ ఆలయానికి భూములున్నాయి. భద్రాద్రి సీతారామ చంద్ర ఆలయానికి 1347 ఎకరాల మాన్యం భూములున్నాయని రికార్డులు చెబుతున్నాయి. కాగా ఇందులో 1149 ఎకరాలు పొజిషన్‌లో మాత్రం లేవు. ఈ ఆలయానికి మెదక్ జిల్లాలో కూడా విలువైన ప్రాంతంలోని భూములు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయని సమాచారం. కొమిరెల్లి మల్లన్న స్వామికి 40 ఎకరాలుండగా తాజాగా ప్రభుత్వం మరో 166ఎకరాలను దేవాలయానికి జమ చేసింది. యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి 10ప్రాంతాల్లో 212 ఎకరాలుండగా, వేములవాడ రాజరా జేశ్వరీస్వామి దేవాలయానికి 34 ఎకరాల విలువైన భూములున్నాయి. పురాతన కాలంనుంచే ధూపదీప నైవేద్యాలు, నిత్య పూజలకు గానూ భూములను కేటాయించారు. అయితే ఇప్పుడవి కనిపించకుండా పోవడంతో దేవాదాయ శాఖకు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన వరంగా మారింది.

**కౌలు పేరుతో...**

కౌలు పేరుతో, పొరుగు భూమితో మరికొందరు ఆక్రమణదారులు దేవుడి భూములకు ఎసరు పెట్టారు. ఎటువంటి కఠిన చర్యలు లేకపోవడంతో యధేచ్చగా దేవాదాయ శాఖ భూములను కైంకర్యం చేస్తున్న వైనం ఉమ్మడి రాష్ట్రంలో జోరుగా కొనసాగింది. మం డల, జిల్లా కేంద్రాలకు తోడు రాష్ట్ర రాజధానిలోనూ దేవుడి భూముల ఆక్రమణల పరంపర కొనసా గించారు. తాజాగా సర్వేలోనే సుమారు 14,500 ఎకరాల దేవుడి భూములు పరాధీనం అయినట్లుగా తేలింది. గత 15ఏళ్లుగా జరుగుతున్న అక్రమ భూ లావాదేవీల విలువ లక్షల కోట్లలో ఉన్నట్లుగా అంచనా. నల్గొండ జిల్లాలో 3,225 ఎకరాల దేవాదా య శాఖ భూములతోపాటు, హైదరాబాద్‌లో 2వేల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 1,800 ఎకరాల దేవా దాయ భూములు పరాధీనం అయినట్లుగా తేలింది. రెవెన్యూ రికార్డుల్లో వీటి వివరాలు లేకపోవడంతో అవి నిషేధిత జాబితాలో కనిపించడంలేదు. పహాణీ, సర్వే రికార్డులలో ఈ జాబితాకాని, భూముల వివరాలు కానీ నమోదు కాని ఫలితంగానే అక్రమార్కులకు వరంగా మారిందని అధికారులు అంటున్నారు.

# ఆర్థిక నేరగాళ్ల కోసం వేట

(మొదటిపేజీ తరువాయి)

సెయింట్స్ కిట్స్ పౌరసత్వం పొందగా, చోక్సి ఇటీవల ఆంటిగ్వా, బార్బుడా పౌరసత్వం తీసుకున్నాడు. ఈ దీవులు 132 దేశాలకు వీసా రహిత ప్రయాణ సౌకర్యాన్ని అనుమతిస్తున్నాయి. పెట్టుబడిదారులకు పౌరసత్వం ఇచ్చే విధానం ఇక్కడ అమలవుతోంది. దీంతో వేర్వేరు దేశాల్లోని ఆర్థిక నేరగాళ్లు సురక్షిత స్థావరంగా ఈ దీవులను ఎంచుకుంటున్నారు. సీబీఐ, ఈడీ చేపట్టిన ఈ మిషన్‌లో చోక్సి,నీరవ్ మోడీ ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ మోడీ ఏ దీవుల్లో ఉన్నదీ స్పష్టంగా తెలీడం లేదు. ఆయా దీవులను బట్టి లక్ష డాలర్ల నుంచి రెండు లక్షల డాలర్లకే అక్కడి ప్రభుత్వాలు పౌరసత్వం ఇస్తున్నాయి.




# హమ్మయ్య... పట్టాదార్ పుస్తకాలిచ్చారు!

- వృద్ధ దంపతుల భిక్షాటనతో అధికారుల బేజార్
- కలెక్టర్ ఆగ్రహం.. విచారణ
- 4 ఎకరాలకు పాస్‌బుక్కు అందజేత
- మరో 5 ఎకరాలపై తేలని వివాదం
- కలెక్టరేట్‌కు తహసీల్దార్ సరెండర్

**భూపాలపల్లి, ప్రభన్యూస్ :** లంచం ఇస్తేగానీ పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వమంటూ వేధిస్తూండటంతో ఒళ్లుమం డిన వృద్ధ దంపతులు భిక్షాటన చేసి డబ్బిచ్చేందుకు చేసిన ప్రయత్నం అవినీతి అధికారులను గంగవెర్రులెత్తించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆజంనగర్‌లో రెండేళ్లుగా వేధింపులకు గురవుతున్న వృద్ధ దంపతులు రోడ్డెక్కడంతో కలెక్టర్ స్పందించారు. అప్పటికప్పుడు ఆర్డీఓను విచారణకు పంపి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించారు. అవినీతికి పాల్పడిన తహసీల్దార్‌పై చర్య తీసుకున్నారు. అయినా ఆ వృద్ధ దంపతులకు ఇంకా సంపూర్ణ న్యాయం జరగాల్సి ఉంది. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.


భూపాలపల్లి జిల్లా ఆజంనగర్‌కు చెందిన మాంత లక్ష్మీ బసవయ్య దంపతులు పట్టాదార్ పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేశారు. వారికి చెందిన 9 ఎకరాల భూమికి సంబంధించి పాస్‌బుక్కు ఇవ్వాలంటూ ఆ దరఖాస్తులో కోరారు. దరఖాస్తు చేసి రెండేళ్లయినా ఇంతవరకు వారి పనికాలేదు. పుస్తకాలు అడిగితే భారీ ఎత్తున లంచం అడుగుతూండటంతో వారికి ఆ స్థోమత లేక అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా అధికారుల్లో మార్పు రాకపోవడంతో విసిగిపోయారు. అవినీతి అధికారులకు డబ్బివ్వాలంటూ భూపాలపల్లిలో శుక్రవారం భిక్షాటన చేపట్టారు. ఇది కాస్తా సోషల్ మీడియా, పత్రికల్లో విస్తృత ప్రచారం అయింది. దీంతో జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు రంగంలోకి దిగారు. ఆర్డీఓ వెంకటాచారిని విచారణకు పంపారు. వారికి ఇవ్వాల్సిన పట్టాదార్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకున్నారు. స్వయంగా గ్రామానికి వెళ్లిన వెంకటాచారి వృద్ధ దంపతులు మాంత లక్ష్మీబసవయ్యకు నాలుగు ఎకరాలకు సంబంధించి పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందచేశారు. అయితే మరో ఐదు ఎకరాలకు సంబంధించి పాస్‌పుస్తకం ఇవ్వాలంటూ దంపతులు కోరారు. అది ఇంకా తేలవలసి ఉంది.

**తహసీల్దార్ మధురకవి పై చర్య**

డబ్బులు ఆశించి వృద్ధ దంపతులను వేధించిన భూపాలపల్లి తహసీల్దార్ మధురకవి సత్యనారాయణను జిల్లా కలెక్టర్‌కు సరెండర్ చేసినట్లు ఆర్డీఓ వెంకటాచారి ఈ సందర్భంగా తెలిపారు. ఆజంనగర్‌కు చెందిన మాంత లక్ష్మీ బసవయ్య కుటుంబం పట్ల తహసీల్దార్ వ్యవహరించిన తీరును తప్పుపట్టిన అధికారులు ఆయనపై శాఖాపరమైన చర్యలలో భాగంగా స్థానచలనం కల్పించారు. ఆయన స్థానంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వృద్ధదంపతులు చేపట్టిన వినూత్న నిరసనకు రెవెన్యూ యంత్రాంగం దిగివచ్చి పాస్‌బుక్‌లు ఇవ్వడం సంచలనాన్ని కలిగించింది. వృద్ధులు చేసిన పోరాటాన్ని జిల్లాప్రజలు అభినందిస్తూ వారి ధైర్యాన్ని కొనియాడుతున్నారు.

# నాలుగున్నరేళ్లలో ప్రగతి ఘనం
# నవ్యాంధ్ర ముందంజ

- సంక్షోభం తర్వాత సీఎం కృషి అమోఘం
- గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో గవర్నర్ నరసింహన్ ప్రశంసలు



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర విభజన తర్వాత నెలకొన్న సంక్షోభంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని గవర్నర్ ఇఎల్ఎస్ నరసింహన్ అన్నారు. ఆయా పథకాల అమలులో సాంకేతితను జోడించి, ఉత్పాదకతను పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని మున్సిపల్ మైదానంలో జరిగిన 70వ గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో దేశం 7.3శాతం వృద్ధి సాధిస్తే, రాష్ట్రం 10.52శాతంతో ముందంజలో ఉండటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమ్నారు. సహజ వనరులను వినియోగించుకొని ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందని, అనేక కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. కియా మోటార్లు, హెచ్‌సిఎల్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రానికి రావడమే ఇందుకు నిదర్శనమ న్నారు. దేశంలో తయారయ్యే ఐదు మొబైల్ ఫోన్లల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో తయారు కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని పట్టణాలను సుందరీకరించడంతో పాటు ప్రతి గ్రామంలోను సీసీ రోడ్ల నిర్మాణం, ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి కోసం వాటర్ గ్రిడ్ పథకం తీసుకొ చ్చినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ కొరతను అధిగమించి మిగులులోకి తేవడంతో పాటు వ్యవసా యానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 75 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో వ్యవసాయ రంగంలో 11శాతం వృద్ధి రేటు సాధించడం గర్వకారణమన్నారు. రైతులకు రుణమాఫీ కింద రూ.24వేల కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్ సదుపాయం కలిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పేదలకు ఉచిత వైద్యం**

ఎన్టీఆర్ వైద్యసేవ కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి చంద్రన్న సంచార చికిత్స ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని 222 ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా సాగుతోందని చెప్పిన గవర్నర్ రియల్‌టైం గవర్నెన్స్ ద్వారా పాలనను సరళీకృతం చేశామన్నారు. నాలుగున్నరేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పుడున్న 38లక్షల విస్తీర్ణాన్ని కోటి ఎకరాలకు పెంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని, రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నట్లు గవర్నర్ తెలిపారు.

**8.66 లక్షల మందికి నైపుణ్య శిక్షణ**

ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలిపిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర నైపుణ్య శిక్షణా సంస్థ ద్వారా నాలుగున్నరేళ్లలో 8.66లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ భృతి కింద 4.3లక్షల మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకోగా 3.5లక్షల మందికి నెలకు రూ.వెయ్యి భృతి ఇస్తున్నట్లు చెప్పారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ క్రీడా వికాసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద ఇచ్చే ఫించన్లను రూ.200 నుంచి వెయ్యికి, జనవరి నుంచి రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలకు పెంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50.51 లక్షల మందికి ఫించన్ల కోసం ఏటా రూ.14వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆదరణ పథకంలో ఆధునిక పనిముట్లు ఇచ్చేందుకు రూ.964 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేశామన్నారు. ఈ మొత్తంలో 90శాతం సబ్సిడీగాను, 10శాతం లబ్దిదారుని వాటాగా ఉంటుందన్నారు. తద్వారా నాలుగు లక్షల రెండున్నర వేల మందికి లబ్ధి చేకూరనుందని అన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం


- తెలంగాణలో ఆటలకు అధిక ప్రాధాన్యత
- టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు





**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** క్రీడా పోటీలలో గెలుపోటములు సహజమని టీఎస్-ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. ఓటమిని సవాల్‌గా తీసుకుని విజయం కోసం కృషి చేయాలన్నారు. ఐఐసీ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన క్రీడల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విధి నిర్వహణలో ఎప్పుడూ తీరిక లేకుండా ఉండే ఉద్యోగులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసాన్ని పొందాలన్నారు. తమకు నచ్చిన క్రీడలను ఎంచుకుని కష్టపడి సాధనచేసి అందులో రాణించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉద్యోగాల నియామకాలలో 2 శాతం రిజర్వేషన్లు సీఎం కేసీఆర్ కల్పించారని బాలమల్లు వివరించారు. విశ్రాంతి లేకుండా విధులు నిర్వర్తిస్తున్న టీఎస్ ఐఐసీ ఉద్యోగులు మానసిక ఉల్లాసాన్ని పొందేలా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలను ఎల్‌బీస్టేడియంలో భారీ ఎత్తున నిర్వహించి విజయవంతం చేసినందుకు అధికారులను, ఉద్యోగులను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ సీఎండి ఈవీ నరసింహారెడ్డి, సీఈవో మధుసూదన్, ఎండీ జి.వెంకటనర్సింహారెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో దీక్ష

- రాష్ట్ర హక్కుల సాధన కోసం కేంద్రంపై ఏపీ సీఎం సమరశంఖం
- పార్లమెంట్ సమావేశాల చివరిరోజున దీక్షకు సంకల్పం
- జాతీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం
- తెలుగుదేశం ఎంపీల సమావేశంలో నిర్ణయం



**ఆంధ్రప్రభ , అమరావతి:** ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి కేంద్రంపై సమరభేరి మోగించేందుకు సన్నద్ధమవుతున్నారు. విభజన అంశాల అమలు, ప్రత్యేక హోదా, తదితర అంశాల్లో కేంద్రం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని దేశప్రజలందరికి తెలిసేలా దేశ రాజధాని ఢిల్లీలో ఒక రోజు దీక్షకు దిగనున్నారు. ఈ మేరకు శనివారం ఉండవల్లిలో జరిగిన తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సమావేశంలో ఆయన ఎంపీలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్ వేదికగా ఏపీ ప్రజల మనోభావాలను దేశవ్యాప్తంగా తెలియజేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరి ఇప్పటికే ఎంపీలు ఎండగట్టే విధంగా దిశానిర్దేశం చేస్తున్న ఆయన స్వయంగా నిరసన దీక్షకు చేపట్టనుండటంతో జాతీయ రాజకీయాలల్లో చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ సమావేశాల చివరి రోజున ఈ దీక్షాస్త్రాన్ని సంధించాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఇప్పటికే కేంద్రం నవ్యాంధ్రకు ఇచ్చిన చట్టబద్ధమైన హామీలను నెరవేర్చడం లేదని ధర్మపోరాట దీక్షలు చేస్తున్న ఆయన గత ఏడాది ఏప్రిల్‌లో విజయవాడలోని ఇందిగాంధీ స్టేడియంలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 12 గంటల పాటు నిరసనదీక్ష చేశారు. ముఖ్యమంత్రి దీక్షకు సంఘీభావంగా అన్ని జిల్లా కేంద్రాలలో సైతం దీక్షలు జరిగాయి. దీనికి కొనసాగింపుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీ వెళ్లి పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంలో కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన అన్యాయాన్ని వారికి వివరించి మద్దతు కోరారు. కొన్ని పార్టీల నేతలు ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాలలో సైతం ఏపీకి జరిగిన అన్యాయం తెలుగుదేశం పార్టీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా మాట్లాడారు. అనంతరం జాతీయ రాజకీయాలలో కీలక భూమిక పోషించే దిశగా అడుగులు వేస్తూ 23 పార్టీలను ఒకే తాటిపైకి తీసుకువచ్చారు. ఇప్పటికే ఢిల్లీ, కోల్‌కత్తాలలో ఎన్‌డిఎకు వ్యతిరేకంగా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి తన సత్తా చాటారు. ఇది ఇలా ఉంటే ఇవి చిట్టచివరి పార్లమెంట్ సమావేశాలు కావడంతో ఈ సమావేశాలలో రాష్ట్ర సమస్యలు అధికార ఎన్‌డిఎ పరిష్కరించకపోతే నిరసన దీక్షను చేపట్టాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం జరిగినా ఎంపిలతో తన మనోభావాలను పంచుకోవడంతో పాటు వారి అభిప్రాయాలను ఈ అంశంపై తెలుసుకున్నారు. ఎంపి సుజనా చౌదరితో పాటు, కింజరపు రామ్మోహన్‌నాయుడుతో పాటు మరికొందరు ఎంపీలు ఈ దీక్షకు జాతీయ స్థాయి పార్టీలు, నేతల కూడా మద్దతు ప్రకటించే అవకాశాలు మెండుగా ఉన్నాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ అంశంపై ఇంక పూర్తి స్థాయిలో పార్టీ వర్గాలు, ముఖ్యనేతలతో చర్చించి ఒక నిర్ణయానికి వద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినట్లుగా సమాచారం. సీఎం దీక్షచేపట్టిన రోజు సంఘీభావంగా రాష్ట్రమంతటా పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి దీక్షకు మద్దతుగా ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. దీక్ష ద్వారా ఒకే సారి రాష్ట్రమంతా ఎన్నికల వాతావరణం తీసుకురావడంతో పాటు, రాష్ట్రహక్కుల కోసం పోరాడుతున్న పార్టీగా ప్రజల్లో గుర్తింపు వచ్చేలా వ్యూహరచన చేస్తున్నారు.



# పురుష దళానికి తొలి మహిళా కమాండర్‌గా భావన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** భారత ఆర్మీలోని పురుషదళానికి కమాండర్‌గా భావన కస్తూరి నేతృత్వం వహించారు. ఓ పురుషదళానికి కమాండర్‌గా నేతృత్వం వహించిన తొలి మహిళా కమాండర్‌గా భావన చరిత్ర సృష్టించింది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో భావన కస్తూరి నేతృత్వంలోని పురుషదళం ప్రదర్శన ఇచ్చింది. సైనిక దళాల సైన్యాధిపతి ముందు 144 మంది జవాన్ల దళంతో పురుష దళానికి నేతృత్వం వహించిం ది. ప్రస్తుతం ఆమె ఆర్మీలో లాజిస్టిక్ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన భావనకస్తూరి రెండున్నరేళ్ల క్రితం సైన్యంలో చేరింది. అంచెలం చెలుగా ఎదిగి పురుష దళానికి నేతృత్వం వహించారు. తొమ్మిదేళ్ల క్రితం నేషనల్ కెడెట్ కార్ప్స్ టీమ్‌లో భాగంగా రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్నారు.

# అమెరికా షట్‌డౌన్‌కు తెర!

● వ్యయాల బిల్లుపై ట్రంప్ సంతకం ● ఇది తాత్కాలికమే ● వివాదం ముగిసినట్టు కాదు ● అవసరమైతే ఎమర్జెన్సీ : ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా చరిత్రలోనే సుదీర్ఘంగా కొనసాగుతున్న 35రోజుల ప్రభుత్వ షట్‌డౌన్‌కు ఎట్టకేలకు తెరపడింది. అమెరికాలో దాదాపు 8లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలు లేక పడుతున్న అవస్థలకు ట్రంప్ తాత్కాలికంగా విరామం ఇచ్చారు. ప్రభుత్వ కార్యకలాపాలను ప్రారంభించనున్నామని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఫిబ్రవరి 15వరకు మూడు వారాలపాటు తాత్కాలికంగా ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

ప్రభుత్వ పునరుద్ధరణకు అవసరమైన వ్యయాల బిల్లుపై శుక్రవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. అమెరికా ప్రతినిధుల సభ, సెనెట్‌లో బిల్లు ఆమోదం పొంది అనంతరం ట్రంప్ వద్దకు చేరింది. దీనిపై ట్రంప్ సంతకం చేయటంతో షట్‌డౌన్‌కు తాత్కాలికంగా తెరపడింది. కాగా అమెరికా సరిహద్దులో గోడనిర్మాణానికి అవసర మయ్యే నిధుల మంజూరుపై చర్చించేందుకు మూడు వారాలుపాటు ప్రభుత్వాన్ని తాత్కాలికంగా షట్ డౌన్‌కు విరామం ఇచ్చారు. దీంతో ఫిబ్రవరి15 వరకు ప్రభుత్వకార్యకలాపాలు కొనసాగనున్నాయి. అమెరికా-మెక్సికో సరిహద్దులో భారీ గోడను నిర్మించాలని ట్రంప్ మొదటినుంచి పట్టుదలగా ఉండగా ఆయన నిర్ణయాన్ని విపక్ష డెమొక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ట్రంప్ పాక్షికంగా ప్రభుత్వ మూసివేతకు నిర్ణయంతీసుకున్నారు.

షట్‌డౌన్ నుంచి గట్టెక్కేందుకు గురువారం ప్రవేశపెట్టిన బిల్లును సైతం సెనెట్ తిరస్కరించింది. ఈ క్రమంలో అధికార రిపబ్లికన్లు తాజాగా గోడ నిర్మాణ ప్రతిపాదన బిల్లును మరోసారి ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో బిల్లుపై ట్రంప్ సంతకం పెట్టడంతో షట్‌డౌన్‌కు తాత్కాలికంగా తెరపడింది. ట్రంప్ బిల్లుపై సంతకం చేశారని వైట్‌హౌస్ స్పష్టం చేసింది.

**అవసరమైతే అత్యవసర పరిస్థితి**

షట్‌డౌన్ తాత్కాలికంగా ముగిసినంత మాత్రాన వివాదం ముగిసినట్టు కాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. రోజ్ గార్డెన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విరామం తాత్కాలికమే అన్నారు. సరిహద్దులో గోడ నిర్మాణంపై రిపబ్లికన్లు, డెమోక్రాట్లు గడువులోగా ఒప్పందానికి రాకపోతే మళ్లీ ప్రభుత్వం మూసేసేందుకు సిద్ధంగా ఉన్నా అన్నారు. అవసరమైతే దేశంలో అత్యవసర పరిస్థితి విధించి మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి అవసరమైన 5.7 బిలియన్ల డాలర్లను మంజూరు చేస్తాను అని తెలిపారు. గోడ నిర్మాణానికి ఇంతకుమించి తన దగ్గర అవకాశం లేదన్నారు.



# హెచ్-1 బీ ప్రీమియం ప్రాసెసింగ్ పునరుద్ధరణ

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ పునరుద్ధరించాలని అమెరికా నిర్ణయం తీసుకుంది. 2019 ఆర్థికసంవత్సరానికి సంబంధించి హెచ్-1బీ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను జనవరి 28 నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న వీసా దరఖాస్తులను పరిశీలించేందుకు గతంలో అమెరికా హెచ్-1బీ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ నిలిపివేసిన విషయం విదితమే. అన్ని కోటాల్లో నూ వీసా దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్ పునరుద్ధరించనున్నట్లు తెలిపింది. మాస్టర్స్ కోటాలో ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తులతో పాటు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ) అందిన వారు తమ స్పందనను కూడా జతచేసి దరఖాస్తు చేసుకోవాలని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. అయితే ఈ ప్రీమియం ప్రాసెసింగ్ ద్వారా కంపెనీలు, దరఖాస్తుదారులు వేసిన పిటిషన్లను వేగంగా పరిశీలించడానికి వీలవుతుంది. 15 రోజుల్లో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. ఇందుకోసం అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీసా జారీ చేయడానికి ఉపయోగపడదు. అమెరికా ఏటా 85 వేల హెచ్-1బీ వీసాలను ఇస్తున్నది. దీంతో అక్కడి కంపెనీలు ఈ వీసా ద్వారా విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. హెచ్-1బీ వీసాలు పొందే వారిలో అత్యధికంగా భారతీయులే ఉంటారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి హెచ్-1బీ వీసా విధానంలో మార్పులు తీసుకురావాలని, నిబంధనలు కఠినతరం చేసి ప్రతిభావంతులకే అవకాశం ఇవ్వాలని అంటున్నారు. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చాక హెచ్-1బీ ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపివేశారు. తాజాగా ఇప్పుడు మళ్లీ వాటిని పునరుద్ధరించారు.



## అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో గౌతం ఖైతాన్ అరెస్ట్

**న్యూఢిల్లీ:** అగస్టావెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కేసులో నిందితుడైన న్యాయవాది గౌతమ్ ఖైతాన్‌ను ఈడీ అరెస్టు చేసింది. నల్లధనం కలిగివుండడం, మనీల్యాం డరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజాగా మరో కేసు నమోదు చేసింది. మనీల్యాం డరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి అరెస్టు చేశామన్నారు. కోర్టులో ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. నల్లధనం, పన్ను విధింపు చట్టం 2015లోని సెక్షన్ 51 ప్రకారం ఆదాయపు పన్నుశాఖ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసు ఆధారంగా మనీల్యాండరింగ్ చట్టం ప్రకారం గౌతం ఖైతాన్‌పై ఈడీ ఈ కేసు నమోదు చేసింది. విదేశాల్లో అక్రమంగా బ్యాంకు అకౌంట్లు నిర్వహిస్తూ నల్లధనాన్ని కలిగివున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఈడీ అధికా రులు పేర్కొన్నారు.రూ. 3,600 కోట్ల విలువైన అగస్టావెస్ట్‌ల్యాండ్ ఒప్పందం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిచెల్‌ను దుబాయ్ నుంచి రప్పించిన దర్యాప్తు సంస్థలు విచారించాయి. క్రిస్టియన్ విచారణ అనంతరం గౌతమ్ ఖైతాన్‌ను అరెస్ట్‌చేశారు.

## ఏపీ భవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తున్న ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేశ రాజధానిలో గణతంత్ర వేడుకలు జరిగే రాజ్‌పథ్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఏపీ భవన్లో రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు, దేశ ప్రగతికి యువతరం ప్రతిన పూనాలని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రగతిలో ఏపీ భవన్ పాత్ర గురించి వివరించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

**గణతంత్ర జానపదం**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భవన్ లోని డా. బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించేశాయి. తొలుత కుమారి వైష్ణవి బృందం వందే మాతరం గీతంతో ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్ర మాల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన పీవీఎస్వీ కుమార్ బృందం ప్రదర్శించిన గరగలు జానపద నృత్య రూపకం, డా. పసుమర్తి విఠల్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, కుమారి వైష్ణవి స్నిగ్ధ మరియు సాయి శ్రీయ ప్రదర్శించిన ఏరువాకా సాగరో జానపద నృత్యం, ఆదిలీల ఫౌండేషన్ బృందం వందేమాతరం గీతంపై ప్రదర్శించిన కోలాటం, పీవీ రమణ బృందం ఆలపించిన గీతాలు, దేశభక్తి గేయాలు అలరించాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆశ్రిత భావన అన్నమయ్య కీర్తనపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం మంత్రముగ్ధుల్ని చేసింది.

# తెలుగు చాయ్‌వాలాకు పద్మశ్రీ

• సేవాభావానికి పురస్కారం • పేదలకు ఉచిత విద్యనందిస్తున్న ప్రకాశ్ రావు



**కటక్:** సేవాభావం ఉండాలే గానీ.. అవార్డులు, పురస్కారాలు వాటంతటే అవే వస్తారని మరోసారి రుజువైంది. సంపాదనే లక్ష్యంగా కాకుండా సేవే పరమావధిగా పనిచేసిన తెలుగోడి వ్యక్తిత్వానికి పద్మశ్రీ అవార్డు లభించడమే ఇందుకు నిదర్శనం. ఒడిశాలోని కటక్ లో టీ కొట్టు నడుపుతూ ..నలుగురికి సాయ పడుతున్న ప్రకాశరావు.. తానుండే బక్సిబజార్ పిల్లల జీవి తాల్లో వెలుగులు నింపుతున్నారు. ఫలితం ఆశించక .. పేదలకు ఆసరాగా నిలుస్తున్న ప్రకాష్‌రావు సేవాభావాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ శ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది.

**ఎవరీ ప్రకాశరావు ?**

ప్రకాశరావు ముత్తాత పేరు దేవర పల్లి అప్పాలస్వామి. ఆయన ఉపాధి కోసం 1888 లో వలసబాటపట్టారు. అప్పాల స్వామి మంచి వంటకాడు కావడంతో బ్రిటిష్ వాళ్ల దగ్గర కొలువు కుదిరాడు.దేశ సంచారం చేసి చివరకు ఒడిశాలోని కటక్ సమీపంలో తెలంగపెంటలో స్థిరపడ్డారు.. అప్పాల స్వామి కుమారుడు కృష్ణమూర్తి రెండో ప్రపంచ యుద్ధం సమయంలో సైన్యంలో పనిచేశాడు.. 1960లో కృష్ణమూర్తి టీ స్టాల్ తెరిచి.. బస్తీ వాసుల్లో మంచి వాడిలో పేరు తెచ్చుకున్నాడు. తండ్రికి టీబీ సోకి మంచం పట్టడంతో ప్రకాశ్ రావు చదువు మానేసి టీస్టాల్ బాధ్యత తీసుకున్నారు. డాక్టర్ కావాలన్న తన సంకల్పం నెరవేరకపోవడంతో తన బస్తీలోని పేద పిల్లలకు చదువుచెప్పించాలని నిర్ణయించుకున్నాడు. బస్తీ పిల్లలంతా స్కూల్‌కు వెళ్లకుండా చిరు తిరుగుళ్లు చూసిన ప్రకాశ్‌రావు తన రెండుగదుల ఇంట్లోని ఓ గదిని స్కూలుగా మార్చేసి చదువు చెప్పడం మొదలుపెట్టాడు. మొదట్లో పిల్లల తల్లిదండ్రులు తనను తిట్టినా పట్టించుకోలేదు. మాపిల్లలకు పాచిపనికి వెళ్లి నాలుగు రూకలు తెచ్చే వాళ్లు. నువ్వు బడిపెట్టాక, వీళ్లు పనిమానేస్తున్నారని దబాయించినా వారికి నచ్చజెప్పారు. ప్రస్తుతం ఆస్కూల్‌లో 70 మంది విద్యార్థులు, అయిదుగురు టీచర్లున్నారు. టీచర్ కు నెలకు రూ. 1500 .. ఉచిత భోజనం పెడుతున్నారు.నాటి నుంచి సంపాదనలో సగం పిల్లల విద్య కోసం ఖర్చు చేస్తున్నారు. మురికివాడ లాంటి ఈ బస్తీ ఇటీవలే వార్తలోకెక్కింది. జాతీయ, అంతర్జాతీయ విలేకరులు, సీనియర్ ప్రభుత్వాధికారులు, అంతర్జాతీయ ఎన్జీవోల ప్రతినిధులు బస్తీకొచ్చి చాయ్ వాలా గురించి అడగటం మొదలుపెట్టారు.



**చచ్చిబతికి.. నలుగురికి చేయూత**

ప్రకాశ్ రావు చచ్చిబతికినవాడు. ఆపరేషన్ సమయంలో అనామకుడు చేసిన రక్తదానంతో బతికి బయటపడ్డాడు. తనలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదని..40 ఏళ్ల నుంచి చావుబతుకుల్లో ఉన్నవాళ్లకి రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటివరకు ప్రకాశ్ రావు 210 సార్లు రక్తదానం, 17 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేశాడు. ఇప్పటికీ పేద రోగులకు వేడి నీళ్లు,పాలు, బ్రెడ్ ఉచితంగా అందిస్తుంటాడు. ప్రకాశ్ రావు సేవా భావం చూసి ఓవ్యక్తి గీజర్ కొనివ్వగా.. మరొకరెవర్ అంబులెన్స్ ఇచ్చారు. ఉదయం ఛాయ్‌వాలాగా.. మధ్యాహ్నం టీచర్‌గా.. సాయంత్రం ఆస్పత్రి పర్యవేక్షకుడి అవతారం ఎత్తుతాడు ప్రకాష్‌రావు. 59 ఏళ్ల వయస్సులోనూ ఇంత ఓపిక ఏంటని అడిగితే..తన కుటుంబమే తన బలమని చెబుతున్నాడు. తన ఇద్దరు కూతుళ్లు చదువులో రాణించి స్థిరపడ్డారని చెప్పారు. బిసెంట్ సెల్స్ లెస్ సర్వీస్ అవార్డు-2016కు కూడా ప్రకాశ్‌రావు ఎంపిక కావడం విశేషం..

# ఒంటరి పోరుకి ప్రియాంకే ధైర్యమా?

• ఏపీ, బెంగాల్‌లో పొత్తులు లేవు
• కాంగ్రెస్‌ను వీడిపోయిన అగ్రనేతలు
• యూపీలో వదిలేసిన ఎస్పీ, బీఎస్పీ
• దక్షిణాదిన ప్రియాంక ఆకర్షణ ఎంత?



**న్యూఢిల్లీ:** ప్రియాంకగాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంతో కాంగ్రెస్‌లో కొత్త ఊపు వచ్చినట్లుంది. దేశవ్యాప్తంగా మహాకూటమికి తెలుగుదేశం పార్టీతో పొత్తుపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ తాజాగా ప్రియాంక ఎంట్రీతో తన వ్యూహాలను మార్చినట్లు కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరి పోరాటానికి దిగాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. అదే విధంగా బెంగాల్ లోనూ ఏ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేయనుంది. బీజేపీని ఓడించడానికి విపక్షాల ఐక్యత కోసం విపరీతంగా కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తాజాగా తన వ్యూహాలను మార్చేసింది. ఆంధ్రప్రదేశ్, బెంగాల్‌లో తన శక్తిని ప్రదర్శించుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు భేటీ అయిన మరుసటి రోజే ఏపీలో కాంగ్రెస్ పార్టీ సొంతంగా పోటీకి దిగాలని అధికారికంగా నిర్ణయించుకోవడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 25 పార్లమెంటరీ స్థానాల్లో, 175 అసెంబ్లీస్థానాల్లో ఒంటరిగా పోటీకి కాంగ్రెస్ సిద్ధపడింది. ఈ విషయాన్ని ఏపీ కాంగ్రెస్ ఇంచార్జీ, కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ ప్రకటించారు. ఇక కాంగ్రెస్ పార్టీకి తెలంగాణాలో తెలుగుదేశం పార్టీ ఒక మోయరాని భారంగా తయారైనట్లు ఆ పార్టీ నేతలు బలంగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి తెలంగాణా ఏర్పడిన తరువాత తెలుగుదేశం పార్టీ అంటే ప్రజానీకంలో విపరీతంగా ఉన్న ఆగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ పరిగణనలోకి తీసుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ముగిసిన తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రెండే స్థానాలకు పరిమితం కావడం, కాంగ్రెస్ పార్టీ యథాప్రకారం ప్రతిపక్షంలో కూచోవాల్సి రావడంపై రాహుల్ టీమ్ తీవ్రంగా అధ్యయనం చేస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకొని తప్పు చేసినట్లు కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇక వైఎస్సార్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పాదయాత్ర చేసి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన సత్తా చాటడానికి సిద్ధపడుతున్నారు. ఇక రాష్ట్ర విభజన తరువాత జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటు సంపాదించుకోలేకపోయింది. పోటీ చేసిన ప్రతి స్థానంలో డిపాజిట్ కూడా కోల్పోవడం ఆ పార్టీ దయనీయ స్థితికి అద్దం పడుతోంది. అయితే ఇప్పుడు పరిస్తితి మెరుగు పడిందని, జగన్ పార్టీకి తామే ప్రత్యామ్నాయంగా ఉన్నామని, తెలుగు దేశం వ్యతిరేక ఓట్లను చీలిస్తే అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

**బెంగాల్‌లోనూ ఒంటరి పోరేనా?**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీతో పొత్తు పెట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ సుముఖంగా లేదు. కోల్‌కొత్తాలో జరిగిన విపక్ష ర్యాలీకి రాహుల్‌గాంధీ కాంగ్రెస్ తరుపున సందేశం పంపినప్పటికీ, ఆ భారీ బహిరంగ సభకి తన తరుపున లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేతగా ఉన్న మల్లిఖార్జున ఖర్గేని, అభిషేక్ మను సింగ్వీని పంపినప్పటికీ, దేశవ్యాప్తంగా మహాఘటనబంధన్‌లో మమతా దీదీ భాగస్వామ్యాన్ని బలంగా కోరినప్పటికీ, బెంగాల్‌లో మాత్రం పొత్తుపై కాంగ్రెస్ విముఖంగా ఉంది. కాంగ్రెస్‌తో పొత్తు అంటే తృణమూల్ పార్టీకి కూడా భారమే. అవుతుంది. నిజానికి పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీలో ఉద్దండ నేతలంతా ఇప్పటికే తృణమూల్ పార్టీలో చేరిపోవడంతో అక్కడ హస్తం పార్టీకి పెద్దగా బలమూ, బలగమూ లేకుండా పోయాయి. బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ పార్టీకి పెద్దగా లాభించే స్థితి లేదు. సరిగ్గా ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కూడా కనిపిస్తుంది. 2014 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లోని దిగ్గజాలు టీడీపీలోకో, వైఎస్సార్ పార్టీలోకి మారిపోయారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో దీనావస్థ స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రియాంక గాంధీ వాద్రా రాక ఎలా మార్పు తీసుకొస్తుంది? ఈ రాష్ట్రాల్లో ఎలా పుంజుకుంటుంది?? వంటి ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. యూపీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడానికి ఎస్పీ, బీఎస్పీ సిద్ధం లేని పరిస్థితి. ఢిల్లీలో కూడా ఆమ్‌ఆద్మీ పార్టీతో పొత్తు గురించి అంతగా ఆశావహ సంకేతాలను షీలా దీక్షిత్ వ్యక్తం చేయడం లేదు. కాంగ్రెస్‌తో పొత్తు ఉండదన్న విషయాన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా కొట్టివేయడం లేదు. ఇక మహ రాష్ట్రలో శరద్ పవార్ ఎన్సీపీతో, కేరళలో యూడీఎఫ్‌తో, తమిళ నాడులో డీఎమ్‌కేతో, కర్నాటకలో జనతాదళ్‌తో, బీహార్‌లో ఆర్జేడీతో, జార్ఖండ్‌లో జేఎమ్ఎమ్‌తో పొత్తు పెట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది.

# పద్మ అవార్డులకు 50 వేల నామినేషన్లు

•112 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం




**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మకమైన పద్మ పురస్కారాల కోసం ఈసారి ఏకంగా 50 వేల నామినేషన్లు దాఖలయ్యాయి. వేలాది నామినేషన్లను జల్లెడపట్టి ప్రభుత్వం 112 మందిని పురస్కారాలకు ఎంపిక చేసింది. సమాజం లోని అన్ని వర్గాలు, అన్ని విభాగాల నుంచి విజేతలను ఎంచుకున్నట్లు ఓ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. ప్రజల కోసం నిస్వార్థ సేవ చేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చారని, ఈసారి పురస్కారాలు ప్రజా పురస్కారాలని తెలిపారు. ప్రతీ నామినేషన్‌ను మెరిట్ ఆధారంగా ఎన్నిక చేశారని, పలు రౌండ్లు వాటిని నాణ్యంగా పరిశీలించి, నిపుణులను సంప్రదించి పురస్కా రాల కోసం విజేతలను ఎంపిక చేశా రని, ఇది ఎంపికైన వారి జాబితా ద్వారానే తెలు స్తోందని ప్రభుత్వ అధికారి వెల్లడిం చారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈసారి పద్మ పురస్కారాలకు 9 రాష్ట్రాల నుంచి 14 మంది వైద్యులను, 9 మంది క్రీడా కారులను, 9 మంది రచయితలను, 28 కళాకారులను, జర్నలిస్టులను ఎంపిక చేసినట్లు తెలిపారు. దేశంలోని అత్యు త్తమ పౌర పురస్కారమైన భారరత్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జనసంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్, గాయకుడు భూపేన్ హజారికాలకు దక్కింది.

## పద్మశ్రీని తిరస్కరించిన గీతా మెహతా



**న్యూఢిల్లీ:** ప్రముఖ రచయిత, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి గీతా మెహతా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డును తిరస్క రించారు. త్వర లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేప థ్యంలో గీతా మెహతా ఈ అవార్డును తిరస్కరించినట్లు సమా చారం. ఈ సమ యంలో తాను ఆ అవార్డును తీసుకోవడం సముచితం కాదని, అందువల్లనే తాను తీరస్క రిస్తున్నట్లు ఆమె తెలిపారు. తాజాగా గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన జాబితాలో గీతా మెహతా పేరు కూడా ఉన్న విషయం విదితమే. అయితే, గీతా మెహతా ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉంటున్నారు. భారత ప్రభుత్వం తనను పద్మశ్రీ అవార్డుకు తగిన వ్యక్తిగా భావించి పురస్కారం ఇచ్చినందుకు చాలా గౌరవంగా భావిస్తున్నానని, కానీ త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తాను ఈ అవారడ్‌ను తిరస్క రించాల్సి వస్తున్నందుకు చింతిస్తున్నానన్నారు. ఈ సమయంలో తాను అవార్డు తీసుకుంటే అది ప్రభుత్వానికీ, తనకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అది తనను ఇంకా బాధిస్తుందని మెహతా ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలోని ఎంపీ సీట్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రంలో ఇటు బీజేపీకి, బిజు జనతా దళ్(బీజేడీ)కు గట్టి పోటీ ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గీతా మెహతా అవార్డును కాదనుకున్నారని సమాచారం.

# ప్రభుత్వం మాదే

• గోవా కాంగ్రెస్ చీఫ్ జోస్యం



**పనాజీ:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఉపఎన్నిక తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని గోవా కాంగ్రెస్ చీఫ్ గిరిష్ చొదంకర్ వ్యాఖ్యానించారు. ఐదుగురు బీజేపీ ఎమ్యెల్యేలతో కాంగ్రెస్ పార్టీ చర్చిస్తోందన్నారు. షిరోదా, మంద్రెం స్థానాలకు ఉపఎన్నిక తర్వాత ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మనోహర్ పారికర్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న సంకీర్ణప్రభుత్వానికి ఐదుగురు ఎమ్మెల్యేలు మద్ధతు ఉపసంహరించుకున్న తర్వాత ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతో టచ్ ఉన్న ఎమ్మెల్యేల పేర్లు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. ఆ ఎమ్యెల్యకు తమపై విశ్వాసం ఉందని, త్వరలోనే వివరాలను తెలుసుకుంటారని గిరిష్ చొదంకర్ బదులిచ్చారు. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్యెల్యేలు బీజేపీలో చేరేందుకు రాజీనామా చేశారు. ఈ రెండు స్థానాలకు త్వరలో ఉపఎన్నిక జరగనుంది. ఇంకా నోటిఫికేషన్ కూడా వెలువడకముందే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ నాయకులు గతేడాది కూడా వ్యాఖ్యలు చేశారు. గోవా అసెంబ్లీలో 12 సీట్లతో కాంగ్రెస్ ప్రతిపక్షపాత్ర పోషిస్తోంది. గోవా అసెంబ్లీకి 2017 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాయి. అతిపెద్ద పార్టీ కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించలేదు. బీజేపీ, మహారాష్ట్రవాది గొమంతక్ పార్టీ(ఎంజీపీ)ల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెలిసిందే.



# బ్రెజిల్‌లో కూలిన డ్యాం

## 10 మంది మృతి.. 300 మంది గల్లంతు

**బ్రుమడిన్హో:** బ్రెజిల్‌లోని బెలో హారిజాంటే ప్రాంతంలో డ్యాం కూలిపోవటంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 300మంది గల్లంతయ్యారు. వీరి కోసం రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. తొలుత ఏడు మృతదేహాల రికవరీ చేశామని అనంతరం మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమవటంతో చనిపోయిన వారి సంఖ్య తొమ్మిదికి పెరిగిందని అధికారులు తెలిపారు. సుమారు 300 మంది పైగా గల్లంత య్యారని వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. గల్లంతైనవారిలో 150 మంది డ్యాం సమీపంలోని కార్యాలయాల్లో పనిచేస్తున్నారని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. మైనింగ్ వల్లనే డ్యాం కొట్టుకుపోయిందని బ్రెజిల్ అధికారులు తెలిపారు. ఎగువప్రాంతం నుంచి కొట్టుకువచ్చిన ఇనుపఖనిజంతో కూడిన బూడిద ధాటికి డ్యాం కూలిపోయింది. దీంతో పలు ఇళ్లు, వాహనాలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. బ్రెజిల్ సైన్యం, అధికారులు హెలికాప్టర్ల సాయంతో సహాయ కార్యక్రమాలు చేపట్టారన్నారు.

ఈ దుర్ఘటనపై మినాస్ గెరైస్ గవర్నర్ రోమియో జెమా విలేఖరులతో మాట్లా డుతూ కూలిపోయిన సమ యంలో వాలే గనిలో 427మంది పనిచేస్తున్నారని వీరిలో 279మంది ప్రాణాలతో బయటపడ్డారని మిగిలినవారిని గల్లంతైన జాబితాలో నమోదు చేశామని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్ రైతులకు రూ.207 కోట్ల సాగు పన్ను రద్దు

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో 207 కోట్ల రూపాయల సాగు పన్ను రద్దు చేస్తున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ శనివారం ప్రకటించారు. సాగు పన్ను రద్దు వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 15లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని బాఘేల్ తెలిపారు. రిపబ్లిక్ డే ఉత్సవాలు సందర్భంగా ఆయన రాజధాని రాయ్‌పూర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేందుకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా గత నెలలోనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేవిధంగా సీఎం బాఘేల్ రైతుల స్వల్పకాలిక రుణాలు రూ.6,230 కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసేందుకు నిర్ణయించారు. అదేవిధంగా వరికి కనీస మద్దతు ధర రూ.2,500 పెంచుతున్నామని సీఎం బాఘేల్ తెలిపారు. గత పదిహేనేళ్ల నుంచి అక్టోబర్ 2018వరకు పెండింగ్‌లో ఉన్న సాగుపన్ను రూ.207 కోట్ల రూపాయల పన్ను రద్దు చేస్తున్నామని దీనివల్ల 15లక్షల మంది రైతులకు ఊరట లభిస్తుందని బాఘేల్ అన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోవటం వల్ల వారితోపాటు గ్రామాలు కూడా అభివృద్ధి చెందటం లేదన్నారు. ఈ పరిస్థితి మార్చేందుకు మంత్రిమండలి మొదటి సమావేశంలోనే రూ.6,230కోట్లు రుణాలు రద్దుచేశామని దీనివల్ల సుమారు 16.65లక్షల రైతులు రుణవిముక్తులయ్యారని తెలిపారు.



గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాజ్‌పథ్‌లో తమిళనాడు శకటం ప్రదర్శన



భారత్-పాక్ సరిహద్దులోని వాఘా వద్ద బీటింగ్ రిట్రీట్ సందర్భంగా బీఎస్ఎఫ్ జవాన్లతో బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అసోం రైఫిల్స్ మహిళా దళం కవాతు...

# ఘనంగా గణతంత్ర పండుగ

- రాజ్‌పథ్‌లో అట్టహాసంగా వేడుకలు
- రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ హాజరు
- అతిథిగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్
- ప్రత్యేకంగా నిలిచిన నారీ శక్తి
- ఆకట్టుకున్న రాష్ట్రాల శకటాలు
- చల్లని వాతావరణంలోనూ భారీగా హాజరైన పౌరులు
- భారీ భద్రత నడుమ వేడుకలు

**న్యూఢిల్లీ:** త్రివిధ దళాల విన్యాసాలు.. నారీ శక్తి ప్రతిభా పాటవాలు.. విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు.. ప్రత్యేక విదేశీ అతిథి.. త్రివర్ణ జెండాల రెపరెపలతో ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో 70వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అద్భుతంగా జరిగాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతేక అతిథి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోస, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరయ్యారు. వేడుకల ప్రారంభానికి ముందు అమర్ జవాన్ జ్యోతి వద్ద ప్రధాని నరేంద్ర మోదీ పుష్పాంజలి ఘటించారు. భారత ఆర్మీకి చెందిన 90 ఏళ్లపైడిన నలుగురు మాజీలు అధికారులు కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కవాతు నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. మహాత్మాగాంధీ 150వ జయంతి, అహింస మార్గం లో స్వాతంత్ర్య సమరంలో పోరాడిన ప్రఖ్యాత నాయకుల ఇతివృత్తంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక శకటాలను వేడుకల్లో ప్రదర్శించారు. సిక్కిం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, త్రిపుర, గోవా, అండమాన్, నికోబార్ ద్వీపాలు, ఉత్తరాఖండ్‌కు సంబంధించిన శకుటాలను ప్రదర్శించారు. భారీ భద్రత మధ్య చల్లని వాతావరణంలో వేడుకలు జరిగాయి. 25000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. భారత ఆర్మీ శక్తిసామర్థ్యాలను ఈ వేడుకల్లో ప్రదర్శించారు. విమానాలను కూల్చివేసే ఫిరంగులు, షార్ప్‌షూటర్లతో వేడుకకు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత ఆర్మీకి చెందిన టీ-90 యుద్ధ ట్యాంకు, బాల్‌వే మిషన్ పికెట్ (బీఎంపీ), ఉపరితలంపై పేలుడు పదార్థాలను గుర్తించే వ్యవస్థ 155 ఎంఎం52 కాలిబర్ ట్రాక్‌డ్ సెల్ఫ్ ప్రొపెల్డ్ గన్(కే-9 వజ్రా), ట్రాన్స్‌పోర్టబుల్ శాటిలైట్ టెర్మినల్, ట్రూప్ లెవల్ రాడార్, ఆకాశ్ వెపన్ సిస్టమ్, అమెరికా నుంచి ఇటీవలే కొనుగోలు చేసిన ఎం777 అమెరికన్ అల్ట్రా లైట్ హావిట్జర్లు, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన కే9 వజ్రాను కూడా ప్రదర్శించారు. సిక్కు పదాతి దళం, జమ్మూ-కశ్మీర్ పదాతి దళం, గోర్ఖా దళం, ఆర్మీ సేవ అధికారులు, ఆర్మీ సహాయక అధికారులు(నార్త్), కేంద్రపాలిత ఆర్మీ బెటాలియన్, పారామిలిటరీ బలగాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పరేడ్‌లో పాల్గొన్నాయి. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను అందుకున్న 26 మంది బాలలు కూడా పరేడ్‌లో పాల్గొన్నారు. చల్లని వాతావరణాన్ని కూడా లెక్కచేయకుండా భారీ సంఖ్యలో పౌరులు వేడుకలకు హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోస గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథిగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోస హాజరయ్యారు. రాష్ట్రపతి రామ్‌నాథ్, ప్రధాని మోడీ, ఇతర అతిథులతో కలిసి ఆయన వేడుకలను తిలకించారు. 1995 గణతంత్ర వేడుకల్లో నెల్సన్ మండేలా పాల్గొన్న తర్వాత దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా హాజరైన రెండవ వ్యక్తి సిరిల్ రామఫోస కావడం విశేషం.

**ప్రత్యేక ఆకర్షణగా నారీ శక్తి..**

ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో నారీశక్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అస్సాం రైఫిల్స్‌కు చెందిన 144 మంది మహిళ దళ పరేడ్‌కు మేజర్ ఖుస్బూ కన్వర్ నాయకత్వం వహిం చారు. ఆర్మీ పురుష దళాలకు నేతృత్వం వహించిన తొలిమహిళగా లెఫ్టినెంట్ భావన కస్తూరీ చరిత్ర సృష్టించారు. ఆర్మీకి చెందిన మోటారు సైకిలు డేర్‌డేవిల్ బృందంలో ఓ మహిళా అధికారి కూడా పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. నావీ, ఆర్మీ దళాలు, సిగ్నల్ యూనిట్ దళాలకు మహిళా అధికారులే నేతృత్వం వహించారు. అతిథులు, పౌరులు ఆశ్చర్యపోయాలే మహిళ అధికారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.



### కట్టుదిట్టమైన భద్రత

ఉగ్రకుట్రను భగ్నం చేసి జైషే మొహ్మద్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకోవడంతో గణతంత్ర వేడుకల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంచెలు భద్రతను ఏర్పాటు చేశారు. విమాన విధ్వంసక ఫిరంగులు, ప్రత్యేక ఆయుధ మరియు వ్యూహాత్మక (ఎస్‌డబ్ల్యూఏటీ) మహిళా కమాండోలు, స్నైపర్లతో భారీ భద్రత కల్పించారు. ఇతర ప్రత్యేక దళాలను కూడా మోహరించారు. 25000 మంది పోలీసు సిబ్బంది, సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నైజింగ్ సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌జీ కమాండోలు ఉన్న పరాక్రమం వ్యాన్లు పెట్రోలింగ్ నిర్వహించా యి. మూడు వేల మంది ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించారు.

### ట్విట్టర్‌లో శుభాకాంక్షలు..

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోదీతోపాటు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అమెరికాలో ఉన్న కేంద్రమంత్రి అరుణ జైట్లీ, మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, మంత్రులు పీయూష్ గోయల్, మేనకా గాంధీ, స్మృతి ఇరానీ, ప్రకాశ్ జవదేకర్, జేపీ నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు వెల్లడించారు.

### ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు..

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దేశప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో శాంతి, సౌభాగ్యం, ఆర్థికాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ సహకారాన్ని అందించాలని కోరారు. ప్రపంచమంతా ఒకటే కుటుంబమని తెలుసుకోవాలని హితబోధ చేశారు.

### భద్రతను పక్కనబెట్టి.. జనం చెంతకు మోడీ

గణతంత్ర వేడుకల ముగింపు సమయాన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనదైన శైలిలో ప్రజలకు అభినందలు తెలిపారు. భద్రత వలయాన్ని దాటుకుని పరేడ్ మైదానంలోని ప్రజల వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. భద్రత అధికారులు వెన్నంటిరాగా, చీఫ్ గెస్ట్ ద.ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ తదితరులను అభినందిస్తూ మోడీ ముందుకు కదిలారు. సంప్రదాయ కుర్తా, పైజామా, పసుపు-ఎరుపు రంగు తలపాగాతో కూడిన వస్త్రధారణతో తమవద్దకు వచ్చిన ప్రధానిని దగ్గరగా చూసేందుకు ప్రజలు బారికేడ్ల వద్దకు చేరుకున్నారు. మోడీ మోడీ నినాదాలు చేశారు. మరికొందరు ఈ అపురూప ఘట్టాన్ని సెల్ ఫోన్లలో చిత్రీకరించేదుకు పోటీపడ్డారు. సెక్యూరిటీ వలయా న్ని దాటుకుని జనం వద్దకు రావడం మోడీకిది కొత్తేమీ కాదు. గతే డాది పంద్రాగస్టు ప్రసంగం తర్వాత వేడుకలో పాల్గొన్న పాఠశాల విద్యార్థుల వద్దకు నడుచు కుంటూ వెళ్లి కరచాలనం చేశారు. విదేశీ పర్యటన సందర్భాల్లోనూ కొన్ని సార్లు మోడీ ఇలాగే వ్యవహరించారు.

### నేపాల్‌కు భారత్ కానుక

నేపాల్‌లోని ఖఠ్మాండ్‌లో భారత ఎంబసీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 30 అంబులెన్సులు, 6 బస్సులను నేపాల్‌కు భారత్ కానుకగా ఇచ్చింది. నేపాల్‌లోని భారత రాయబారి మంజీవ్ సింగ్ పూరి వాహనాల తళాలను నేపాల్ అధికారుల చేతికిచ్చారు. 1994 నుంచి ఇప్పటివరకు 722 అంబులెన్సులు, 142 బస్సులను నేపాల్‌కు భారత్ కానుకగా ఇచ్చింది. నేపాల్‌లో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి భారత్ కృషి చేస్తోన్న సంగతి తెలిసిందే.



లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీ భార్యకు ఆశోక చక్ర అవార్డును అందజేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

# నజీర్ వనీకి అశోకచక్ర ప్రదానం..

ఉగ్రవాది నుంచి సైనికుడిగా మారి దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరుడు లాన్స్ నాయక్ నజీర్ వనీ భార్యకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అశోకచక్ర అవార్డును ప్రదానం చేశారు. గతేడాది నవంబర్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య కాల్పుల్లో లాన్స్ నాయక్ నజీర్ వనీ ప్రాణాలు కోల్పోయారు. ఆయన సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే.



లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

# కేంద్రానికి కృతజ్ఞతలు

- చేసింది గోరంత... దేశం ఇచ్చింది కొండంత
- రాజ్యాంగ పరిరక్షణ ప్రతి భారత పౌరుడి బాధ్యత
- భారతరత్న అవార్డుకు ప్రణబ్ స్పందన

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగంలోని మౌలిక విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నారు. తనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రణబ్.. మన రాజ్యాంగం కల్పించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి వాటి పరిరక్షణకు ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. సీఆర్పీఎఫ్ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రణబ్ ముఖర్జీ.. మన రాజ్యాంగంలోని ఆదర్శాలకు అనుగుణంగా జీవించాలన్న అంశాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. భారత రత్నకు తనను ఎంపిక చేయడంపై స్పందిస్తూ.. తన ప్రజా జీవితంలో దేశానికి తాను చేసిన సేవ కంటే.. ప్రజల నుంచేఎంతో పొందానని చెప్పుకొచ్చారు. దేశం అందించిన ఈ గౌరవాన్ని వినయంతో స్వీకరిస్తానని తెలిపారు. దేశ పౌరులకిచ్చే అత్యున్నత పురస్కారం తనను వరించడంపై హర్షం వ్యక్తంచేశారు. 70 ఏళ్ల ప్రయాణంలో దేశం ఎన్నో మైలురాళ్లను అధిగమించిందన్న ప్రణబ్... రాజ్యాంగంలోని వైవిధ్యం, బహుళత్వాలను ఆచరిస్తానన్నారు. ఎన్నో భాషలు, విభిన్న జీవన విధానాలున్నావాటన్నిం టినీ భారత్ సమ్మిళితం చేస్తుందని చెప్పారు.




### ప్రణబ్‌కు గవర్నర్, తెలంగాణ సీఎం అభినందనలు

భారతరత్న అవార్డుగ్రహీత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## 4న కుంభమేళాకు ప్రియాంక అదే రోజు రాజకీయాల్లోకి

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్, ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ హిందుత్వానికి చేరువగా వెళ్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రియాంక గాంధీ సైతం అదేబాటలో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వచ్చేనెల 4వ తేదీన మౌని అమావాశ్య, రెండవ శనిస్నాన్‌ను పురస్కరించుకుని పవిత్ర గంగానదిలో కుంభమేళా స్నానం ఆచరిస్తారు. అదేరోజు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల స్వీకరణతో, తన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ఆమె కుంభమేళాకు చేరుకుంటారు. ఒకవేళ ఫిబ్రవరి 4 షెడ్యూల్ వాయిదా పడితే, 10వ తేదీన బసంత్ పంచమి రోజున కుంభమేళాలో పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. గంగా, యమున, సరస్వతి సంగమానికి అన్నాచెల్లెళ్లి ద్దరు చేరుకోవడం ఇదే తొలిసారి. 2001లో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ కుంభమేళాలో పవిత్రస్నానం ఆచరించారు. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గుళ్లు.. గోపురాలు సందర్శించడం బీజేపీలో గుబులు పుట్టించింది. 20 ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బీజేపీ విమర్శలను తిప్పికొడుతూ, రాహుల్‌ను నిజమైన జన్యుధారిగా కాంగ్రెస్ ప్రస్తావించింది. రాజస్థాన్ ఆలయంలో పూజ సందర్భంలో రాహుల్ తనది దత్తాత్రేయ గోత్రమని.. ఆ తర్వాత కౌల్ బ్రాహ్మిన్ గా చెప్పుకున్నారు. ప్రియాంక కూడా హిందూ వాదానికి సమీపంగా వెళ్లాలని భావిస్తుండటం విశేషం.





లడక్‌లో 18 వేల అడుగుల ఎత్తైన పర్వతాలలో మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రత.. మరోవైపు హిమపాతం మధ్య జాతీయ పతాకం రెపరెపలు

# ఖాళీ మైదానంలో అసోం గవర్నర్ ప్రసంగం



పౌరసత్వ బిల్లు వ్యతిరేక ఆందోళనలు మిజోరంలో గణతంత్ర వేడుకలపై ప్రభావం చూపాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు దూరంగా ఉండాలని ఎన్‌జీవో కోఆర్డినేషన్ కమిటీ పిలుపునిచ్చింది. దీంతో గణతంత్ర వేడుకలకు పౌరులు హాజరుకాలేదు. కొద్దిమంతి అధికారులు, ప్రజాప్రతినిధులు మినహా వేడుకలకు ఎవరూ హాజరు కాలేదు. దీంతో దాదాపు ఖాళీగా ఉన్న మైదానంలో రాష్ట్ర గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్ ప్రసంగించాల్సి వచ్చింది. ఖాళీగా ఉన్న మైదానంలోనే దళాలు పరేడ్‌ను నిర్వహించాయి.

# ఏంటీ సంగతి!

**న్యూఢిల్లీ:** గతేడాది గణతంత్ర వేడుకల్లో సీటు కేటాయింపు వివాదం నేపథ్యంలో, ఈసారి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి మొదటి వరుసలో సీటు కేటాయించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పక్కనే ఆసీనులై కనిపించారు. మొదటి వరుసలో కూర్చున్న వీరిద్దరు చాలాసేపు చిరునవ్వుతో, మాట్లాడుకుంటూ కనిపించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ రెండవ వరుసలో, రాహుల్ వెనుకవైపు కూర్చున్నారు. రాహుల్‌కి కుడివైపు ముగ్గురి తర్వాత బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కూర్చున్నారు. కొద్దిరోజుల కిందట నెహ్రూ, ఇందిరలను గడ్కరీ ప్రశంసించారు. నెహ్రూ ప్రసంగాలంటే తాను చెవులు కోసుకుంటానన్న కేంద్రమంత్రి, ఇందిరా గాంధీని మహిళా సాధికారతకు నిదర్శనమని కీర్తించారు. మరాఠా రిజర్వేషన్ల సమయంలోనూ ఉద్యోగాలెక్కడున్నాయన్న గడ్కరీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ మద్దతిచ్చింది. కేంద్రమంత్రి నిజం మాట్లాడారని ప్రశంసించింది. ఈ నేపథ్యంలో ఈ రోజు వీరిద్దరు స్నేహపూర్వకంగా మాట్లాడుకోవడం ఆసక్తి కరంగా మారింది. గతేడాది వీరిద్దరికి ఆరవ వరుసలో సీటు కేటాయించడం వివాదాస్పదమైంది. 2017 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ పట్టాభిషిక్తుడయ్యారు. మరుసటి యేడాది గణతంత్ర వేడుకల్లో ఆయన్ను అవమానించేలా సీట్ల కేటాయింపు జరపడాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. సంప్రదాయాలకు విరుద్ధంగా, బీజేపీ కుటిల రాజకీయాలకు తెరలేపిందంటూ కాంగ్రెస్ ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం దేశ ప్రజలకు రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు తెలిపిన రాహు, ఈ రోజును రాజ్యాంగం పుట్టినరోజని గుర్తుచేశారు. వేడుకలను ఘనంగా జరుపుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణను ప్రతిఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ట్వీట్‌చేశారు. ఇతర కాంగ్రెస్ ముఖ్యనేతలు కూడా దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ అభినందనలు తెలుపుతూ ట్వీట్లు చేశారు.



# ప్రసంగం చదవడంలో విఫలమైన మంత్రి..



మధ్యప్రదేశ్ రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఇమర్తి దేవీ గణతంత్ర ప్రసంగం చదవడంలో విఫలమయ్యారు. చదవడం ప్రారంభిం చిన వెంటన తడబడ్డారు. చదవలేక పోయారు. పక్కనే ఉన్న కలెక్టర్‌ను ప్రసంగాన్ని చదవమని కోరారు. దీంతో కలెక్టర్ భరత్ యాదవ్ ప్రసంగాన్ని చదవారు. ఉన్నతవిద్యను అభ్యసించిన మంత్రి ఇమర్తి దేవీ డిసెంబర్ 25న మధ్యప్రదేశ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2013, 2018లలో ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# క్రీడాప్రభ

## ఆస్ట్రేలియా ఓపెన్ విజేత
# ఒసాకా ది గ్రేట్

- ఫైనల్లో క్విటోవాపై విజయం
- వరల్డ్ నెంబర్‌వన్‌గా ఆసియా కిరణం


విజేత ఒసాకా

ఆస్ట్రేలియన్ ఓ పెన్‌లో జపాన్ స్టార్ ఒసాకా చరిత్ర సృష్టించింది. ఫైనల్లో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి పెట్రా క్విటోవాను ఓడించి తన దేశ కీర్తిని మరోసారి ప్రపంచానికి చాటింది. టైటిల్ గెలిచి తొలిసారిగా తన దేశానికి రెండో గ్రాండ్‌స్లామ్‌ను అందించింది. గత ఏడాది యూఎస్ ఓ పెన్ గ్రాండ్‌స్లామ్ సాధించిన ఒసాకా ఆస్ట్రేలియన్ ఓ పెన్ టైటిల్‌తో డబ్ల్యుటీఏ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నెంబర్ వన్‌గా వతరించి.. ఈ ఘనత సాధించిన తొలి ఆసియన్‌గా నిలిచింది.

**మెల్‌బోర్న్:** జపాన్ టెన్నిస్ స్టార్ నవోమి ఒసాకా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఒసాకా చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రా క్విటోవాను 7-6(7/2), 5-7, 6-4 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2 గంటల 27నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో అవకాశాలు వచ్చినప్పటికి ఐదు బ్రేక్ పాయింట్లను తన అనుకూలంగా మలచుకోలేకపో యింది. చివరికి సెట్ టై బ్రేకర్‌వరకు సాగి ఒసాకా వశమైంది. రెండో సెట్లో కూడా పోరు ఉత్కంఠగా సాగింది. చివరికి క్విటోవా 7-5 తేడాతో సెట్‌ను గెలుచుకుంది. కీలకమైన మూడో సెట్లో చెరొక పాయింట్‌ను పొందుతూ ముందుకు సాగారు. ఒక దశలో స్కోరు 4-4తో సమమైంది. అనంతరం ఒసాకా ర్యాలీగా సాగుతూ.. సెట్‌ను మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.


రన్నరప్ క్విటోవా

**ఒసాకా గెలుపుపై ప్రముఖ క్రీడాకారిణుల అభినందలు**

♦యూఎస్, ఆస్ట్రేలియన్ గ్రాండ్ స్లామ్‌లను వరుసగా సాధించిన ఒసాకాకు ఇది గొప్ప ముందడుగు. ఈ ఫలితాలు ఆమెను శిఖరాగ్రానికి చేర్చాయి. --1975లో డబ్ల్యుటీఏ వరల్డ్ నెంబర్ వన్‌గా నిలిచిన క్రిస్ ఎవర్ట్

♦రెండు గ్రాండ్ స్లామ్ చాంపియన్‌కు శుభాకాంక్షలు..నీకు మంచి భవిష్యత్తు ఉంది. స్థిరంగా అంకిత భావంతో కృషి చేస్తే.. నీకు మరిన్ని గ్రాండ్‌స్లామ్‌లు చేరువవుతాయి -- మాజీ దిగ్గజ క్రీడాకారిని బిల్లీ జీన్ కింగ్

♦యూఎస్ ఓపెన్ గెలిచిన తర్వాత ఒసాకా స్టార్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో వరల్డ్ నెంబర్ వన్ అయింది. ఒసాకా సూపర్ స్టార్. - మాజీ స్టార్ నవ్రతిలోవా

### వరల్డ్ నెంబర్ వన్ ఒసాకా

గత ఏడాది చివర్లో యూఎస్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన ఒసాకా ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచి వరుసగా రెండు గ్రాండ్ స్లామ్‌లు జపాన్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. అంతేకాక ఈ విజయంతో ఒసాకా వరల్డ్ నెంబర్ 1 హోదాను పొంది.. ఈ ఘనతను సాధించిన తొలి ఆసియా క్రీడాకారిణిగా రికార్డును తన పేర రాసుకుంది. మ్యాచ్ అనంతరం ఒసాకా మాట్లాడుతూ.. సిమోనా హలెప్ నుంచి వరల్డ్ నెంబర్ 1ర్యాంకును సొంతం చేసుకున్నందుకు ఉద్విగ్నంగా ఉందని పేర్కొంది. ఎప్పటినుంచో నేను నెంబర్ వన్ స్థానం పొందాలని కలగన్నాను. ఈ విజయంతో ఆ కల నెరవేరింది అని ఒసాకా చెప్పింది. 21 ఏళ్ల 104 రోజుల వయసులో ప్రపంచ నెంబర్ వన్‌గా నిలిచిన ఒసాకా అతి తక్కువ వయసులో ఈ ఘనతను సాధించిన రెండో మహిళా టెన్నిస్ స్టార్‌గా నిలిచింది. 2010లో డెన్మార్క్‌కు చెందిన కరోలినా వోజ్నియాకి 20 ఏళ్ల 92 రోజుల వయసులో ఈ ఘనత సాధించింది. చైనా ఓపెన్‌లో గత ఏడాది అక్టోబర్‌లో ఒసాకా సెమీ ఫైనల్స్‌కు చేరి టాప్ 5ర్యాంకింగ్స్‌లో చేరిన రెండో జపాన్ క్రీడాకారిణిగా నిలిచింది. 1995 నవంబర్‌లో కిమికో డేట్ వరల్డ్ నెంబర్ 4కు చేరిన తొలి జపాన్ మహిళగా నిలిచింది. 1975లో కంప్యూటర్ ద్వారా ర్యాంకింగ్స్‌లను ఇచ్చే పద్ధతిని ప్రవేశ పెట్టిన తర్వాత వరల్డ్ నెంబర్ వన్‌గా నిలిచిన తొలి ఆసియన్‌గా ఒసాకా నిలిచింది.

# రెండో వన్డే మనదే

- 90 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం
- భారత్ 324 • కివీస్ 234


రోహిత్ 87

న్యూజిలాండ్‌పై భారత్ జైత్ర యాత్ర కొనసాగుతోంది. శనివారం జరిగిన రెండో వన్డేలో కూడా కోహ్లీసేన విజయాన్ని అందుకుంది. 90పరుగుల తేడాతో గెలుపొందింది. న్యూజి లాండ్ గడ్డపై భారత్‌కిది భారీ విజయం. 2009లో హామిల్టన్‌లో జరిగిన వన్డేలో భారత్ 84 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లు కుల్దీప్‌యాదవ్, యజువేంద్ర చాహల్ మరోసారి విజృంభించి కివీస్ బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. కివీస్ 42.2 ఓవర్లలోనే 234 పరుగులకు చేతులెత్తేసింది.



**మౌంట్ మంగానూయ్:** స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్ విజృంభించడం, మరోవైపు బ్యాట్స్‌మెన్ అద్భుతంగా రాణించడంతో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ 90 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని భారత్ సాధించింది. శనివారం బే ఓవల్ మైదానంలో జరిగిన ఈ వన్డేలో భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 324 పరుగులు చేసింది. భారత జట్టులో మార్పులు జరుగలేదు. తొలి వన్డేలో ఆడిన జట్టే బరిలోకి దిగింది. ఓపెనెర్లు రోహిత్‌శర్మ 87(96బంతులు, ఫోర్లు 9 సిక్సలు 3)పరుగులు, శిఖర్ ధావన్ 66( 67బంతులు, ఫోర్లు-9) చేసి జట్టు స్కోరుకు గట్టి పునాది వేశారు. ధావన్ వన్డేల్లో 27వ అర్ధ సెంచరీని సాధించగా, రోహిత్ వన్డేల్లో తన 38వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు ఔటయిన తర్వాతకూడా పరుగుల వేగం తగ్గలేదు. కోహ్లీ 43(45బంతులు, ఫోర్లు-5), అంబటి రాయుడు 47(49బంతులు, ఫోర్లు-3 సిక్స 1) పరుగులు చేసి పెవిలియన్ చేరగా.. ధోనీ 48(33 బంతులు, ఫోర్లు-5 సిక్స-1) పరుగులతో, కేదార్ జాదవ్ 22( 10బంతులు, ఫోర్లు- 3, సిక్స -1)నాటౌట్లుగా మిగిలారు. చివరి 4.2 ఓవర్లలో ధోనీ- కేదార్‌లు కలిసి ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించారు. కివీస్ బౌలర్లలో ట్రెంట్ బోల్ట్, లాకి ఫెర్గున్‌సన్ తలో రెండు వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం న్యూజిలాండ్ లక్ష్య ఛేదనలో తడబడింది. భారత బౌలర్లకు మరోసారి తలవంచింది. 40.2 ఓవర్లలోనే 234 పరుగులకు ఆలౌటయింది. తొలి వన్డేలో 4 వికెట్లు తీసి ప్రతాపం చూపిన చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ ఈసారి కూడా రెచ్చిపోయాడు. 10 ఓవర్లలో 45 పరుగులిచ్చి 4 వికెట్లు తీయగా, మరో స్పిన్నర్ కుల్దీప్ చాహల్ 9.2 ఓవర్లలో 52పరుగులకు 2 వికెట్లు పడగొట్టి కివీస్ బ్యాటింగ్ పతనంలో కీలక భూమిక పోషించారు. కివీస్ బ్యాట్స్‌మెన్‌లో స్వల్పంగా మాత్రమే ప్రతిఘటన కన్పించింది. డోగ్ బ్రేస్‌వెల్ 57 పరుగులతో రాణించాడు. మిగతా బ్యాట్స్‌మెన్‌లో ఎవరూ కూడా 35 పరుగుల మార్కును తాకలేకపోయారు. న్యూజిలాండ్ 17వ ఓవర్లో 100 పరుగుల మార్కును తాకింది. 25 ఓవర్లు ముగిసేసరికి కివీస్ స్కోరు ఐదు వికెట్ల నష్టానికి 138. భారత బౌలర్ల ప్రతాపానికి కివీస్ బ్యాటింగ్ రన్ రేట్ నత్త నడకన సాగింది. కివీస్ తొలి వికెట్ జట్టు స్కోరు 7వద్ద పడింది. ఓపెనర్ మార్టిన్ గుప్టిల్ 15(16 బంతులు) పరుగులు చేసి భువనేశ్వర్ బౌలింగ్‌లో చాహల్‌కు క్యాచి చ్చి వెనుదిరగగా మరో ఓపెనర్ కోలిన్ మన్రో 31(41 బంతులు)చాహల్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యుగా ఔటయ్యా డు. తొలి వన్డేలో రాణిం చిన కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఈ సారి విఫల మయ్యాడు. 20(11బం తులు) పరుగులు చేసి షమీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. టామ్ లాథమ్ 34(32బం తులు), హెన్రీ నికోలస్ 28(38 బంతులు), కోలిన్ డి గ్రాందొమ్మి 3(8బం తులు), ఐష్ సోధీ(డకౌట్), వికెట్లను కుల్దీప్ పడగొట్టాడు. కొరకరాని కొయ్య గా మారుతున్న బ్రేస్‌వెల్ 57(46బంతులు)ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. రాస్ టేలర్ 22(25బంతులు) వికెట్‌ను కేదార్ జాదవ్ పడగొట్టగా, లాకి ఫెర్గున్‌సన్ 12(20బం తులు) వికెట్‌ను చాహల్ దక్కించుకున్నాడు. న్యూజిలాండ్ గడ్డపై భారత్‌కిది భారీ(90పరుగు ల తేడాతో) విజయం. 2009లో హామిల్టన్‌లో జరిగిన వన్డేలో భారత్ 84 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును రోహిత్ శర్మ దక్కించుకున్నాడు. మూడో వన్డే 31న హామిల్టన్‌లో జరుగనుంది.

**స్కోరు బోర్డు**

**న్యూజిలాండ్:** మార్టిన్ గుప్టిల్ (సి) చాహల్ (బి) భువనేశ్వర్ 15, కోలిన్ మన్రో ఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 31, కేన్ విలియమ్సన్ (బి) షమీ 20, రాస్ టేలర్ స్టంప్డ్ ధోనీ (బి) కేదార్ జాదవ్ 22, టామ్ లాథమ్ ఎల్బీడబ్ల్యు (బి) కుల్దీప్ యాదవ్ 34, హెన్రీ నికోలస్ (సి) షమీ (బి) కుల్దీప్ యాదవ్ 28, కోలిన్ డి గ్రాందొమ్మి (సి) రాయుడు (బి) కుల్దీప్ యాదవ్ 3, డాగ్ బ్రేస్‌వెల్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 57, ఐష్ సోధీ (బి) కుల్దీప్ యాదవ్, 0, లాకి ఫెర్గుసన్ (సి) విజయ్ శంకర్ (బి) చాహల్ 12, ట్రెంట్ బోల్ట్ నాటౌట్ 10 ఎక్స్‌ట్రాలు 2, **మొత్తం:** 234 ఆలౌట్ ( 40.2ఓవర్లు)

**బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 7-1-42-2, మహ్మద్ షమీ 6-0-43-1, విజయ్ శంకర్ 2-0-17-0, యజువేంద్ర చాహల్ 9.2-0-52-2, కేదార్ జాదవ్ 6-0-35-1, కుల్దీప్ యాదవ్ 10-0-45-4.

**భారత్:** రోహిత్ శర్మ (సి) గ్రాందొమ్మి (బి) ఫెర్గుసన్ 87, శిఖర్ ధావన్ (సి) లాథమ్ (బి) బోల్ట్ 66, విరాట్ కోహ్లీ (సి) ఐష్ సోదీ (బి) బోల్ట్ 43, అంబటి రాయుడు సి అండ్ బి లాకీ ఫెర్గుసన్ 47, ధోనీ నాటౌట్ 48, కేదార్ జాదవ్ 22 ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 324/4(50 ఓవర్లు),

**బౌలింగ్:** ట్రెంట్ బోల్ట్ 10-1-61-2, డాగ్ బ్రేస్‌వెల్ 10-0-59-0, లాకి ఫెర్గుసన్ 10-0-81-2, ఐష్ సోధీ 10-0-43-0, కోలిన్ డి గ్రాందొమ్మి 8-0-62-0, కోలిన్ మన్రో 2-0-17-0.




# రంజీ సెమీ ఫైనల్
# 276 పరుగుల లీడ్‌లో కర్నాటక



**బంగళూరు:** కర్నాటక, సౌరాష్ట్ర మధ్య జరుగుతున్న రంజీ రెండో సెమీ ఫైనల్లో కర్నాటక ఆటగాడు శ్రేయాస్ గోపాల్ 61 పరుగులు సాధించడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి కర్నాటక 8 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. దీనితో కర్నాటక జట్టు సౌరాష్ట్రపై 276 పరుగులు లీడ్‌ను సాధించింది. శనివారం సౌరాష్ట్రను తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులకు ఆలౌట్ చేసిన తర్వాత కర్నాటక ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్లు విఫలమైనప్పటికి.. మయాంక్ అగర్వాల్ 46 పరుగుల చేసి ఔట్ కాగా, శ్రేయాస్ 61 పరుగులు, అభిమన్యు మిథున్ 35 పరుగులు చేసి అజేయంగా ఉన్నారు. మిగతా వారెవరు చెప్పుకోదగ్గ స్కోర్లు నమోదు చేయలేదు. సౌరాష్ట్ర బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్ 3, దర్మేంద్రసింగ్ జడేజా 3, మన్‌కడ్ రెండు వికెట్లు తీశాడు. తొలి సెమీస్‌లో కేరళపై గెలిచిన విదర్భ జట్టు ఇప్పటికే ఫైనల్లోకి ప్రవేశించింది.

# సచిన్ రికార్డును అధిగమించిన నేపాల్ యువ క్రికెటర్ రోహిత్



**దుబాయ్:** నేపాల్ యువ క్రికెటర్ రోహిత్ పౌడాల్ క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 29 ఏళ్ల క్రితం నెలకొల్పిన అతి తక్కువ వయసులో అర్ధ సెంచరీ చేసిన రికార్డును అధిగమించాడు. రోహిత్ 16 ఏళ్ల 146 రోజుల వయసులో ఈ ఫీట్‌ను సాధించా డు. సచిన్ తన అర్ధ సెంచరీని 16 ఏళ్ల 213 రోజుల వయసులో 1989లో పాకిస్తాన్ తో ఆడిన వన్డేలో సాధించాడు. కాగా రోహిత్ దుబాయ్ వేదికగా జరిగిన వన్డేలో యూఏఈపై ఆడుతూ 55 బంతుల్లో 58 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో నేపాల్ ఆతిథ్య జట్టును 145 పరుగుల తేడాతో ఓడించింది. మహిళా క్రికెట్లో దక్షిణాఫ్రికా క్రీడాకారిణి జొహ్‌మరి లాగ్‌టెన్‌బర్గ్ 14 ఏళ్ల ప్రాయంలోనే టెస్ట్, వన్డే ఫార్మాట్లలో అర్ధ సెంచరీ సాధించి రికార్డు నెలకొల్పింది.

## ఇండోనేషియా మాస్టర్స్
# ఫైనల్లో సైనా

- సెమీ ఫైనల్లో బింగ్జియావోపై విజయం




**జకార్తా:** భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈ సీజన్‌లో తొలిసారిగా ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ సెమీ ఫైనల్లో సైనా చైనాకు చెందిన హి బింగ్జియావోను 18-21, 21-12, 21-18తేడాతో ఓడించింది. ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగిన సైనా, ఆరో సీడ్ బింగ్జియావోను ఓడించడా నికి చెమటోడ్చింది. ఫైనల్లో సైనా స్పెయిన్‌కు చెందిన మూడు సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ లేదా చైనాకు చెందిన చెన్ యూఫెయ్‌ను ఢీకొంటుంది. ప్రారంభ గేమ్‌లో సైనా 0-2తో వెనకబడ్డప్పటికి.. అనంతరం అద్భుతమైన షాట్లతో 5-5తో సమానమైంది. అనంతరం 11-7, 16-11తో ముందుకు సాగుతున్న దశలో బింగ్జియావో క్రాస్ కోర్ట్ షాట్లతో 18-17తో పైచేయి సాధించింది. వీడియో రెఫరల్‌తో బింగ్జియావో 18-18తో స్కోరును సమం చేసిన తర్వాత మరో మూడు పాయింట్లు పొంది తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సైనా 6-3తో ముందుకు సాగుతూ.. అద్భుతమైన షాట్లతో 14-7కు పెరిగింది. అనంతరం మరో ఐదు పాయింట్లు సాధించిన బింగ్జియావోను 21-12 తేడాతో ఓడించి రెండో గేమ్‌ను సొంతం చేసుకుంది. కీలకమైన మూడో గేమ్ నువ్వానేనా అన్నట్టు సాగింది. ప్రారంభంలో 6-3 లీడ్‌లో ఉన్న సైనా దాన్ని 9-5కు పెంచుకుంది. బింగ్జియావో పుంజుకుని స్కోరును 10-10తో సమంచేసింది. అనంతరం 13-13 వద్ద ఇరువురి స్కోర్లు మళ్లీ సమానమయ్యాయి. ఇరువురు పోటాపోటీగా ఆడినప్పటికి సైనా ఒక దశలో 17-16కు పెరిగింది. బింగ్జియావో కొట్టిన షాట్లు నెట్‌ను దాటలేకపోవడంతో సైనా ముందుకు దూసుకు పోయిం ది. చివర్లో బింగ్జియా వో తప్పి దాలు చేయడంతో సైనాకు కలిసి వచ్చింది. చివరికి సైనా 21-18తేడాతో గేమ్, మ్యాచ్‌ను గెలుపొందింది.

# పాక్‌పై దక్షిణాఫ్రికా విజయం

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికాలో పర్యటిస్తున్న పాకిస్తాన్ ఆతిథ్య దేశంతో ఆడిన మూడో వన్డేలో 13 పరుగుల తేడాతో ఓటమి చెందింది. వర్షం కారణంగా డి/ఎల్ పద్ధతిలో మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. టాస్ గెలిచిన పాక్ బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ 116 బంతులో 101 పరుగులు చేశాడు. ఇందులో ఎనిమిది ఫోర్లున్నాయి. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన దక్షిణాఫ్రికా 33 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రీజా హెండ్రెక్స్ 80 పరుగులతో, కెప్టెన్ డు ప్లెస్సిస్ 40 పరుగులతో ఆడుతూ క్రీజులో ఉన్న సమయంలో వర్షం రావడంతో ఆటను నిలిపివేసి డి/ఎల్ నిబంధనల మేరకు దక్షిణాఫ్రికా 13 పరుగుల తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా ఐదు మ్యాచుల సిరీస్‌లో 2-1తో ఆధిక్యాన్ని పొందింది. నాలుగో వన్డే నేడు జరుగునుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రీజా హెండ్రిక్స్‌కు దక్కింది.

# నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్
# జకోవిచ్ వర్సెస్ నాదల్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల ఫైనల్లో రెండు కొండలు ఢీకొనను న్నాయి. సెర్బియా స్టార్ ప్రస్తుత వరల్డ్ నెంబర్ వన్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ స్పెయిన్ బుల్ వరల్డ్ నెంబర్ 2 ఆటగాడు రఫేల్ నాదల్‌లు టైటిల్ కోసం తలపడనున్నారు. నాదల్ తన 18వ గ్రాండ్ స్లామ్ వేటలో ఉండగా, జకోవిచ్ తన 15వ గ్రాండ్ స్లామ్ వేటలో ఉన్నాడు. టాప్ స్థాయిలోని ఇద్దరు ఆటగా ళ్లు తలపడనున్న ఈ పోటీ ప్రేక్షకులను అలరిస్తాయన టంలో సందేహం లేదు.

*Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.*



# కన్ను కొట్టాక... స్వేచ్ఛ పోయింది!

## ప్రియా ప్రకాష్ వారియర్

**కంటి చూపుతో చంపేస్తా అనే వీరోచిత సంభాషణలు విని ఆనందించే ప్రేక్షకులకు కన్ను కొట్టి కట్టి పడేయటం అంటే ఏంటో చూపించింది మలయాళ యువ తార ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు అడార్ లవ్ అనే చిత్రంలోని పాటలో ఆమె కన్ను కొట్టిన చిన్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో పెను సంచలనమే సృష్టించింది. ఒక్క రాత్రిలో ప్రియా వారియర్‌ను స్టార్‌ను చేసేసింది. ఓ ప్రాంతీయ సినిమాలో నటించి సినిమా విడుదల కాకముందే దేశ వ్యాప్త గుర్తింపు పొందిన ఏకైక తార ప్రియానే అని చెప్పుకోవచ్చు. ఒక్కసారిగా వచ్చినపడిన గుర్తింపును ఈ 19 ఏళ్ల నాయిక ఎలా తీసుకుంది. తన నట ప్రయాణం ఇకపై ఎలా ఉండాలనుకుంటోంది... మొదలైన విషయాలపై ఆంధ్రప్రభ లైఫ్ తో ఆమె చెప్పిన కబుర్లు ఇవి-**

కేరళలోని త్రిసూర్ సొంతూరు. నాన్న ప్రకాష్ సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తుంటారు. అమ్మ ప్రీత గృహిణి. నాకో తమ్ముడు ఉన్నాడు పేరు ప్రసిద్ధ్. నేను విమలా కళాశాలలో బీకాం తొలి ఏడాది చదువుతున్నాను. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లడం, సాయంత్రం సంగీత తరగతులకు హాజరవడం, కాసేపు స్నేహితులతో మాట్లాడుకోవడం ఇది నా సాధారణ దినచర్య. మాది ఉమ్మడి కుటుంబం. మా తాతయ్య బామ్మలతో కలిసి ఉంటాం.

### లఘు చిత్రాలతో మొదలై...

ఊహ తెలిసినప్పటి నుంచి నటన మీద ఆసక్తి ఉండేది. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. సంగీతం నేర్చుకున్నాను. సంప్రదాయ నృత్యంలో శిక్షణ తీసుకున్నాను. మోహినీయట్టం ప్రదర్శనలు ఇచ్చాను. రెండేళ్ల కిందట మోడలింగ్ చేయడం ప్రారంభించాను. అందాల పోటీల్లో పాల్గొన్నాను. ఈ క్రమంలో మూడు లఘు చిత్రాల్లో నటించాను. ఆ మూడు లఘు చిత్రాలకు బాగా పేరొచ్చింది. ఇవన్నీ సామాజిక మాధ్యమాల్లోని నా ఖాతాలో పోస్టులు చేశాను. అవి చూసిన ఒరు అడార్ లవ్ దర్శకుడు ఒమర్ నన్ను పిలిచారు. ప్రధాన పాత్రలో నటించాలి అని అడిగారు. నేను నమ్మలేకపోయాను. నా కల నిజమైందని అనిపించింది.

### ఊహించని గుర్తింపు...

ఒరు అడార్ లవ్ సినిమా టీజర్ విడుదలైన తర్వాత పెద్ద సంచలనం అయ్యింది. అందులో నేను కన్ను కొట్టే సన్నివేశం సామాజిక మాధ్యమాల్లో లక్షల మందికి చేరింది. అలా దేశవ్యాప్తంగా ఒక్కసారిగా గుర్తింపు వచ్చింది. నేను ఊహించని గుర్తింపు ఇది. నాకంటే బాగా కన్ను కొట్టే వాళ్లున్నారు. వాళ్లకు రాని పేరు నాకొచ్చింది. నేను కన్ను కొట్టిన దృశ్యంలో అంతగా ఏం నచ్చిందో అర్థం కాలేదు. కళాశాలలో



నేనొక సెలబ్రిటీ అయిపోయాను. నా స్నేహితులంతా నన్ను తెరపై చూసి సంతోషించారు. చిత్రీకరణ జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులు సహకరించారు. ప్రతి ఒక్కరూ గుర్తించడం మొదలుపెట్టారు. సామాజిక మాధ్యమాలలో నన్ను అనుసరిస్తున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. ఒక్కసారిగా వచ్చిన ఈ పేరుతో నోట మాట రాకుండా అయిపోయాను. నా సినిమా సన్నివేశాలు చూసిన కుటుంబ సభ్యులు కూడా సంతోషించారు. నాకు చిన్నప్పటి కల సినిమాల్లోకి వెళ్లడం. నేను మరో వృత్తిని కూడా ఊహించలేను. అయితే ఇంత బాగా నటించగలను అని సినిమా చూశాకే తెలిసింది.

### నన్ను పోల్చుకునే పాత్రలోనే..

ఒరు అడార్ లవ్ చిత్రంలో నేను నటించిన పాత్రతో నన్ను నేను పోల్చుకోగలను. చిన్న కళాశాలకు చెందిన విద్యార్థిని పాత్ర అది. నాతో పాటు నటించిన రోషన్‌కు అప్పటికే పేరుంది. అతను డీ4 అనే కార్యక్రమంతో గుర్తింపు తెచ్చుకున్నాడు. అతనితో నటించేందుకు మొదట ఇబ్బంది పడ్డాను. దర్శకుడు ఒమర్ సహకారం అందించి ప్రతి సన్నివేశంలో నటింపజేశారు. ఒక కళాశాల ప్రాంగణంలో జరిగే ప్రేమ కథే ఈ సినిమా.

### కన్ను కొట్టకుండా వదలడం లేదు...

ఒరు అడార్ లవ్ చిత్రంతో వచ్చిన గుర్తింపు నాకు స్వేచ్ఛ లేకుండా చేసింది. అప్పటిదాకా కళాశాలకు బస్సులో వెళ్లి, స్నేహితులతో బయట తిరుగుతూ, సంగీత తరగతులకు వెళ్లేదాన్ని. పేరొచ్చాక అమ్మా నాన్న బయటకు పంపేందుకు బయటపడటం మొదలుపెట్టారు. కొన్నాళ్లకు మళ్లీ మాములుగానే కళాశాలకు వెళ్లాను. అయితే ఎక్కడ కనిపించినా ఫొటోలు, సెల్ఫీల కోసం జనం మూగడం మొదలైంది. కన్ను కొట్టకుండా వదిలిపెట్టేవాళ్లు కాదు. నేను చదువుకుంటున్నది మహిళా కళాశాలలో కాబట్టి నిజజీవితంలో అలా కన్నుకొట్టే సందర్భం రాలేదు. కో ఎడ్యుకేషన్ ఎలా ఉంటుందో తెలియదు. సినిమాలో నటించాక ఆ కొరత తీరింది అనిపించింది.

### పేరు తెచ్చిన వాళ్లే...

ఇవాళ నాకింత పేరొచ్చింది అంటే సామాజిక మాధ్యమాలే కారణం. నన్ను అనుసరిస్తున్న వాళ్ల కోసం ఎప్పుడూ కొత్త కొత్త ఫొటోలు పోస్టు చేస్తూనే ఉంటాను. నా రోజు వారీ జీవితంలోని విశేషాలు పంచుకుంటాను. అయితే ఇక్కడ కొందరు విమర్శలు చేసే వాళ్లూ ఉంటారు. నాయికగా అవన్నీ జీవితంలో భాగమే అనుకుంటాను. నన్ను సామాజిక మాధ్యమాల ద్వారా పైకి తీసుకొచ్చిన వాళ్లే....కేసులు నమోదయినప్పుడు అంతే కిందకు లాగారు.

### వివాదాలూ వస్తున్నాయి..

నటిగా దర్శకుడు నాకిచ్చిన పాత్రలో నటించాను. ఆ సన్నివేశాలతో ఏ మతాన్ని కించపరచాలని అనుకోలేదు. కేసులు వచ్చాయని బయట నుంచి నాకు తెలిసింది కానీ నేను వ్యక్తిగతంగా ఎలాంటి నోటీసులు అందుకోలేదు. ప్రస్తుతం నేను నటిస్తున్న శ్రీదేవి బంగ్లా చిత్రంలో శ్రీదేవి గురించి సన్నివేశాలు ఉన్నాయంటూ కొందరు కేసులు వేశారు. నా సినిమాలు వివాదాలకు కారణమవడం నాకిష్టం లేదు. అవి వివాదాస్పదం కావాలని నేను కోరుకోవడమూ లేదు.

### అల్లు అర్జున్‌తో సినిమా...

ఒరు అడార్ లవ్ సినిమా టీజర్ విడుదలయ్యాక వివిధ భాషల పరిశ్రమల నుంచి అవకాశాలు వచ్చాయి. అందులో తెలుగు భాషా చిత్రాలు కూడా ఉన్నాయి. అల్లు అర్జున్ హీరోగా ఒక చిత్రంలో అవకాశం వచ్చింది. ఆయన నాకు ఇష్టమైన నటుడు. అయితే అప్పటికి ఒరు అడార్ లవ్ సినిమాలో ఒక్క పాట మాత్రమే చిత్రీకరణ చేశారు. ఆ పాటలోని టీజర్ మాత్రమే విడుదల చేశారు. ఇంకా సినిమా చిత్రీకరణ అలాగే ఉండిపోయింది. దాంతో మరో సినిమాకు డేట్స్ ఇవ్వడం సాధ్యపడలేదు. తెలుగు సినిమా వదులుకోవాల్సి వచ్చింది.

### ఈ ముద్ర నుంచి బయటపడాలి..

వింక్ గర్ల్, నేషనల్ సెన్సేషన్ లాంటి ముద్ర నుంచి నేను బయటపడాలి. ఒక నటిగా పేరు తెచ్చుకోవాలి. సామాజిక మాధ్యమాలలో చురుకుగా ఉండటం వల్ల నా వ్యక్తిగత స్వేచ్ఛకు ఇబ్బంది లేదు. బయట మరే వార్తలు నాకు తెలియకున్నా...సినిమాల గురించి పూర్తి సమాచారం తెలుసుకుంటుంటాను. సినిమా వార్తలంటే ఆసక్తి. వార్తా పత్రికల్లో వచ్చే సినిమా వ్యాసాలు తప్పక చదువుతుంటాను. చిన్నప్పటి నుంచే ఇలా సినిమాలంటే ఆసక్తి, వాటిలో నేనూ భాగమవ్వాలనే స్ఫూర్తి కలిగాయి.

### చదువులు కొనసాగిస్తూనే...

సినిమాలతో పాటు చదువులు కొనసాగించాలని కోరుకుంటున్నాను. డిగ్రీ పూర్తి చేయాలి. మంచి సినిమాలు ఎంచుకోవాలి. ఇవే ఇప్పుడు నా ముందున్న ప్రాధాన్యతలు. నా తొలి చిత్రమే నాలుగు ప్రాంతీయ భాషల్లో ఒకేసారి విడుదలవుతోంది. ఇలా ఒకేసారి నాలుగు భాషల్లో విడుదలవుతున్న తొలి మలయాళ చిత్రమిదే. ఇంత ప్రచారం వచ్చింది కాబట్టి సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

- రమేష్ గోపిశెట్టి

---

ఎన్నికలప్పుడు అభ్యర్థులు ఓట్లకోసం పడేపాట్లు....మన ప్రజాస్వామ్య దేశంలో ఒక ప్రహసనం. ఓట్లేయండి బాబూ...అని ఇంటింటికీ తిరిగి ఓటర్లను రకరకాలుగా ఆకర్షించేపనులు చేస్తుంటారు. దేశ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ఓటుకి వెలకట్టకూడదు...కానీ ఓటుని డబ్బుతో కొంటుంటారు...మద్యం, మాంసం, చీరలు, టీవీలు వంటి వాటితో వస్తు మార్పిడి కూడా చేస్తుంటారు. గెలవాలంటే ఇవన్నీ తప్పవన్నది మన నాయకుల నమ్మకం...కానీ మునగాల సుధాకర్ రెడ్డి...మాత్రం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఎదురు ఖర్చుపెట్టి ఆయనను తమ సర్పంచిగా ఎన్నుకున్నారు నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన ప్రజలు. ఓటు అమ్ముడు పోవడానికి ప్రధాన కారణం ఎవరు...రాజకీయ నాయకులా ప్రజలా...అంటే మనం ఒక్కమాటలో సమాధానం చెప్పలేము. కానీ...నిజాయితీ కలిగిన నాయకులంటూ ఉంటే..నిలబడిన అభ్యర్థి తమకు మేలు చేస్తాడనే భరోసా ఉంటే జనం తమ ఓటుని అమ్ముకోరని, అలాంటి నాయకుని గెలుపు కోసం తామే ఎదురు ఖర్చుపెడతారని అంటున్నారు సుధాకర్ రెడ్డి. తన గెలుపే అందుకు సాక్ష్యమంటున్నారాయన. ఊరుకోసం నాయకుడు, నాయకుడికోసం ఊరు....పరస్పరం నిలబడిన తీరు...ఆ ఊరి చరిత్రలో ఒక అద్భుతమైతే....నేడు దేశ ప్రజాస్వామ్యానికి అవసరమైన ఒక మంచి మార్గాన్ని...రోడ్లే లేని మల్లపురాజుపల్లి గ్రామం చూపించిందనటంలో ఎలాంటి సందేహం లేదు..

## జయహో ... మల్లపురాజుపల్లి

# ఈ సర్పంచిని ఊరే గెలిపించింది!

- ♦ ఎన్నికల ఖర్చు భరించి నమ్మిన నాయకుణ్ణి గెలిపించుకున్న గ్రామం
- ♦ పైసా తినను...తిననివ్వను అంటున్న సర్పంచి మునగాల సుధాకర్ రెడ్డి



మల్లపురాజుపల్లి గ్రామం మూడువందల గడప ఉన్న అతి చిన్న గ్రామం. తెలుగురాష్ట్రాల్లో అభివృద్ధికి నోచుకోని ఎన్నో గ్రామాల్లో అది కూడా ఒకటి. హైదరాబాద్‌కి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం మాత్రమే 8 కిలోమీటర్ల బిటీ రోడ్డు వచ్చింది. ఇక సిసి రోడ్లయితే అసలేలేవు. ఒక స్కూలయితే ఉంది కానీ అందులో 15 నుండి 20 మంది పిల్లలు మాత్రమే ఉంటారు. మిగిలిన వారంతా మండలస్థాయి స్కూలుకి వెళ్లి చదువుకోవాల్సిందే. కనీస వైద్య సదుపాయాలకోసం ఊరుదాటాల్సిందే. పెన్షన్ తెచ్చుకోవటానికి కూడా మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. కమ్యునికేషన్ అత్యవసరం అయిన ఈ రోజుల్లో సిగ్నల్ వ్యవస్థసైతం సరిగ్గా పనిచేయదు...కనీస సౌకర్యాలు లేకుండా బతకడానికి అలవాటు పడిపోయిన చాలా గ్రామాల ప్రజల్లాగే వారూ...మా జీవితాలు ఇంతే ఎవరు వచ్చినా చేసేదేమీ లేదు కదా...అనే నైరాశ్యంలోనే ఇంతకాలం ఉన్నారు. అటువంటి సమయంలో సుధాకర్ రెడ్డి నేనున్నానంటూ ముందుకు వచ్చారు. మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుందాం...అంటూ ప్రజల్లో స్ఫూర్తిని నింపారు.

### ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...

ఎన్నికల్లో నిలబడటం, గెలవటం పూర్తిగా డబ్బుతో ముడిపడి ఉన్న ఈ రోజుల్లో ప్రజాభిమానమే పెట్టుబడిగా వారి నమ్మకమే...గెలుపు సూత్రంగా గ్రామసర్పంచ్‌గా పోటీ చేశారు. గ్రామం కోసం వచ్చే నిధులు ఒక్క పైసా కూడా వృథా కానివ్వనని, ఒక్కపైసా కూడా తినను...తిననివ్వనని... గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిజాయితీగా పనిచేస్తానని ప్రతిజ్ఞ చేసి మరీ పోటీ చేశారు సుధాకర్ రెడ్డి. గ్రామ ప్రజలు ఆయనపై నమ్మకాన్ని ఉంచారు. ఓటేస్తే ఏమిస్తారు...అని అడిగే ఈ రోజుల్లో ప్రజలే ఆయన నామినేషన్ ఖర్చు రెండువేల రూపాయలు పెట్టుకుని మరీ నిలబెట్టారు. కేవలం నాలుగువేల రూపాయిల ఖర్చుతో 90శాతం ఓట్లతో సుధాకర్ రెడ్డి గ్రామ సర్పంచ్‌గా టిఆర్‌ఎస్ పార్టీ తరపున గెలిచారు. తన ప్యానల్ నుండి పోటీ చేసిన ఎనిమిది మంది వార్డు మెంబర్లు గెలిచారు. వీరిలో ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సుధాకర్ రెడ్డి ఎన్నికయిన తీరులో నిజమైన గ్రామ చైతన్యం ఉంది. జనం ఎలాంటి ప్రలోభాలకు లొంగకపోగా ఎదురు విరాళాలు ఇచ్చారు. తమకొచ్చే పెన్షన్ నుండి 200 రూ. ఇచ్చిన వృద్ధులు, తమ స్థాయికి తగినట్టుగా పదిరూపాయలు ఇచ్చి....ఊరికి మేలుజరగాలని తపించిన పేదలు..ఇలాంటివారు ఎందరో కలిసి లక్ష రూపాయలకుపైగా తమవంతు సహాయంగా ఇచ్చారని...వారు తనలో మరింత స్ఫూర్తిని నింపారంటారు సుధాకర్ రెడ్డి.

> **తమకొచ్చే పెన్షన్ నుండి 200 రూ. ఇచ్చిన వృద్ధులు, తమ స్థాయికి తగినట్టుగా పదిరూపాయలు ఇచ్చి....ఊరికి మేలుజరగాలని తపించిన పేదలు..ఇలాంటివారు ఎందరో కలిసి లక్ష రూపాయలకుపైగా తమవంతు సహాయంగా ఇచ్చారని...వారు తనలో మరింత స్ఫూర్తిని నింపారంటారు సుధాకర్ రెడ్డి.**

గ్రామం నుండి బయట ప్రాంతాలకు వెళ్లి జీవిస్తున్నవారు సైతం వారి సొంత ఖర్చులపైన వచ్చి ఓటేసి వెళ్లారని...ఇంతగా తనని నమ్మిన గ్రామం కోసం పనిచేయడమే ఇప్పుడు తన జీవితాశమని ఆయన అన్నారు.

### మా గ్రామం దేశానికి ఆదర్శం

స్కూలు టీచరుగానే కాకుండా డిప్యుటేషన్‌పై పదేళ్లు మండల రిసోర్సు పర్సన్‌గా కూడా పనిచేయటంతో సుధాకర్ రెడ్డికి ప్రజా సమస్యలపై అవగాహన ఎక్కువగా ఉంది. జన్మభూమి, చదువు వెలుగు లాంటి కార్యక్రమాలకు స్వచ్ఛందంగా పనిచేశారు. గ్రామంలో అందరికీ తలలో నాలుకలా మెలిగారు. ఉపాధ్యాయ సంఘాల్లోనూ మండల రాష్ట్రస్థాయిలో పనిచేశారు. ఇవన్నీ కాకుండా సుధాకర్ రెడ్డి తండ్రి సైతం మల్లపు రాజు పల్లికి సర్పంచ్‌గా 23 ఏళ్లు పనిచేశారు. జనంతో కలిసి ఉండటం, ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవ చేయటం అలవాటుగా మారిపోయిన సుధాకర్ రెడ్డి... అదే బాటలో గ్రామం కోసం పనిచేయాలనుకున్నారు. అధికారం ఉంటేనే అది సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతోనే ఆయన ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికలంటే డబ్బున్నవారు ఖర్చుపెట్టి గెలిచి...తిరిగి అంతకంటే ఎక్కువ సంపాదించుకునే ప్రక్రియ కాదని...ప్రజల మనసు గెలుచుకుంటే...తమ ఊళ్లో జరిగినట్టుగా దేశమంతా జరుగుతుందనే సందేశం...అందరికీ తెలవాలని ఆయన అంటున్నారు. తమ గ్రామం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకోసం గ్రామ పంచాయితీలకు కేటాయించే నిధులు చాలవని, మరిన్ని నిధులను సేకరించే పనిలో ఉన్నానని సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎన్నారైలనే కాకుండా...తమ గ్రామం నుండి వెళ్లి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని సైతం... గ్రామ అభివృద్ధి కోసం కూడగడుతున్నారు. గ్రామ సభలు నిర్వహించడం, ప్రభుత్వ పథకాలపైన ప్రజలకు అవగాహన కల్పించడం, నిధులు దుర్వినియోగం కాకుండా అన్ని కార్యక్రమాలు పారదర్శకంగా నిర్వహించడం, వివరాలు వెల్లడించడం...లాంటివన్నీ కార్యరూపంలోకి తెస్తామని...నిజాయితీ, గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని సుధాకర్ రెడ్డి అంటున్నారు. తమకు గ్రామసభ కార్యాలయం శాంక్షన్ అయ్యిందని...ప్రజలు గ్రామ ప్రయోజనం కోసం విరాళాలుగా ఇచ్చిన మొత్తానికి మరికొంత డబ్బు సేకరించి కొత్త బిల్డింగ్ కట్టాల్సి ఉందని ఆయన తెలిపారు.

- వి.దుర్గాంబ



సంస్కృతి



తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని చిత్రకళలో నిక్షిప్తం చేస్తున్న చిత్రకారిణి అంజనీరెడ్డి. ఉమ్మడి కుటుంబంలో పుట్టి, మరో ఉమ్మడి కుటుంబంలో మెట్టి జీవితంలోని వివిధ పార్శ్వాలను అతి దగ్గరగా తిలకించి, అనుభవించి వాటిని తనలో నింపుకుని చిత్రాలుగా తర్జుమా చేస్తూ ఆమె ప్రశంసలందుకుంటున్నారు. స్త్రీ సౌందర్యాన్నే గాక సౌకుమార్యాన్ని, అంతర్లోకాలను పసిగట్టి కాన్వాస్ పైకి తీసుకొస్తున్నారు. తెలంగాణ మహిళా ప్రపంచాన్ని తన మనో నేత్రాలతోతిలకించి తైల వర్ణ చిత్రాలుగా మలుస్తున్నారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని చిత్రకళలో నిక్షిప్తం చేస్తున్న చిత్రకారిణి అంజనీరెడ్డి. ఉమ్మడి కుటుంబంలో పుట్టి, మరో ఉమ్మడి కుటుంబంలో మెట్టి జీవితంలోని వివిధ పార్శ్వాలను అతి దగ్గరగా తిలకించి, అనుభవించి వాటిని తనలో నింపుకుని చిత్రాలుగా తర్జుమా చేస్తూ ఆమె ప్రశంసలందుకుంటున్నారు. స్త్రీ సౌందర్యాన్నే గాక సౌకుమార్యాన్ని, అంతర్లోకాలను పసిగట్టి కాన్వాస్ పైకి తీసుకొస్తున్నారు. తెలంగాణ మహిళా ప్రపంచాన్ని తన మనో నేత్రాలతోతిలకించి తైల వర్ణ చిత్రాలుగా మలుస్తున్నారు.

# నీరాజనాలు అందుకున్న చిత్రకారిణి అంజనీరెడ్డి

తెలంగాణ చిత్రకళా వైభవం-31



ఇటీవల కాలంలో ఆమె తెలంగాణ సంప్రదాయమైన 'ఒడిబియ్యం' సన్నివేశాన్ని రంగుల్లో అద్దారు. అలాగే బోనాలు-బతుకమ్మ తదితర మహిళా ఉత్సవాలను ఒద్దికగా కాన్వాస్‌పైకి తెచ్చి ప్రపంచానికి చూపారు. కట్టమైసమ్మ, పోచమ్మ తదితర గ్రామదేవతల గుళ్ల వద్ద జరిగే వేడుకలను సైతం ఆమె కుంచె ప్రతిభావంతంగా చిత్రించింది. 'పచ్చీసు' ఆడే ఆడవాళ్లను అంతే అందంగా చిత్రికపట్టారు. తనకు తెలియకుండా తనలోని 'విషయాన్ని' బయటకు తీసుకొచ్చేదే చిత్రకళ...అన్నది ఆమె అభిప్రాయం. జీవిత అనుభవమే 'ఆర్ట్'గా ప్రతిఫలిస్తుందని, కళాత్మకంగా కదం తొక్కుతుందని ఆమె అంటున్నారు. చిత్రకళారంగంలో సుదీర్ఘ అనుభవం గల అంజనీరెడ్డి ప్రకారం ఆర్ట్ అనేది పూర్తిగా వైయక్తిక భావవ్యక్తీకరణ. అప్పటికప్పుడు చిత్రకారుడి మానసిక స్థితిని ప్రతిబింబింపజేసే ప్రక్రియ. జీవితంలో ఎదురయ్యే అంశాలను సున్నితంగా స్వీకరించే... అనుభవించే తత్వం చిత్రకారుడికి ఉండాలి. తపస్సులా 'సాధన' చేయాలి అప్పుడే నాణ్యమైన, నాజూకైన చిత్రం కాన్వాసుపై రూపుదిద్దుకుంటుదని అంటున్నారు. చిత్రకారుడు ప్రపంచాన్ని చూసే విధానమే అతని చిత్రాల్లో ద్యోతకమవుతుందని, అలాగే తాను చూసే దృశ్యాలు ఎంత సుందరమైనవో, అందమైనవో ప్రపంచం ముందు పెడతారని, అది ప్రకృతిలోని ఓ భాగం కావచ్చు, మానవ ఆకారం కావచ్చు, వస్తువు కావచ్చు దాన్ని మెరుగైన పద్ధతిలో ప్రదర్శించడం చిత్రకారుల కర్తవ్యమంటారు. ముఖ్యంగా మహిళా చిత్రకారులు ఎంతో వేదనను, ఆనందాలను,-సంతోషాలను, సవాళ్లను స్వీకరిస్తూ జీవితంలో ఎదురయ్యే ఇతర సమస్యలను అధిగమించి సృజన చేయడంలో ప్రత్యేకత కనిపిస్తుందని ఆమె నిశ్చితాభిప్రాయం. ఈ ప్రపంచం ఎంత అందమైనదో, సుందరమైనదో, సున్నితత్వం నిబిడీకృతమైనదో, ఆశాజనకమైనదో, స్ఫూర్తిదాయకమో రుచి చూపించేదే చిత్రకళ అని ఆమె దృఢవిశ్వాసం. చిత్రకళ గూర్చి ఏమీ తెలియని వారు సైతం చిత్రాలను చూసి ఎంత బాగున్నాయో....! అని మురిసిపోవాలని, ముగ్ధులవ్వాలని ఆమె కోరుకుంటారు. అలాంటి 'కళ' పెరగాలని ఆకాంక్షిసున్నారు.



దేశకాల పరిస్థితులకనుగుణంగా చిత్రకళ తన రూపం మార్చుకుంటోందని, పాశ్చాత్యదేశాల్లో 'రినైజాన్స్' అలాగే ఉబికివచ్చిందని, తొలిరోజుల చిత్రకళలో మత విశ్వాసం ఎక్కువగా కనిపిస్తోందని అనంతరం రియలిజం, సర్రియ లిజం (అధివాస్తవికత) రొమాంటిసిజం, ఇంప్రెషనిజం, క్యూబిజం అబ్‌స్ట్రాక్ట్ పాలిజం...ఇట్లా అనేక ధోరణులు పుట్టు కొచ్చినా అంతిమంగా దేశకాలపరిస్థితులకే ప్రాధాన్యముంటుంది. పరిస్థితులకు స్పందించడంలో చిత్రకారుడు ఎంత మేర పరిణత చెందాడో ఆయన/ఆమె గీసిన చిత్రం చెబుతుందంటారామె. వర్తమాన కాలంలో ఇన్‌స్టాలేషన్ ఆర్ట్, వీడియో ఆర్ట్, బాడీ ఆర్ట్, డిజిటల్ ఆర్ట్, డాన్స్ ఆర్ట్, ఇలా పలు రకాల మాధ్యమాల ద్వారా సృజనను చిత్రకారులు వ్యక్తపరుస్తున్నారని, వీటిలో ప్రాథమిక అంశాలైన రంగుల స్పృహ (కలర్ సెన్స్) జీవిత అధ్యయనం తదితర అంశాలుంటున్నాయని ఆమె అంటున్నారు.

ఏ చిత్రకారుడైనా తాదాత్మ్యం (ట్రాన్స్)లో గీస్తే ఆ చిత్రం



పండుతుందన్నది ఆమె మరో నిశ్చితాభిప్రాయం. తాదాత్మ్యంలో పనిచేస్తూ పోతే అదే ఓ ఆకారం...ఆకృతి తీసుకుని పరిణతి చెందిన పెయింటింగ్‌గా ఉబికివస్తుందని అంటున్నారు. చిత్రకారుడికి తెలియకుండానే సృజన రూపుదాలుస్తుందని, ఎలాగైతే మొగ్గ పూవుగా వికసించడం, ఆ పువ్వు కాయగా రూపాంతరం కావడం కనిపించదో అలాగే చిత్రకళ సైతం కనిపించకుండా...తెలియకుండానే కాన్వాసుపైకి ఆకారం దాలుస్తుందన్నది సత్యమని ఆమె అంటున్నారు. అలా ఓ ఆకృతి ఆవిష్కృతమయ్యానో దానికి మెరుగులు అద్దడం అనంతరం చేసే పనులని ఆమె చెబుతున్నారు. ''నా'' ఆర్ట్‌లో నేను కనబడతా...అని ఆమె గర్వంగా చెబుతారు. నాజీవిత అనుభవాలు, నేను చూసిన దృశ్యాలు, అనుభవించిన ఆనందాలు, అనుభూతిలోకి వచ్చిన అనేక అంశాల సమాహారమే నా చిత్రాలని ఆమె ఎంతో బలంగా, గుండె లోతుల్లోంచి వెల్లడించారు. అది నిజమని రుజువుగా ఆమె గీసిన-గీస్తున్న వందలాది తెలంగాణ సమాజ మహిళల చిత్రాలు చెబుతున్నాయి. ఇందులో వారి ఔన్నత్యం కనిపిస్తోంది. వాటర్ కలర్స్‌తో వేసినా, అక్రిలిక్‌లో వేసినా, లేతవర్ణాలు ఎంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ముగ్ధ మనోహరంగా మనసులను దోచుకుంటాయి.

విచిత్రమేమిటంటే ఈ సౌందర్య దృష్టి ఆమెకు చిన్నప్పటి నుంచి ఉండటం. సంగారెడ్డి జిల్లాకు సమీపాన నందికంది గ్రామంలోని ఓ ఉమ్మడి కుటుంబంలో పుట్టిన అంజనీ రెడ్డి గ్రామ అందాలు, గుళ్లోని శిల్పసంపద, పరిసరాల అమరిక, రంగుల పొందిక ఆమె లేత మనసుపై ప్రభావం చూపాయి. వాటితో స్ఫూర్తి పొంది, వాటి పరిశీలనతో లీనమైనందు వల్ల చిన్నప్పటి నుంచే బొమ్మలు వేస్తానని, గీస్తానని నిశ్చయించుకుని తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అదృష్టవశాత్తు తల్లిదండ్రులు సైతం ఆమె ఇష్టాన్ని కాదనలేదు. తనలోని విశ్వాసాన్ని గమనించి వారు వద్దనలేదు. బంధువులు, ఇతరులు ఏవేవో మాటలన్నా వాటిని చెవిమీద పెట్టలేదు. అసలు పట్టించుకోలేదు. తన మనసు చెప్పిన మార్గాన్ని అనుసరిస్తూ అడుగు ముందుకేశారు.

అలా హైదరాబాద్‌లో ఇంటర్ చదువు పూర్తయ్యాక ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చేరి ఒక రకంగా చరిత్ర సృష్టించారు. తన సామాజిక వర్గంలో ఇలాంటి నైపుణ్యంతో కళాశాలకెళ్లినా తొలి మహిళా ఆమెనే. ఓ రకంగా అది సంచలనం. అలా అంకితభావం, సమర్పితాభావంతో చిత్రకళకు ఆమె తనను తాను 'సరెండర్' అయ్యారు. అనంతరం బొంతపల్లి గ్రామంలోని ఓ ఉమ్మడి కుటుంబంలో పెద్దకోడలుగా అడుగిడి, అన్ని బాధ్యతలను తలకెత్తుకుని, తన అమ్మ-నాయనమ్మ తదితరుల అనుభవాలను, ఆచారాలను, సంప్రదాయాలను తెలుసుకుంటూ జీవితం కొనసాగిస్తూ తనదైన శైలిలో చిత్రకళ తపస్సులో రాణించారు. ఆ తరువాత తాను చిత్రకళ అభ్యసించిన ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఉపాధ్యాయురాలిగా చేరి వందలాదిమంది చిత్రకారులను తీర్చిదిద్దారు. ఎందరివో కలలను సాకారం చేశారు.


1991 సంవత్సరంలో ఆమె హైదరాబాద్ కళాభవన్‌లో తన తొలి చిత్రకళ ప్రదర్శన ఏర్పాటు చేశారు. తరువాత దేశంలోని వివిధ నగరాలలో 13చోట్ల తన చిత్రాలను ప్రదర్శించారు. అమెరికా, సింగపూర్, బ్యాంకాక్, బ్రిటన్, జర్మనీ, స్వీడన్ తదితరదేశాల్లోనూ ఆమె చిత్రాలు ప్రదర్శితమై ప్రశంసలందుకున్నారు. జాతీయస్థాయి చిత్ర కళ పోటీల్లో పాల్గొన్నారు. ముంబాయిలోని మహా మండల్ సంస్థాన్ వారు రాజా రవివర్మ సమ్మాన్ అవార్డును అందజేశారు. చిత్రకళలో జీవిత సాఫల్యం సాధించినందుకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా రాష్ట్ర అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయి చిత్రకారిణిగా వివిధ పత్రికల్లో ప్రశంసలందుకున్నారు. అనేక గ్యాలరీలలో ఆమె చిత్రాలు ఇప్పటికీ ప్రదర్శిమవుతున్నాయి. కంది నందిలాంటి చిన్న పల్లెటూరు నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదగడం కన్నా ఇంకేం 'భాగ్యం' ఉంటుంది? అలా ఆమె చిత్రకళ జెండాను సమున్నతంగా ఎగరేసి పట్టుకున్నారు. నిజమైన చిత్రకారిణిగా నీరాజనాలు అందుకుంటున్నారు.

- ఉప్పలనరసింహం

9985781799

## మౌర్య సామ్రాజ్య పతనానికి కారణం?

అశోకుని మరణానంతరం మౌర్య సామ్రాజ్య పతనం ప్రారంభమైంది. అశోకుని తర్వాత అధికారానికి వచ్చిన రాజులెవ్వరు ఈ పతనాన్ని అరికట్టలేకపోయారు. అశోకుడు బౌద్ధమత అనుకూల విధానాలను అనుసరించినందువల్ల వైదిక కర్మలను, జంతు బలులను నిషేధించినందువల్ల, బ్రాహ్మణులు మౌర్యసామ్రాజ్యానికి శత్రువులుగా మారారని, మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఏర్పడిన శృంగ, కన్వరాజ్యాలు, శాతవాహన రాజ్యాలు బ్రాహ్మణులచే స్థాపితమై వైదిక కర్మలను పునరుద్ధరించాయనే వాదనలో కొంత వాస్తవముందని చరిత్రకారులు చెపుతారు. మౌర్య సామ్రాజ్య పతనానికి ఇదే ముఖ్య కారణం కాదు. మౌర్య సామ్రాజ్యం అశోకుని కాలంలోనే కొంత ఆర్థిక ఇబ్బందులకు గురైంది. గొప్ప సైన్యాన్ని పోషించడమేగాక, బౌద్ధసన్యాసులకు దానాలు తదితర కార్యక్రమాలపై ఖర్చు పెరగడంతో అశోకుని తర్వాతి కాలంలో ఆర్థిక దుస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం బలహీనతల వల్ల సామంతరాజులు, రాష్ట్రపాలకులు స్వతంత్రులైనారు. ప్రతిచోట అధికారులు నిరంకుశంగా ప్రవర్తించడంతో తిరుగుబాట్లు వచ్చాయి. పైగా కడపటి మౌర్యరాజులు వాయవ్య సరిహ




ద్దులను గూర్చి పట్టించుకోలేదు. ఇదేకాలంలో మధ్య ఆసియా తెగల నుంచి కాపాడుకోవడానికి చైనాలో బృహత్తరమైన గోడ నిర్మితమైంది. మౌర్య రాజులు ఆ జాగ్రత్త తీసుకోలేదు. ఆ కారణంగానే పశ్చిమోత్తరం దిక్కు నుంచి పార్థియన్లు, శకరాజులు, గ్రీకులు, భారతదేశంలోనికి చొచ్చుకుని వచ్చారు. బ్రాక్టియాను గ్రీకులు ఆక్రమించుకున్నారు. ఈ విధంగా పశ్చిమోత్తర సరిహద్దు విదేశీ ఆక్రమణలకు లోను కాగా క్రీ.పూ.185వ సంవత్సరంలో పుష్యమిత్ర శృంగుడు అనే బ్రాహ్మణ సేనాని ఆఖరి మౌర్యరాజైన బృహద్రధుని సంహరించి పాటలీపుత్రాన్ని ఆక్రమించుకోవడంతో మౌర్య సామ్రాజ్యం అంతమైంది.

మౌర్య చక్రవర్తి సర్వాధికారి కావడం వల్ల ప్రతి విషయాన్ని అతడే నిర్ణయించవలసి ఉన్నందున అతని కార్యభారంలో వైవిధ్య విధి నిర్వహణ కన్పిస్తుంది. పాలనాయంత్రాంగ విశేషాలను పరిశీలించడం, మంత్రులను, ఉన్నతాధికారులను ఆదేశించడం, సైనికావసరాలు విశ్లేషించడం, ఆర్థిక వనరులను సమీకరించుకోవడం, రాజ్యంలో ఏమి జరుగుతుందో జాగరూకతతో గమనించడం, మొదలైన విధులతో మౌర్యరాజు శ్రమించవలసి వచ్చేది. రాజు శక్తిమంతుడు, జాగరూకుడు అయి వుండాలి. అయితే అశోకుని మరణానంతరం రాజులు అంతటి శక్తిమంతులు కాకపోవడం, వారు జాగరూకులై ఉండకపోవడాన్ని మౌర్య సామ్రాజ్య పతనానికి ఒక కారణంగా చెప్పవచ్చు.

- రమణ

9553097319

# తెలుగునాట తొలి రంగస్థల ఆచార్యులు



మొదలి నాగభూషణ శర్మ
24-7-1936 - 16-1-2019

ఉపాధ్యాయుడైన తండ్రి నుండి కళను వారసత్వంగా పొందిన మొదలి నాగభూషణ శర్మ సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అసమాన ప్రజ్ఞను కనబరిచారు. ఆంగ్ల సాహిత్యంపై పట్టు సాధించి, ఆంగ్ల నాటకాలకూ దర్శకత్వం వహించారు. తెలుగు నాటక రంగచరిత్రపై శోధించి, భావి తరాలకు మార్గదర్శిగా నిలిచారు. తెలుగు నాట తొలి రంగస్థల ఆచార్యులుగా పేరు పొందారు. తెలుగు నాటకరంగం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే ముఖ్యుల్లో ఒకరిగా పేరు పొందిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మ గుంటూరు జిల్లా ధూళిపూడి గ్రామంలో సుబ్రహ్మణ్యశర్మ కామేశ్వరమ్మ దంపతులకు 1936 జులై24న జన్మించారు. తండ్రి నుండి సహజంగా కళారాధన అబ్బిన నాగభూషణ శర్మ ఎనిమిదేళ్లకే రంగస్థలంలో తొలి అడుగులు వేశారు. పదహారేళ్ల ప్రాయంలోనే నాటక రచనకు శ్రీకారం చుట్టారు. ''రాముని బుద్ధిమంతతనం''అనే శరత్‌బాబు నవలను 1951లో నాటకీకరించడంతో ఆయన రచనా వ్యాసంగం ప్రారంభమైంది. సుప్రసిద్ధ పత్రికా రచయిత నార్లవేంకటేశ్వరరావు రాసిన 'భంగపాటు', 'కొత్తగడ్డ' నాటికలు; మునిమాణిక్యం రాసిన 'గృహప్రవేశం' నాటకాలతో ఆ తర్వాతి సంవత్సరం ప్రదర్శనలకు అంకురార్పణ చేశారు. వాటి సమకాలీన సామాజిక సమస్యలకు దర్పణంగా గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకంలో మధుర వాణిగా ప్రధానమైన స్త్రీ పాత్ర పోషించి, ప్రేక్షకులు మన్ననలు పొందారు. అప్పటికి ఆయన వయస్సు 18 సంవత్సరాలు.

ఒకవైపు నాటకాల్లో సాధన చేస్తూనే మరో వైపు సాహిత్య సృజన పైకి కూడా నాగభూషణ శర్మ దృష్టిసారించారు. పద్దెనిమిదేళ్ల వయసులోనే 1954లో ఆయన రాసిన నాటిక 'అన్వేషణ' మొదటిసారిగా అచ్చయింది. నాటి రోజుల్లో అత్యుత్తమ సాహిత్యపత్రికగా ఉన్న 'భారతి'లో ఆయన తొలి రచన ప్రచురితం కావడం విశేషం. అనంతరం దశాబ్ద కాలంలో ఆయన రాసిన 14 నాటికలు, మూడు నాటకాలు పలు ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. స్నాతకోత్తర పట్టాకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన శర్మ ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఏ.పూర్తి చేసుకున్నారు. అక్కడితో ఆగిపోకుండా, రంగస్థల కళలపై ఉన్న అమితమైన ఆసక్తి ఆయనను ముందుకు నడిపించింది. అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయంలో నాటక దర్శకత్వంలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు పూర్తిచేశారు. అమెరికన్ నాటకాలపై పరిశోధన చేసి, డాక్టరేటు పొందారు. నాటకంపై అధ్యయనం కోసం అనేక దేశాల్లో పర్యటించారు. ఆయా దేశాల్లో నాటక రంగ స్థితిగతులను, ప్రయోగరీతులను ఆకళింపు చేసుకున్నారు. ఆంగ్ల సాహిత్యంతో పాటు రంగస్థల కళలలోనూ సుశిక్షితుడిగా పేరు పొందారు. సాహిత్యం, రంగస్థల కళలపై అనేక పరిశోధనలు చేశారు. సాధికారిక వ్యాసాలను, గ్రంథాలను రచించారు.

తాను పి.జి.పూర్తి చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే ఉద్యోగం సాధించారు నాగభూషణ శర్మ. పదహారేళ్లు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంగ్లశాఖలో ఆచార్యులుగా పనిచేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయ రంగస్థల శాఖతో సహా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోను, తెలుగు విశ్వవిద్యాలయంలోను రంగస్థల శాఖల అధ్యక్షుడిగా, డీన్‌గా పనిచేశారు. తెలుగునాట రంగస్థల శాఖలో తొలి ఆచార్యులుగా ప్రఖ్యాతి పొందారు. రంగస్థల కళల బోధన పాఠ్య ప్రణాళిక రూపకల్పన చేసి, వందలాది యువ నటీనటులకు, దర్శకులకు మార్గదర్శకులయ్యారు.

ప్రాచీన, అర్వాచీన నాటక రచన, ప్రదర్శన ప్రయోగాలను అధ్యయనం చేసి; రంగస్థలంపై ప్రదర్శించి; తెలుగు ప్రేక్షకులను రంజింపజేసిన ధీశాలి మొదలి నాగభూషణశర్మ. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న యువకులు కొందరు 1964లో ప్రారంభించిన హైదరాబాదు డ్రమెటిక్ సర్కిల్ కార్యక్షేత్రంగా అనేక కార్యక్రమాలను చేపట్టారు శర్మ. పలు ఆంగ్ల నాటకాలతో పాటు గ్రీకు, సంస్కృత భాషల నాటకాలకు కూడా దర్శకత్వం వహించి, హైదరాబాదు డ్రమెటిక్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఆయన దర్శకత్వం వహించిన నాటకాల్లో మృచ్ఛకటిక, తుగ్లక్, కింగ్ ఈడిపస్, అంధయుగం, హయవదన, ది విజిట్, కాయితం పులి, దొరా! నీ సావు మూడింది, వెయిటింగ్ ఫర్ గోడో మొదలైనవి ఉన్నాయి. ఈ నాటకాలు విభిన్న ప్రయోగ పద్ధతులతో కూడి ఉండడం విశేషం.



'ఆధునిక సిద్ధేంద్రయోగి' వెంపటి చినసత్యంగారితో...

సుమారు 80కి పైగా నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. వాటిలో ఇరవైకి పైగా ఆంగ్ల నాటకాలు, అరవైకి పైగా తెలుగు నాటకాలు ఉన్నాయి. దర్శకత్వం వహించడంతో ఆయన కళాతృష్ణ తీరలేదు. సాహిత్య, నాటక, నృత్య, జానపద ప్రక్రియల్లో పరిశోధనలు చేశారు. ఆయా ప్రక్రియలపై 15 ఆంగ్ల గ్రంథాలను, 22 తెలుగు గ్రంథాలను ప్రచురించారు. 'ఇండియన్ థియేటర్ జర్నల్' అనే సుప్రసిద్ధ సాంస్కృతిక పత్రికకు సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టి; పాఠకుల ప్రశంసలు పొందారు. ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య పరిశోధనా త్రైమాసిక పత్రిక 'నర్తనం'కు ప్రధాన సంపాదకుడిగా 2001 నుండి 2007 వరకు పనిచేశారు. ఎంతోమంది నాట్యాచార్యులు, నృత్య కళాకారుల సేవలను తన ప్రత్యేక వ్యాసాల ద్వారా వెల్లడించారు. తెలుగు జానపద కళారూపాలపై పరిశోధనలు చేశారు. క్షేత్ర పర్యటనల ద్వారా ఆయన చేపట్టిన పరిశోధనల పర్యవసానంగా అంతర్జాతీయ వేదికల్లో తెలుగు జానపద కళలకు గుర్తింపు సాధ్యమైంది.

నాటక రచనకు పూనుకుని, 70కి పైగా నాటకాలను, నాటికలను నాగభూషణ శర్మ రాశారు. వాటిలో మన్మథుడు మళ్లీపుట్టాడు, సంభవామి, విషాదాంతం, జంట పక్షులు, నరజాతి చరిత్ర మొదలైన నాటకాలు; జననీ జన్మభూమి, అన్వేషణ, ఆగస్టు 15, అడ్డదారి, రాజదండం మొదలైన నాటికలు ఉన్నాయి. స్వతంత్ర నాటకాల రచనతో పాటు రాజా ఈడిపస్ మొదలైన అనువాద నాటకాలను కూడా ఆయన తెలుగులోకి అనువదించారు. డజను ఆంగ్ల నాటకాలను తెలుగులోకి అనువదించిన శర్మ మూడు సంస్కృత నాటకాలను, ఎనిమిది ఇతర భారతీయ భాషా నాటకాలను కూడా తెలుగులోకి తర్జుమా చేశారు. తాను రాసిన 'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకాన్ని దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రదర్శించారు. 'తెలుగు సాహిత్యం-గాంధీజీ ప్రభావం', 'తెలుగు నవలా వికాసం' అనే గ్రంథాలను వెలువరించి, తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. 'లోచన' అనే వ్యాస సంపుటిని రచించారు. 'నూరేళ్ల తెలుగు నాటక రంగం' అనే గ్రంథానికి సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు.

తెలుగు నాటక రంగంలో కృషి చేసిన పలువురిపై పరిశోధనాత్మక గ్రంథాలను శర్మ వెలువరించారు. పద్యనాటకానికి ప్రాచుర్యం కల్పించిన ఆంధ్ర నాటక పితామహులు ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రతిభకు అద్దం పట్టే 'ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటక సాహిత్యం:సమగ్ర పరిశీలన' అనే గ్రంథాన్ని పరిశోధనాత్మకంగా రచించారు. ప్రఖ్యాత రంగస్థల, చలనచిత్రనటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఈలపాట రఘురామయ్య నట జీవిత ప్రస్థానంపై 'ఈలపాట కళ్యాణం రఘురామయ్య నట జీవితం' అనే సాధికారిక గ్రంథాన్ని రాశారు. సుప్రసిద్ధ నటుడు స్థానం నరసింహారావుపై ''నటకావతంసంస్థానం నరసింహారావు నటజీవన ప్రస్థానం' అనే గ్రంథాన్ని వెలువరించారు. బళ్లారి రాఘవ, ఆచార్య ఆత్రేయ మొదలైన వారిపై కూడా పరిశోధనా గ్రంథాలను ఆయన రచించారు. 'సురభి నాటక సమాజాల చరిత్ర', 'కన్యాశుల్కం-నూరేళ్ల సమాలోచనం', 'నాటక శిల్పం' మొదలైన గ్రంథాలతో తెలుగు నాటకరంగ చరిత్రను ప్రేక్షకులకు అందజేశారు. 'నాటకరంగ పారిభాషిక పదకోశం' అనే పేరుతో నాటకరంగంపై పారిభాషిక పదకోశాన్ని కూడా ఆయన రూపొందించారు. పురాణం సూరి శాస్త్రి రచించిన 'నాట్యాంబుజము-నాట్య అశోకము' అనే గ్రంథానికి సంపాదకుడిగా వ్యవహరించారు. ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను పొందారు. ఆయన రచించిన 'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకం తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం పొందింది. నాటక రంగంలో ఉత్తమ సేవలకు నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కారాన్ని 2012 సంవత్సరంలో పొందారు. తానా జీవిత సాఫల్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభామూర్తి పురస్కారం మొదలైన అవార్డులను స్వీకరించారు. వీరేశలింగం, ఆచార్య ఆత్రేయ, బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు మొదలైన సుప్రసిద్ధుల పేరు మీదుగా ఏర్పాటు చేసిన పలు పురస్కారాలను ఆయన అందుకున్నారు. 2012లో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆయనకు 'ఠాగోర్ రత్న' పురస్కారం అందజేసింది. 2013లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం ప్రకటించింది. నాటక రంగానికి విశిష్ట సేవలందించేవారికి అందజేసే ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం న్యాయనిర్ణేత కమిటీ సభ్యుడిగా 2015లో వ్యవహరించారు. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, నాటక కర్తగా, ఆచార్యుడిగా, రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా విశిష్టసేవలందించిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మ మరణం తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తీరని లోటు.

- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు

9441046839

# బుద్ధిమతాం వరిష్ఠం...

చింతన

**సాధకునిలోని పరమాత్మాంశ రాముడు. ప్రకృతి అంశ సీత. ఈ అంశాలను కలిపేందుకు చేసిన ప్రయత్నమే ఆంజనేయుడు. జ్ఞానాన్ని కాంక్షించే సాధకుని బుద్ధే హనుమంతుడు. ముక్తి సాధనా మార్గాలలో ఉత్తమమైనది అదే. అందుకే ఆయనను బుద్ధిమతాం వరిష్ఠం అన్నారు.**

రామాయణంలో హనుమంతుని పాత్ర ఒక అద్భుతం. వాల్మీకి సుందర కాండలో హనుమంతుని గొప్పతనాన్ని చెబుతారు. ఇక రామాయణం అంతటా హనుమంతుని గొప్పతనం కనిపిస్తూనే ఉంటుంది. బలపరాక్రమం కార్యదక్షత, వినయ విధేయతలు, కర్తవ్య నిష్ఠ ఉత్సాహం, నిర్భయత్వం, పవిత్రత, ఇంద్రియ నిగ్రహం, విద్యా వైదుష్యం ఇన్ని ఉదాత్త గుణాలను పోత పోయగా వచ్చిన అద్భుతమే హనుమంతుడు. ఈ విషయాన్ని రాముడే స్వయంగా చెబుతాడు. వాల్మీకి రామా యణాన్ని నిశితంగా పరిశీలించిన కొద్దీ ఆయన గొప్పతనం వ్యక్తమవుతుంటుంది. సంక్షిప్తంగానైనా ఆయన పాత్ర ఉన్న ఘట్టాలను స్మరించుకుందాం.

సీతమ్మను వెతుకుతూ ఋష్యమూక పర్వతంపై విడిదిచేసి ఉన్నారు రామ లక్ష్మణులు. వారిని దూరం నుంచేచూసాడు సుగ్రీవుడు. వారు వాలి పంపగా వచ్చిన వారని అసహనంగా అటూఇటూ పచార్లు చేయసాగాడు. అది గమనించాడు హనుమంతుడు. మంత్రిగా అతని భయం పోగొట్టదలచి, 'సుగ్రీవా! నీవు చంచల మనస్సును ప్రదర్శిస్తున్నావు. కాస్త విజ్ఞతతో ఆలోచించు. వారు మహాపురుష లక్షణాలతో కనపడటం లేదా! వారు సామాన్యులు కారనిపిస్తున్నది. లేని పోని భయాలొద్దు. నేను మాట్లాడి వస్తాను' అన్నాడా విజ్ఞాని. సుగ్రీవుని మనస్సును స్వస్థత పరచి రామ లక్ష్మణుల దగ్గరికి సన్యాసి రూపంలో వెళ్లాడు. వారిని సమీపించి, నమస్కరించి ఇలా అన్నాడు. 'అయ్యా! సుగ్రీవుడను వానర శ్రేష్ఠుడు గొప్ప ధర్మా త్ముడు, వీరుడు. అతడి సోదరుడు వాలి కిష్కింధకు రాజు. అతడు సుగ్రీవుణ్ణి ఇంటి నుంచి తరిమేశాడు. ఆయన ఇప్పుడు చాలా దుఃఖంలో ఉన్నాడు. నన్ను మీ వద్దకు పంపాడు.నన్ను హనుమంతుడంటారు. వానర జాతికి చెందిన వాడను. సుగ్రీవుడు మీతో స్నేహం చేయదలిచాడు. నేను ఆయన మంత్రిని. నేను నా ఇష్టం వచ్చిన చోటికి వెళ్లగలను. ఇష్టం వచ్చిన రూపు ధరించగలను' అని వినయంగా పలికాడు.



రాముని ముఖం ఆనందంతో నిండింది. 'లక్ష్మణా! ఇతని సంస్కారం ఎంత గొప్పది. ఎంత అద్భుతమైనది. హృదయానికి ఆనందం కలిగిస్తున్నది. కల్యాణ కరమైన మాటలు, చేతలు. ఎంత సుందరమైన సంభాషణ ఈతనిది. సందేహం లేదు. ఇతను గొప్ప పండితుడు. **బహు వ్యవహరతానేనకించిదపశబ్దితం** అంటే ఈతని నోటి నుంచి ఒక్క అపశబ్దమైనా రాలేదు' అంటాడు. 'హృదయం, కంఠం, శిరస్సు అనే ఈ మూడు స్థానాల ద్వారా స్పష్టంగా అభివ్యక్తమవుతున్న వీని మాటలు విన్నపుడు ఎవరి మనస్సైనా ఎందుకు ప్రసన్నం కాదు. చంపేందుకు ఖడ్గం పైకెత్తి వచ్చిన శత్రువు కూడా ఈయన మాటలు వింటే కరుణతో కరిగిపోతాడంతే' అన్నాడు రాముడు. వారిద్దరిని తన భుజంపై ఎక్కమన్నాడు హనుమంతుడు. అలాగే సుగ్రీవుని వద్దకు తీసికెళ్ళాడు. శ్రీరామ శరీర స్పర్శ వల్ల పులకితుడయ్యాడు హనుమంతుడు.

**అయం రామః రామాయం రామో దశరథాత్మజః** రామనామాన్ని మూడు సార్లు ఉచ్చరిస్తే సహస్ర నామం చేసినంత ఫలం లభిస్తుంది. ఇదే విషయాన్ని శ్రీరామ రామ రామేతి అనే శ్లోకమూ వివరిస్తోంది.

సత్యం శివం సుందరం అనే పదాలు పరమాత్మ తత్త్వాన్ని తెలిపేవిగా జగత్ర్ప సిద్ధాలు. సుందరీ శబ్దం ప్రకృతిగా భావిస్తే, సుందర శబ్దం పురుషుని తెలిపేది అవుతుంది. పురుషునితో (పరమాత్మతో) ప్రకృతిని చేర్చేదే సుందర కాండ.

సాధకునిలోని పరమాత్మాంశ రాముడు. ప్రకృతి అంశ సీత. ఈ అంశాలను కలిపేందుకు చేసిన ప్రయత్నమే ఆంజనేయుడు. జ్ఞానాన్ని కాంక్షించే సాధకుని బుద్ధే హనుమంతుడు. ముక్తి సాధనా మార్గాలలో ఉత్తమమైనది అదే. అందుకే ఆయనను **బుద్ధిమతాం వరిష్ఠం** అన్నారు.

సీతను వెతికేందుకు హనుమంతుని, ఇతర వానరుల్ని పంపిస్తూ సుగ్రీవుడంటాడు. 'ఈ భూమండలంలో నీ తేజస్సుతో సమానమైన తేజస్సు కలవాడు ఎవ్వడూ లేడు. కావున ఏ ప్రకారం సీత లభిం చగలదో ఆ ఉపాయం మీరే ఆలోచించండంటాడు.

రాముడు ఆంజనేయునికి ఉంగరమిచ్చి 'హనుమా! ఈ చిహ్నం ద్వారా జనక తనయ సీతకు నీవు నా వద్ద నుంచి వచ్చావని విశ్వాసం కలుగుతుంది. దాని వల్ల ఆమెకు భయం పోయి నీ వైపు చూడగలదు' అని చెప్పగా వాయునందనుడు ఆ ఉంగరాన్ని తీసుకుని తన శిరస్సుపై ఉంచుకుని శ్రీరామునికి నమస్కరించాడు.

హనుమంతుడు సముద్రాన్ని దాటుతున్నాడు. సురస అవ రోధాన్ని చాకచక్యంగా దాటడం, సింహిక సంహారం చూశారు ఆకాశ వాసులు. వారంతా 'అయ్యా! వానరేంద్రా ఎవరి యందు మీకు వలె ధైర్యము, వివేక దృష్టి, కౌశల్యం, ఉంటాయో అతడికి తన కార్యా లయందు ఎన్నడూ అపజయం కలగదు' అని వ్యాఖ్యానించారు.

అశోకవనంలో సీతను చూశాడు హనుమంతుడు. ఆమెతో ఏ భాషలో మాట్లాడాలో వితర్కించుకున్నాడు. సంస్కృతంలో మాట్లా డితే మారువేషంలో వచ్చిన రావణుడనుకుంటుంది. **'అవశ్యమేవ వక్తవ్యంమానుషం వాక్యమర్థవత్'** అంటే అందరు మనుష్యులు మాట్లాడే భాషలోనే సంభాషించటం ఉత్తమం అని భావిస్తాడు.

తాను లంకకు వచ్చిన పని సీత జాడ కనుగొనడం. అది పూర్తయింది కదా అని వెంటనే తిరిగి వెళ్ళలేదు. ఆలోచించాడు. ఆమెకు ధైర్యం చెప్పకుండా, శ్రీరాముని క్షేమ వార్త తెలియజేయకుండా వెళితే శ్రీరాముడు వచ్చే లోగా దుఃఖంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటే అన్న ఆలోచనలతో ఆమెతో సంభాషించి వెళ్లడమే ఉత్తమమని ఆ ప్రకారమే చేస్తాడు.

హనుమంతుడు కేవలం వానరుడే కాదు. ఆయన రుద్రాంశ సంజాతుడు. అతణ్ణి బందీగా తన ముందు ప్రవేశపెడితే రావణుడు సంభ్రమాశ్చర్యాలతో 'భగవాన్ నన్దీ' అంటాడు. సాక్షాత్తు భగవంతుడైన నందీశ్వరుడే ఇక్కడికి వచ్చాడా అనుకుంటాడు.

అన్ని రూపాలు అయనవే. జీవుడు శరణాగతుడయితే ఎలా ఉంటుందో ఆ భక్తి సిద్ధాంతమే హనుమంతావతారంలో ఉంది.

రావణుని మంత్రి ప్రహస్తుడు కూడా 'హనుమంతా! నీ రూపం వానర రూపమే కానీ నీది వానర తేజస్సు కాదు. ఇది నిజం' అంటాడు.

శరణాగతి, నామస్మరణ, దాస్య భక్తి మన సంప్రదాయంలో అత్యుత్తమం, అత్యున్నతం. దానికి ఉదాహరణ ఆంజనేయుడు.

**దాస్య కర్మ ర్పణం తస్య కైంకర్యమపి సర్వదా** సర్వ కర్మలను భగవదర్పణం చేయడం, ఆయన కైంకర్యం చేయడం దాస్యమనిపించుకుంటుంది. హనుమంతుడు మహా జ్ఞాని, యోగి. అయినా దాసోహం అనే భావనలో వ్యవహరించాడు. ఇది అసామాన్య విషయం. దాసోహం కోసలేంద్రస్య అంటే రాముడికి నేను దాసుడను అని చెప్పు కుంటాడు, సాక్షాత్తు వాయుపుత్రుడు, రుద్రాం శుడు అయిన ఆంజనేయుడు నేను రామ దాసుడనని చెప్పుకోవడం దాస్య భక్తికి పరాకాష్ఠ.

లంక నుంచి తిరిగివచ్చిన సందర్భంలో జాంబవంతుడు, ఇతర వానరులతో **'దృష్టం సీతా'** అంటే చూచాను సీతను అని విషయాలన్నీ సంక్షిప్తంగా వివరిస్తాడు. కాని తాను చేసిన వీర కృత్యాలు వానరులతో చెప్పినట్లుగా రాముడితో చెప్పకపోవడం ఆయన వినయానికి తార్కాణం. అంతేనా, సీత జాడ తెలుసుకు వచ్చాడని వానరు లంతా అభినందనలతో ముంచెత్తుతూ ఉంటే 'రాఘవుని అనుగ్రహం, మీ అందరి తేజస్సు, సుగ్రీ వుని ఆజ్ఞగా అన్నీ చేశాను' అని చెప్పడమంటే ఎంతటి వినయశీలి అనాలి.

సీతను ఎంత గొప్పగా ఓదారుస్తాడు. తనను తాను ఎంత తగ్గించుకుంటాడు. లోక సాక్షి సూర్యుని శిష్యుడాయన. అందుకే లంకలో సీతతో 'తల్లీ! నా కంటె బలాఢ్యులు సుగ్రీవుని వద్ద కోకొల్లలుగా ఉన్నారు. నా కంటె తక్కువ బలం కల వారు ఎవరూ లేరు. నాలాంటివాడే సముద్రాన్ని దాటినపుడు నా కంటె బలమైన వారి మాట చెప్పేదేమిటి? ఎక్కడైనా దూతగా సామాన్యుడినే ప్రభువులు పంపుతారు, కాని శ్రేష్ఠుల్ని పంపరు కదమ్మా!' అంటాడా భక్త శ్రేష్ఠుడు.

రామకార్యాన్ని సాధించి వచ్చినా నిజమైన శరణాగతి పొందిన వ్యక్తి దేనికీ చలించడు. సుఖ దుఃఖాలు, జయాపజయాలు ఆయనకు సమా నంగా ఉంటాయి. ఈ విషయం రాముడికి తెలును. అందుకే 'ఓ హనుమా! నాకింత ప్రియమైన వార్తను చెప్పిన నీకు ఏమివ్వగలను? అని హనుమంతుని కౌగలించుకుంటాడు. భగవం తునితో భక్తునికి పరిష్వంగం లభించింది.

రామ రావణ యుద్ధంలో హనుమంతుని పరాక్రమానికి విస్మయపడిన రావణుడు ' ఓయీ వానరుడా! పరాక్రమంలో నా ప్రశంసనీయమైన ప్రతిద్వందిగా ఉన్నావు' అని పొగడగా, **దిగస్తు మమ వీర్యస్యయత్త్వంజీవసి రావణ** అంటాడు అంటే 'రావణా! నీవింకనూ జీవించి ఉన్నావు కనుక నా పరాక్రమానికి ధిక్కారమిది' అని ప్రత్యుత్తర మిచ్చాడు. అటువంటి ధైర్యశాలి రావణుడు. యుద్ధానంత రం జగజ్జనని సీతాదేవి సన్మానం ఆయనకు లభించింది. విజయానంతరం సీతాదేవి తన మెడ నుంచి ముత్యాల హారాన్ని తీసి వానరు లందరి వైపు, తన భర్త వైపు సాభిప్రాయంగా చూస్తూ ఉంది. రాముడది చూసి నీవెవరి విషయంలో ప్రసన్నురాలవో వారికది ఇవ్వు' అన్నాడు. ఆమె ఆ హారాన్ని హను మంతునికి ఇచ్చింది. మహాభక్తుడైన హనుమంతుడు లక్ష్మీనారాయణ స్వరూపాలైన సీతారాములకు ఆత్మార్పణం చేసుకోవడం వల్ల పరమేశ్వరుని పరిష్వంగం, పరమేశ్వరి బహుమానం లభించింది. **'తేజసావాపితే భూతంన సమం భువి విద్యతే ఆంజనేయా!** ఈ భూమండలమున నీ తేజస్సుతో సమానమైన తేజము కలవారు ఎవ్వరూ లేరు.

**- డాక్టర్ గాది శ్రీనివాస్**
**9989079742**



# నమస్కారం వెనుక విజ్ఞానం

నమస్కారం అంటే అందరికీ తెలుసు. దేవునికి, గురువులకు, తల్లితండ్రులకు, పెద్దలకు న మస్కారం పెట్టడం మనకు తెలుసు. అయితే దాని వెనుక అంతరార్థం మనకు తెలియదు. సద్గురు దానిపై తన దైన విశిష్ట రీతిలో ఇచ్చిన వివరణ చూద్దాం.

నమస్కారం కేవలం ఓ సాంస్కృతిక అంశం మాత్రమే కాదు. దాని వెనుక ఓ విజ్ఞానం ఉంది. అరచేతులని మీరు దగ్గరికి తెచ్చిన ప్రతిసారీ ఓ చిన్న శక్తి విస్ఫోటనం సంభవిస్తుంది.

మీరొక వ్యక్తిని చూసినప్పుడు, అది మీరు పనిచేసే చోటైనా, వీధిలో అయినా, ఇంట్లో అయినా లేదా మరెక్కడైనా సరే, మానవ బుద్ధి నైజం ఎలాంటిదంటే, అది చూసిన క్షణమే ఆ వ్యక్తి గురించి ఒక నిర్ణయానికొచ్చేస్తుంది. ''ఆ మనిషిలో ఇది బాగుంది, ఈ మనిషిలో ఇది బాలేదు. అతను మంచివాడు. అతను మంచివాడు కాదు, అతను అందంగా ఉన్నాడు, అతను వికారంగా ఉన్నాడు'' ఇలా ఎన్నో నిర్ణయాలకు వచ్చేస్తుంది. వీటన్నిటిని మీరు ప్రయత్న పూర్వకంగా ఆలోచించాల్సిన పని కూడా లేదు. ఒక్క క్షణంలోనే ఈ అభిప్రాయాలు, తీర్మానాలు జరిగిపోతాయి. మీ తీర్మానాలు పూర్తిగా తప్పయ్యే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే అవన్నీ జీవితంలోని మీ గతాను భవాల నుండీ వస్తున్నవే. దేన్నైనా, ఎవరినైనా ప్రస్తుతమున్న విధంగా గ్రహించడానికి మిమ్మల్ని ఇవి అనుమతించవు. ప్రస్తుతమున్న విధంగా విషయాలని, మనుషులని గ్రహిం చడం చాలా ముఖ్యం. మీరు ఏ రంగంలోనైనా సమర్థ వంతంగా పనిచేయాలంటే, మీ ముందుకు ఎవరైనా వచ్చి నప్పుడు వారిని ప్రస్తుతం ఎలా ఉన్నారో అలా అవగాహన చేసుకోవడం చాలా ముఖ్యం. వారు నిన్న ఎలా ఉన్నారనేది ముఖ్యం కాదు. వారు ఈక్షణంలో ఎలా ఉన్నారనేది చాలా ముఖ్యం. కాబట్టి మొదట మీరు శిరస్సు వంచి నమస్కరించాలి. ఒక్కసారి మీరలా చేస్తే, మీ ఇష్టా యిష్టాలు బలపడకుండా, మెత్తబడతాయి. ఎందుకంటే వారిలో ఉన్న సృష్టి మూలాన్ని మీరు గుర్తిస్తారు. నమస్కారం చేయడం వెనక ఉన్న ఉద్దేశ్యమిదే.



## సృష్టికర్త హస్తం

సృష్టికర్త హస్త ప్రమేయం లేనిదేది సృష్టిలో లేదు. ప్రతి కణంలోనూ, ప్రతి అణువులోనూ సృష్టి మూలం పనిచేస్తోంది. అందుకే భారత సంస్కృతి లో మీరు పైకి ఆకాశం వంక చూసినా, కిందికి భూమి వంక చూసినా, శిరస్సు వంచి అభివాదం చేయమని చెబుతారు. మీరొక స్త్రీని, పురుషుడిని, పిల్లాడిని, ఆవుని, లేదా ఓ చెట్టుని చూసినా, శిరస్సు వంచి అభివాదం

సద్గురుబోధ

చేయమంటోంది ఈ సంస్కృతి. మీలో కూడా సృష్టి మూలం ఉందన్న విషయాన్ని ఇది నిరంతరం గుర్తుచేస్తూ ఉంటుంది. దీన్ని గుర్తిస్తే నమస్కారం చేసిన ప్రతిసారి మీరు మీ సహజ ప్రవృత్తివైపు అడుగులు వేస్తున్నట్టే. దీనికి మరోకోణం కూడా ఉంది. మీ అరచేతుల్లో ఎన్నో నాడుల కొసలు ఉంటాయి. దీన్ని ఈనాటి వైద్యశాస్త్రం కూడా కనుగొంది. వాస్తవానికి మీ నాలుక కన్నా, కంఠం కన్నా మీ చేతులే ఎక్కువ మాట్లాడు తాయి. యోగా ముద్రలను గురించి పూర్తి శాస్త్రమే ఉంది. మీ చేతిని కొన్ని ప్రత్యేకమైన రీతుల్లో అమరిస్తే మీరు మీ పూర్తి వ్యవస్థనే భిన్నంగా పనిచేసేటట్లు చేయవచ్చు. మీరు మీ చేతులని జోడించిన క్షణమే. మీ ద్వైత భావనలు, మీ ఇష్టాయిష్టాలు, మీ కోరికలు, మీరు ఈసడించుకునే విషయాలు, ఇవన్నీ సమమై, తొలగిపోతాయి. ఇలా మీరెవరో వ్యక్తీకరించుకోవడంలో ఒక రకమైన ఏకత్వం ఉంటుంది. అప్పుడు మీలోని శక్తులన్నీ ఒక్కటిగా పనిచేస్తాయి.

## మిమ్మల్నీ మీరే సమర్పించుకోవటం

మీ అరచేతులని దగ్గరికి తెచ్చే ప్రతీసారీ, ఓ చిన్న శక్తి విస్ఫోటనం సంభవిస్తోందని తెలుసుకున్నాం. ఇలా చేయడం వల్ల మీలో జీవశక్తిస్థాయిలో ఒక సమర్పణం జరుగుతుంది. అంటే మిమ్మల్ని మీరు అవతలి వ్యక్తికి అర్పించుకుంటున్నారు. ఆ సమర్పణంతో మీరు అవతలి ప్రాణిని మీతో సహకరించే జీవిగా చేసుకుంటారు. మీరు ఇచ్చే స్థితిలో ఉంటేనే, మీ చుట్టూ విషయాలు మీకు అనుకూలంగా జరుగుతాయి, వ్యక్తులు అనుకూలంగా వ్యవహరిస్తారు. ఇది ప్రతీ జీవికి వర్తిస్తుంది. ప్రతీ జీవి కూడా తనకు తన చుట్టూ ఉన్న జీవరాసుల సహకారం ఉంటేనే వృద్ధి చెందగలుగుతుంది.

ప్రేమాశీస్సులతో

**- సద్గురు జగ్గీవాసుదేవ్**


## అరటి చెట్టును పెరట్లో ఎందుకు పెంచరాదు?

**- రాఘవేంద్ర, మహబూబ్ నగర్**



అరటి చెట్టు ఒకే గెల వేసి తన జీవితాన్ని ముగింప చేస్తుంది కావున గొడ్రాలు అని ఉదయాన్నే లేచి అరటిని చూడరాదు అంటారు. అరటి చెట్టును ఒక్కటి కాకుండా సమూహంగా తోటలను ఊరికి అవతల పెంచుకోవచ్చు. అరటి కాయ, పండు, ఆకు, దూట, పువ్వు అన్ని ఉపయోగపడేవే.

ధర్మసందేహాలు



**- డా॥ కందాడై రామానుజాచార్య**



## భగవద్గీత

## స్థావర జంగమాలన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగమే

అధ్యాయం- 13, శ్లోకం- 27

**యావత్సంజాయతే కించిత్**
**సత్త్వం స్థావరజంగమమ్।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్**
**తద్విద్ధి భరతర్షభ॥**

**తాత్పర్యం**

ఓ భరతవంశశ్రేష్ఠుడా! స్థితిని కలిగినటువంటి స్థావర, జంగమములలో నీవు చూసేదేదైనను క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమేనని తెలిసికొనుము.

**భాష్యం**

ఈ శ్లోకము నందు ఈ సృష్టికి పూర్వము నుండీ శాశ్వతముగా ఉండే భౌతిక ప్రకృతి, జీవుని గురించి వివరించడం జరిగింది. ఈ సృష్టిలో మనం చూసే ప్రతీది ఈ రెండింట కలయిక ద్వారానే ఉద్భవించినవి. చెట్లు పర్వతాలు, కొండలు కదలనివైతే కొన్ని కదిలేవి. భౌతిక ప్రకృతిలో జీవరాశులను ప్రవేశపెట్టుట ద్వారా వాటి యందు పెరుగుదల అనేది సాధ్యమవుతుంది. వీరిద్దరినీ నియంత్రించే భగవంతుని ప్రమేయము వలన మాత్రమే ఇది సంభవిస్తుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS | iTune

## దిన ఫలాలు

**మేష రాశి:** ఆర్థిక చిరాకులు కొనసాగుతాయి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆదాయంలో ప్రతికూల వాతావరణం ప్రారంభమవుతుంది.

**వృషభ రాశి:** అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

**మిథున రాశి:** వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్ర త్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అను కూల పరిస్థితులు ఉంటాయి.

**కర్కాటక రాశి:** దూర ప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయమార్గాలు అనుకూలం.

**సింహ రాశి:** ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమయిన వాతావరణం ఉంటుంది.

**కన్యా రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటుచేసుకొంటాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

**తులా రాశి:** విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళా రంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది.. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

**వృశ్చిక రాశి:** వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

**ధనూ రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేక పోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరి దిద్దుకోగలుగుతారు. ఆదాయంలోమెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

**మకర రాశి:** ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పని సరి. ఆరోగ్యఖర్చులు పెరుగుతాయి. మంచికిపోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నా లతో మాత్రమే సాధ్యం.

**కుంభ రాశి:** నూతన స్నేహాల ద్వార లబ్ది చేకూరు తుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభ వార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతి కూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

**మీన రాశి:** విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

# గణతంత్ర వేడుకలో మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి గణతంత్ర వేడుకలో పాల్గొన్నారు. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హోదాలో చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అభిమానులతో పాటుగా జనసైనికులు రక్తదానం చేశారు. అత్యధికంగా రక్తదానం చేసిన దాతలను ఈ సందర్భంగా చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి అభిమానులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలియజేశారు.



# తెలుగు పాటకు దక్కిన గౌరవమిది

**- పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి**

తనకు పద్మశ్రీ పురస్కారం దక్కడంపై ప్రముఖ పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా తనపై అభిమానం చూపిస్తున్న శ్రోతలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. 1986లో కళాతపస్వి కె విశ్వనాథ్ రూపొందించిన సిరివెన్నెల చిత్రంతో పాటల రచయితగా పరిచయమయ్యారు సీతారామశాస్త్రి, తొలి చిత్రంలోని పాటలతో సంగీత ప్రపంచం ఉలిక్కి పడేలా చేశారు. విధాత తలపున ప్రభవించినదీ అంటూ ఆశ్చర్యపరిచే, ఆలోచింపజేసే సాహిత్యాన్ని సృష్టించారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా అప్రతిహతంగా సీతారామశాస్త్రి పాటల ప్రస్థానం సాగుతోంది. తాజాగా పద్మశ్రీ పురస్కారం ఆయన్ను వరించింది. లక్షలాది మంది అభిమానం, ఆకాంక్షల వల్లే తనకు పద్మశ్రీ పురస్కారం దక్కిందన్నారు సిరివెన్నెల. పద్మశ్రీ పురస్కారం అందిన అనంతరం సిరివెన్నెల మాట్లాడుతూ...పద్మశ్రీ పురస్కారం తెలుగు పాటకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఈ గౌరవం ఆత్రేయ, వేటూరి వంటి దిగ్గజ రచయితలు నాకు అందించిన ప్రసాదం. ఇన్నేళ్లుగా శ్రోతలు నాపై చూపిస్తున్న అభిమానం వల్లే ఇలాంటి గొప్ప పురస్కారాలు దక్కుతున్నాయి. పద్మశ్రీ పురస్కారం రచయితగా నాపై మరింత బాధ్యతను పెంచింది. రచయితగా పరిశ్రమ నాకు మరో జీవితాన్ని ఇచ్చింది. సినిమా పాటల రచన నాకు ఊపిరి లాంటిది. అని చెప్పారు. ఈ సందర్భంగా సిరివెన్నెల సీతారామశాస్త్రిని త్రివిక్రమ్ కుటుంబ సభ్యులు అభినందించారు. పద్మశ్రీ ప్రకటన రోజునే సీతారామశాస్త్రి ఓ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనేందుకు మస్కట్ వెళ్లారు.





# రవితేజ డిస్కో రాజా

రవితేజ నటిస్తున్న చిత్రానికి 'డిస్కో రాజా' అనే టైటిల్ నిర్ణయించారు. వి.ఐ.ఆనంద్ దర్శకత్వం లో రామ్ తళ్లూరి నిర్మిస్తున్న తాజా చిత్రం టైటిల్‌ను రవితేజ పుట్టినరోజు సందర్భంగా శనివారం ప్రకటించారు. టైటిల్ లోగో విడుదల చేశారు.

నిర్మాత మాట్లాడుతూ ''రవితేజ గారితో వరుసగా సినిమా చేయడం ఆనందంగా ఉంది. వినూత్నమైన కథల్ని ప్రేక్షకుల ముందుకి తీసుకురావడంతో మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుంది. దర్శకుడు వి.ఐ.ఆనంద్ చెప్పిన కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌ని ప్రారంభిస్తున్నాం. రవితేజగారు ఇప్పటి వరకు టచ్ చేయని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది. హైదరాబాద్‌తో పాటుగా గోవా, చెన్నై, లఢఖ్, మనాలితో పాటుగా ఉత్తర భారతదేశంలో కూడా చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నాం. అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా 'డిస్కో రాజా' అనే టైటిల్ ఖరారు చేశాం. టాలీవుడ్ బెస్ట్ టెక్నీషియన్స్ మా సినిమాకు పనిచేస్తున్నారు. థమన్ స్వరాలు అందించనున్నారు. సాయి శ్రీరామ్ ఛాయాగ్రహణం, అబ్బూరి రవి మాటలు అందిస్తున్నారు. ముగ్గురు హీరోయిన్లు నటిస్తారు. బాబీసింహా ప్రతి నాయకునిగా నటిస్తారు. వెన్నెల కిషోర్, సత్య కీలక పాత్రధారులు. త్వరలోనే తొలి షెడ్యూల్ ప్రారంభిస్తాం'' అని తెలిపారు.

# కుమార ప్రేమ

ఓ నలభై ఏళ్ల మధ్యతరగతి తండ్రికి కుమారుడు అంటే అమితమైన ప్రేమ. కోరినది ఏదీ కాదనకుండా ఇస్తుంటాడు. కుమారుడి ప్రతి కోరిక నెరవేరుస్తాడు. ఆ ప్రేమ అతడికి ఎన్ని సమస్యలు తీసుకువచ్చింది? అనేది తెలుసుకోవాలంటే మా 'ఎదురీత' సినిమా చూడాలని అంటున్నారు దర్శకుడు బాలమురుగన్.

శ్రీభాగ్యలక్ష్మి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బాలమురుగన్ దర్శకత్వంలో బోగారి లక్ష్మినారాయణ నిర్మిస్తున్న చిత్రం 'ఎదురీత'. శ్రవణ్ రాఘవేంద్ర



కథానాయకుడిగా నటించాడు. లియోనా లిషోయ్ కథానాయిక. ఇప్పటికే సినిమా చిత్రీకరణ పూర్తయింది. రిపబ్లిక్ డే సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ విడుదల చేశారు.

నిర్మాత బోగారి లక్ష్మినారాయణ మాట్లాడుతూ ''ప్రముఖ తమిళ దర్శకుడు విజయ్ మిల్టన్ వద్ద 'గోలీసోడా', 'కడుగు', తెలుగులో '10'గా విడుదలైన విక్రమ్, సమంత సినిమాకు దర్శకత్వ శాఖలో బాలమురుగన్ పనిచేశారు. ఆయన మా చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. కుమారుడి కోసం కన్నతండ్రి సాగించిన ఎదురీత ప్రేక్షకుల హృదయాలను తాకుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మార్చిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం '' అని చెప్పారు. జియాశర్మ, నోయెల్ సేన్, పృథ్వీ, మహేష్, కాశి విశ్వనాథ్, రవిప్రకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం విజయ్ అర్పుదరాజ్.

# నేటితరం ప్రేమకథా చిత్రం



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం '4 లెటర్స్'. ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మిరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. శనివారం '4 లెటర్స్' చిత్రం టీజర్‌ను దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''ప్రవాస భారతీయుడైన నిర్మాత ఉదయ్ కుమార్‌గారు నిర్మించిన ఈ 4 లెటర్స్ చిత్రం టీజర్ నేటి తరం యువతి యువకుల మనోభావాలకు అద్దం పట్టేలా ఉంది. హీరో ఈశ్వర్‌కు ఇది తొలి చిత్రమైనా ఎంతో చక్కగా నటించాడు. అతనికి మంచి భవిష్యత్తు ఉండాలని ఆశిస్తున్నాను'' అన్నారు. ''చిత్ర నిర్మాత, దర్శకుడు మంచి విజయాన్ని అందుకోవాలని'' అభిలషించారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం. ఈ నెల 30న పాటలను, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని'' తెలిపారు.

చిత్ర హీరో ఈశ్వర్ మాట్లాడుతూ ''ఎంతో మంది టాప్ స్టార్స్‌ను పరిచయం చేసిన గ్రేట్ డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు గారు నా తొలి చిత్రం టీజర్ విడుదల చేయడం, నన్ను ఆశీర్వదించడం ఆనందంగా ఉంది. ఆయన హస్తవాసి మంచిదని అంటుం టారు. ఆయన చేతుల మీదుగా విడుదలైన మా టీజర్‌తో పాటు సినిమా కూడా ప్రేక్షకాదరణ పొందు తుందనే నమ్మ కం ఉంది'' అన్నారు.

దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ ''కలుసు కోవాలని' తర్వాత తెలు గులో నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నేటి ట్రెండ్‌కు తగినట్టుగా సినిమాను తెరకె క్కిం చాం. ఒకరకంగా చెప్పా లంటే '4 లెటర్స్' నేటితరం ప్రేమకథా చిత్రం. అందుకే 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే!' అనేది ఉపశీర్షిక. ప్రేమ, పెళ్లి విషయాలలో నేటితరం ఆలోచనలు , అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటనేది వాస్తవానికి దగ్గరగా చిత్రీకరించాం. నిర్మాతలు మేకింగ్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పూర్తిచేశారు'' అని చెప్పారు.

ఈ చిత్రానికి పాటలు: సురేష్ ఉపాధ్యాయ, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: చిట్టిబాబు.కె.





# శర్వానంద్ సమంత జోడి

సంక్రాంతికి ఎఫ్2 చిత్రంతో ఘనవిజయం సాధించిన దిల్ రాజు తన తదుపరి చిత్రాన్ని శ్రీకారం చుడుతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 34వ చిత్రంగా శర్వానంద్, సమంత జంటగా సినిమా తీయనున్నారు. తమిళంలో విజయ్ సేతుపతి, త్రిష నటించిన 96 సినిమాకు ఇది రీమేక్. తమిళ చిత్రాన్ని డైరెక్ట్ చేసిన సి.ప్రేమకుమార్ తెలుగు రీమేక్ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి నుండి చిత్రీకరణ ప్రారంభిస్తారు.

# విడుదలకు సిద్ధమైన అక్కడొకడుంటాడు



రామ్ కార్తీక్, శివ హరీష్, రసగ్న దీపిక, అలేఖ్యా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా అక్కడొకడుంటాడు. శివ కంఠమనేని, రవిబాబు, వినోద్ కుమార్, ఇంద్రజ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు శ్రీపాద విశ్వక్ ఈ చిత్రాన్ని రూపొందించారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై శివ శంకర్‌రావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న అక్కడొకడుంటాడు సినిమా ఫిబ్రవరి 1న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శివ కంఠమనేని మాట్లాడుతూ...అడవి నేపథ్యంగా సాగే చిత్రమిది. ప్రేమించుకున్న ఓ జంట అనుకోకుండా కొన్ని సమస్యల్లో ఇరుక్కుంటుంది. స్నేహితుల సాయంతో వాళ్లు ఎలా సమస్యల నుంచి బయటపడ్డారన్నది కథాంశం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది సినిమా. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్, అడవుల నరికివేత, నల్లధనం ఇలా అనేక అంశాలను స్పృశించాం. సందేశాత్మకంగా సాగుతూనే వినోదాన్ని అందిస్తుంది. ఇందులో కీలక పాత్రలో నేను నటించాను. అన్నారు. నిర్మాత మాట్లాడుతూ...అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. నిర్మాత సి కళ్యాణ్ గారి సహకారంతో సినిమాను ఫిబ్రవరి 1న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. మేము ముప్పై ఏళ్లుగా పరిశ్రమలో పరోక్షంగా ఉన్నాము. సినిమాలు చేసే సామర్థ్యం వచ్చాకే నిర్మాణ రంగంలోకి దిగాము. త్వరలో మరో సినిమాను కూడా మొదలు పెట్టబోతున్నాం.అన్నారు.



# ప్రేక్షకుల స్పందన బాగుంది

'మిస్టర్ మజ్ను చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి చూశాను, చాలా హ్యాపీ అనిపించింది. వారి స్పందన బాగుంది. పూర్తిస్థాయి కుటుంబకథా చిత్రం చేయాలని ఈ సినిమా చేశాను. సినిమా విడుదలయ్యాక అన్ని చోట్ల పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. తమన్ మంచి స్వరాలు ఇచ్చారు. దర్శకుడు వెంకీ మంచి కథను, చక్కగా తెరకెక్కించారు. నిర్మాత బివిఎస్ఎన్. ప్రసాద్‌గారు గాడ్ ఫాదర్‌లా ఈ సినిమాను ముందుండి నడిపించారు. మా తాతగారితో పనిచేసిన ఆయనతో నేను సినిమా చేయడం సంతోషంగా ఉంది. తెరవెనుక ఉంటూ సపోర్ట్ చేసిన బాపినీడుకి థాంక్స్'' అని అన్నారు యువనటుడు అఖిల్ అక్కినేని.

అఖిల్, నిధి అగర్వాల్ జంటగా నటించిన 'మిస్టర్ మజ్ను' చిత్రం విడుదలై ప్రేక్షకాదరణ పొందుతున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ ''మా సినిమాకు ప్రపంచవ్యాప్తంగా భారీ ఓపనింగ్స్ వస్తున్నాయి. సూపర్‌హిట్ టాక్ తెచ్చుకుంది. అక్కినేని నాగేశ్వరరావుగారికి, నాగార్జున గారికి మజ్ను చిత్రాలు మైలురాయిగా నిలిచాయి. ఇప్పుడు అఖిల్‌కు కూడా అదే తరహాలో భారీ హిట్ సాధించాడు. త్వరలోనే అఖిల్‌తో మరో సినిమా చేస్తాను'' అని అన్నారు.


చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''సినిమాకు మంచి స్పందన వస్తోంది. హాస్య సన్నివేశాలను బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ నిధి అగర్వాల్, సంగీత దర్శకుడు థమన్ కూడా మాట్లాడారు.

# నిర్మాతలను నిఖిల్ అవమానించాడు



**- నట్టికుమార్**

కథానాయకుడు నిఖిల్ నిర్మాతలను అవమానించాడు అంటున్నారు నిర్మాత నట్టికుమార్. తాను నిర్మించిన ముద్ర సినిమాను చూడొద్దంటూ సామాజిక మాధ్యమాలలో నిఖిల్ చేస్తున్న పోస్టులను నట్టికుమార్ తప్పుబట్టారు. నిఖిల్ పోస్టుల వల్ల తమ సినిమా ఆర్థికంగా నష్టపోయిందని, ఆ నష్టం నిఖిల్ తిరిగి ఇవ్వాలని నట్టికుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో నట్టి కుమార్ మాట్లాడుతూ...నేను నిర్మించిన ముద్ర సినిమాను ఎలాంటి ప్రచారం లేకుండా ఇటీవల విడుదల చేసుకున్నాం. మా ముద్ర సినిమాకు టైటిల్ తెలుగు సినిమా వాణిజ్య మండలిలో నమోదైంది. తాజాగా ముద్ర సినిమా ప్రదర్శనలు చూడవద్దంటూ నిఖిల్ తన సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా పోస్టులు చేస్తున్నారు. దీంతో మా సినిమాకు నష్టం జరుగుతోంది. ఈ పోస్టుల ద్వారా నిర్మాతలను నిఖిల్ అవమానపరుస్తున్నాడు. మా చిత్రంతో సమస్య ఉంటే మీ నిర్మాతలు మాట్లాడాలి. మా చిత్రానికి జరిగిన నష్టాన్ని నిర్మాతల మండలి దృష్టికి తీసుకెళ్తాం. అన్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
☞ ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076